# ఇతిహాసాలలో మహర్షులు - ధర్మప్రబోధాలు

రచయిత

**ఆచార్య జి. దామోదర నాయుడు**

TIRUMALA TIRUPATI DEVASTHANAMS

श्रीनिवासो विजयते

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2024**

# ITHIHASALALO MAHARSHULU - DHARMAPRABODHALU

**By**
**Prof. G.Damodara Naidu**

**Editor**
**Dr. Akella Vibhishana Sarma**
Special Officer
Publications Division

T.T.D. Religious Publications Series No. 1498

© All Rights Reserved

First Edition : 2024
Copies : 500

*Published by*
**Sri J. Syamala Rao,** I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati - 517 507.

***DTP***
Publications Division
T.T.D, Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.





# ముందుమాట

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం యాత్రికులకు అనేకవిధాల వసతి, దర్శన, అన్నప్రసాద వితరణలతోబాటు ప్రాచీన ఆలయాల పునరుద్ధరణ, వెనుకబడిన ప్రాంతాలలో ఆలయనిర్మాణంలాంటివి కొనసాగిస్తున్నది. వేదోద్ధరణతోబాటు ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. వీటితోబాటు భారతీయ ఆర్షసిద్ధాంతాలకు మూలమైన వేదోపనిషత్ ఇతిహాసకావ్యాలను ప్రచురిస్తున్నది.

భారతీయసంస్కృతికి రెండు కళ్ళలాంటివి రామాయణభారతాలు. సంస్కృతంలో రామాయణం 24 వేల శ్లోకాల పరిమిత గ్రంథమయితే భారతం లక్ష శ్లోకాలతోకూడినది.

ఈనాడు పాఠకులు ఆర్షసాహిత్యాన్ని వివిధ కోణాలలో అధ్యయనం చేస్తూండడాన్ని గుర్తించి ప్రాచీన సాహిత్యంలో మహిళల గురించి, యుగయుగాలుగా భారతీయసంస్కృతిని దృష్టిలో పెట్టుకొని జాతికి మార్గదర్శకులయిన మునులు, ఋషులు, యోగులు గతంలో గావించిన ధార్మిక ప్రబోధాలను సామాన్య ప్రజలు అర్థం చేసుకొనేలాగా ప్రముఖులచే గ్రంథాలు వ్రాయించి ముద్రిస్తున్నది. ఈ కోవలో వెలువడుతున్నదే ఈ "ఇతిహాసాలలో మహర్షులు – ధర్మప్రబోధాలు" అనే ఈ గ్రంథం.

వీటిలో రాజర్షుల కథలతోబాటు మహర్షుల కథలున్నాయి. రామాయణంలోని ఋషులలో అగస్త్యమహర్షి, అత్రిమహర్షి, గౌతముడు, వసిష్ఠుడు, వాల్మీకి, విశ్వామిత్రుడు, శరభంగులు ముఖ్యులు. మహాభారతానికి సంబంధించిన ఋషులలో ముఖ్యులు అష్టావక్రమహాముని, ఆస్తీకుడు, కశ్యపుడు, దుర్వాసుడు, జమదగ్ని, పరాశరుడు, వేదవ్యాసుడు, శృంగి మొదలైనవారు. వీరందరు తమ పరిధిలో రాజులకు, రాజపరివారాలకు

అలాగే సమాజంలోనివారికి ధార్మికసందేశాలు అందించినవారే. ఇలాంటి ఇతిహాసాలలోని మహర్షుల ధార్మిక ప్రబోధాంశాలను సేకరించి గ్రంథం రచించిన ఆచార్య జి.డి. నాయుడు గారిని అభినందిస్తున్నాను.

చక్కటి గ్రంథాలను ఎంపికచేసి సకాలంలో ముద్రాపింపజేయడంలో కృషిచేస్తున్న తి.తి.దే. ప్రచురణల విభాగ ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మగారికి నా అభినందనలు.

*సదా శ్రీవారి సేవలో...*

జె. శ్యామల రావు

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# వినతి

శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో 'విద్యలలో తాను ఆధ్యాత్మికవిద్యను' అని స్పష్టం చేశాడు. అందుకు అనువుగా విభూతియోగంలో అక్షరాలలో అకారాన్ని, మహమునులలో కపిలుణ్ణి అంటూ అనేకాంశాలను స్పష్టం చేశాడు. వేదవాఙ్మయం పరిశీలిస్తే ప్రతి మంత్రానికి ఛందస్సు, ఋషి పేరు కనబడుతుంది. వేదాలను మిత్రసమ్మితాలుగా బోధించిన పురాణవాఙ్మయం లోను, కాంతాసమ్మితంగా అలరించే కావ్యవాఙ్మయం లోను ఋషులు, మహర్షులు, రాజర్షులు, బ్రహ్మర్షులు, మునుల ప్రస్తావన విస్తారంగా కనిపిస్తుంది. ఈనాడు ఋషి, ముని శబ్దాలు వాడుకలో సమానంగా ఉన్నాయి. కాని వ్యుత్పత్తి దృష్ట్యా వీటి వివరణలు భిన్నభిన్నంగా ఉన్నాయి.

అమరం 'ఋషయః సత్యవచసః' జ్ఞానస్య పారగమాత్ ఋషిః, జ్ఞానము యొక్క పారమును బొందినవాడు. 'సత్యం వచ యేషాం తే సత్యవచసః' సత్యమైన వాక్కులు కలవాడు అని గురుబాలప్రబోధిక వివరణ. అలాగే దేవర్షులనడానికి త్రికాలజ్ఞానం కలవారు, నిత్య సత్యవచనులు, స్వయంగా జ్ఞానులు, గర్భస్థ శిశువులకు జ్ఞానప్రదాతలు మంత్రప్రవర్తకులు, త్రిలోక సంచారులు, ఋషిపరివృతులు దేవర్షులని వాయుపురాణం ఆధారంగా వివరణ ఇచ్చింది. అలాగే 'వాచం యమో మునిః' – వాక్కును నిలుపువాడు, జ్ఞానము కలవాడు, మౌనవ్రతం పాటించేవాడు, ఇంద్రియ వ్యాపారాలను ఉపశమింపజేయువాడు, తపము వలన కష్టములు ఓర్చువాడని కూడా తెలియచేసింది.

సంస్కృతవాఙ్మయంలో ఇతిహాసాలకు అత్యంత ప్రామాణ్యమున్నది. రామాయణభారతాలకు ఇతిహాసాలని పేరు. రామాయణ రచయిత వాల్మీకి. భారతగ్రంథకర్త వ్యాసుడు. ఈ ఇరువురు తమ కాలంనాటి రాజుల చరిత్రలను, తాము దర్శించిన వారి స్వభావాలను యథాతథంగా వర్ణించినవారే. ఈ ఇతిహాసాలన్నిట వైదిక, పురాణచ్ఛాయలున్నాయి. వీటిలో ఋషుల కథలు

మెండు. ప్రధానకథలో విశిష్టపాత్రులు. వీరి జీవితం, బోధన, అనువర్తనం అన్నీ ఇతరులకు ఆదర్శప్రాయం. అంతేగాక వీరు తమ ప్రవర్తనచేత, బోధనచేత వెల్లడించిన అనేకాంశాలు ఆదర్శప్రాయాలు. ఈ దృష్టితో మహేతిహాసాలలో మహర్షుల గురించి సామాన్యులకు అందుబాటుగా తి.తి.దే. ప్రచురించాలని సంకల్పించడం ఉత్తమోత్తమమయిన సాహిత్యకైంకర్యం.

ఇతిహాసాలలో రామాయణం మొదటిది, మహావిష్ణువు 7వ అవతారమయిన శ్రీరామావతారాన్ని కీర్తించేది. మాయామానుష విగ్రహుడయిన రాముని కథ కనుక 'రామ+అయనం' అని ఒక విభాగం. రామాయణంలో సీతమ్మ పాత్ర విశిష్టం కనుక 'సీతాయాశ్చరితం మహత్' అని మరొక విభాగం. నిజం చెప్పాలంటే శ్రీరామకథతో అనుబంధం కల మహర్షులు, మునులు, తాపసులు అందరివలన రామాయణానికి విశిష్టత చేకూరింది. వీరందరు శ్రీరామచంద్రుని విఖ్యాతికి దోహదం చేసినవారే.

శ్రీమద్రామాయణం 24 వేల శ్లోకాలు కలది. ఆరు కాండలుగా విభక్తమయినది. ఉత్తరకాండతో కలిపి 7 కాండలు. ఈ ఇతిహాసాన్ని పరిశీలిస్తే ఋషులు రెండు రకాలవారుగా కనిపిస్తారు. ప్రత్యక్ష అనుబంధం కలవారు. ప్రాస్తావిక సంబంధం కలవారు. ఈ దృష్టితో అవలోకించినపుడు వాల్మీకి, నారద, వసిష్ఠ, విశ్వామిత్ర, గౌతమ, భరద్వాజ, కాశ్యప, కాత్యాయన, సుయజ్ఞ, విజయాదులున్నారు. అలాగే అశ్వమేధయాగ సందర్భంలో పైవారితో మార్కండేయ, మౌద్గల్య, గర్గ, చ్యవన, శతానంద, అగస్త్యాది దివ్యఋషులు, మహామునులు తమ తమ శిష్యపరివారంతో వచ్చినట్లు ఉత్తరకాండ విశదం చేస్తున్నది. వీరిలో ప్రధానకథతో అనుబంధం గల మహర్షుల గురించి సంగ్రహంగా చెప్పడమే ఈ రచనోద్దేశ్యం.

# విషయసూచిక

## శ్రీమద్రామాయణంలో ఋషులు


| | | |
|---|---|---|
| 1. | అగస్త్యమహర్షి | 1 |
| 2. | అత్రిమహర్షి | 3 |
| 3. | గౌతముడు | 5 |
| 4. | జాబాలి | 7 |
| 5. | నిశాకరమహర్షి | 10 |
| 6. | భరద్వాజ ఋషి | 12 |
| 7. | మతంగమహాముని | 14 |
| 8. | వసిష్ఠుడు | 15 |
| 9. | వాల్మీకి | 19 |
| 10. | విశ్వామిత్రుడు | 22 |
| 11. | శరభంగమహాముని | 25 |
| 12. | సుతీక్ష్ణముని | 26 |


## మహాభారతంలో మునులు


| | | |
|---|---|---|
| 1. | అగస్త్యమహర్షి | 28 |
| 2. | అత్రిముని | 31 |
| 3. | అష్టావక్రమహాముని | 33 |
| 4. | ఆస్తీకముని | 35 |

| | | |
|---|---|---|
| 5. | ఉదంకుడు | 37 |
| 6. | ఔద్దాలకి | 38 |
| 7. | ఔర్వుడు | 39 |
| 8. | కపిలమహాముని | 40 |
| 9. | దధీచి | 41 |
| 10. | కణ్వమహర్షి | 42 |
| 11. | కశ్యపుడు | 43 |
| 12. | కిందముడు | 44 |
| 13. | గౌతముడు | 45 |
| 14. | చండకౌశికుడు | 46 |
| 15. | చ్యవనుడు | 47 |
| 16. | జమదగ్ని | 49 |
| 17. | దుర్వాసుడు | 50 |
| 18. | నారదమహర్షి | 52 |
| 19. | పరాశరమహర్షి | 55 |
| 20. | పులస్త్యబ్రహ్మ | 56 |
| 21. | బకమహర్షి | 57 |
| 22. | బకదాల్భ్యముని | 58 |
| 23. | బృహదశ్వుడు | 59 |

24. భరద్వాజమహర్షి 60

25. భార్గవచ్యవనముని 61

26. భృగుమహర్షి 62

27. మాండవ్యముని 63

28. మార్కండేయుడు 64

29. మైత్రేయమహర్షి 65

30. రోమశమహర్షి 67

31. వసిష్ఠవిశ్వామిత్రులు 68

32. వామదేవుడు 71

33. వాలఖిల్యులు 72

34. వేదవ్యాసుడు 73

35. శాండిలి 77

36. శృంగి 77

37. సనత్సుజాతుడు 78

38. సహస్రపాద 79

ప్రసిద్ధ ధార్మికసూక్తులు – ధర్మానికి సంబంధించిన సంస్కృతసూక్తులు 80

# శ్రీమద్రామాయణంలో ఋషులు

## 1. అగస్త్యమహర్షి

మిత్రావరుణుల కుమారుడు అగస్త్యుడు. ఇతనికి కుంభసంభవుడని మరొక పేరు. 'అగం' అంటే కొండ. కొండను అణచడం వల్ల అగస్త్యుడు అయ్యాడు. వింధ్యపర్వతవిజృంభణాన్ని అణచడం వల్ల ఈ పేరు వచ్చింది. ఇతనికే 'అగస్తి' అని కూడా పేరు. అగస్త్యుని భార్య లోపాముద్ర. ఇతడు పొట్టివాడయినా గట్టివాడు. పురాణేతిహాసవాఙ్మయంలో సుప్రసిద్ధుడు.

శ్రీమద్రామాయణం అరణ్యకాండలో అగస్త్యమహర్షి ప్రస్తావన కనిపిస్తుంది. సీతాలక్ష్మణసమేతుడయిన శ్రీరామచంద్రుడు తండ్రి ఆనతితో వనవాసానికి కదిలినవేళ మొదట దర్శించిన ముని సుతీక్ష్ణుడు. ఆ మునితో తనకు అగస్త్యమహామునిని దర్శించాలనే కోరిక ఉన్నట్టు శ్రీరాముడు ప్రకటించాడు. ఆ ముని శ్రీరామచంద్రుని విన్నపానికి అభినందించాడు. ఆ మునిసందర్శనవల్ల శ్రీరాములవారికి ఎంతో మేలు కలుగుతుందని, ఆ కారణాన లోకోపకారం జరుగుతుందని అగస్త్యాశ్రమప్రదేశానికి వెళ్ళే మార్గం సూచించాడు. శ్రీరాముడు దారిలో 'అగస్త్యభ్రాత' ఆశ్రమం చేరుకొని, ఆపై రమణీయమైన, భౌతిక, ఆధ్యాత్మికాల పరస్పర సమ్మేళనంతో పరిణితి పొందిన పవిత్ర స్థానాన్ని చేరుకొన్నాడు. తన ఆశ్రమానికి సీతారామలక్ష్మణులు వస్తున్నారనే సందేశంతో అగస్త్యుడు మహదానందభరితుడై తానే ఎదురేగి స్వాగతం పలికాడు, శ్రీరాములవారు అడుగకపోయినా.

శ్రీరామచంద్రా! నా దగ్గరికి ప్రియమైన అతిథిగా రావడం నాకెంతో సంతోషం. నా దగ్గరున్న దివ్యరత్నకాంచన, మహోజ్వలమయిన విష్ణుమూర్తి ధనుస్సును నీకిస్తున్నాను. ఆ ధనుస్సు సూర్యతేజస్సు కలది. బ్రహ్మచేత ఇవ్వబడింది. దీనితోపాటు అక్షయబాణాలు గల రెండు అమ్ముల

పొదులను కూడ ఇస్తున్నాను. అలాగే దేవేంద్రుడు ఇచ్చిన బంగారు ఒరపిడితో ఉన్న దివ్యఖడ్గాన్ని కూడ నీవే పుచ్చుకో అన్నాడు. వాటిని శ్రీరాముడు, అగస్త్యముని ఆశీస్సులతో గ్రహించాడు.

తదనంతరం, రాముడు తన వనవాసకాలం ప్రశాంతంగా సాగడానికి తగిన ప్రదేశం సూచించమని అడిగాడు. అగస్త్యుడు వెనువెంటనే, తన ఆశ్రమవాటికకు రెండు యోజనాల దూరంలో గల "పంచవటి" ప్రాంతాన్ని సూచించాడు. అక్కడి ప్రకృతిసౌందర్యం మనోహరం మరియు నివాసయోగ్యం అన్నాడు. శ్రీరాముడు సీతాలక్ష్మణులతో పంచవటి ప్రాంతంలోనే పది సంవత్సరాలు వనవాసం పూర్తి చేసుకొన్నాడు. ఆ సమయంలో అగస్త్యుడు 'రామా! వనవాసకాలం పూర్తి కావస్తున్నది. అయోధ్యకు వెళ్ళి పట్టాభిషేకం చేసుకొందువు గాని అన్నాడు. ఆపై సీతాదేవిసౌశీల్యాన్ని అగస్త్యుడు ప్రశంసించాడు.

రామచంద్రా! సీత కోరి నీతో వచ్చిన సతీమణి. దుష్కర వనవాస క్లేశాన్ని భరిస్తూ నీతో కదిలిన దృఢచిత్తురాలు. సామాన్య స్త్రీలలో కనిపించే దోషాలు లేని సుగుణశీల. ఆ కారణాన సీత ఎప్పుడయినా, ఏదయినా నోరుతెరచి అడిగితే నీవు కాదనక, నెరవేర్చు అన్నాడు.

పంచవటిలో ఉండగానే శూర్పణఖ రాక, ఖరదూషణాదుల వధ, మాయలేడిని సీత కోరడం, రావణుడు కపట యతివేషంతో సీతమ్మను అపహరించడం లాంటివి జరిగాయి.

ఈ అగస్త్యవృత్తాంతం భావికథాసూచకం. అగస్త్యమహర్షి సలహా మేరకే సీతమ్మ కాంచనమృగంపై ఆశపడినప్పుడు లక్ష్మణుడు వారించినా తాను కదిలాడు. క్షత్రియులు తనకు తానై దేనిని అడుగరాదు. కనుక అగస్త్యుడు చాపతూణీరఖడ్గాదులను శ్రీరాములవారికి ప్రసాదించాడు. ఈ కారణంగా రాక్షససంహారం సులభతరమయినది.

అగస్త్యుని ఆలోచన, సూచనలన్నీ శ్రీరాముల భవిష్యత్కార్య సూచకాలు కావడం గుర్తింపదగ్గది. విశ్వామిత్రుడు, తాను సమర్థుడయినా, రామునిచేత యాగసంరక్షణ చేయించి, శ్రీరామప్రశస్తిని పెంచినట్లు, అగస్త్యుడు కూడ తన దగ్గర గల ఆయుధాలను ప్రసాదించి లోకోపకారానికి సహకరించాడు. అగస్త్యుని ప్రతిచర్య లోకసముద్ధరణార్థమే.

## 2. అత్రిమహర్షి

శ్రీమద్రామాయణంలో అయోధ్యాకాండలో సీతారామలక్ష్మణులు దర్శించిన పుణ్యదంపతులలో అత్రి అనసూయాదంపతులొకరు. ముని దంపతులలో వీరికున్న పేరుప్రసిద్ధి మరెవ్వరికీ లేదు.

భరతుడు అయోధ్యకు మరలి వెళ్ళిన తర్వాత సీతారామలక్ష్మణులు చిత్రకూటప్రాంతాన్ని వదిలిపెట్టాడు. ఇందుకు అయోధ్య నుండి భారీగా వచ్చిన చతురంగబలముల సంచారకారణంగా ఆ ప్రదేశం కశ్మలం కావడం మరొకటి. ముగ్గురు తల్లుల స్మృతులు తనను వెంటాడడం కూడా ఒక కారణం. ఈ దృష్టితో సీతారాములు ఆపై 'అత్రి' ఆశ్రమం చేరుకున్నారు. ఆ ముని, శ్రీరాముని పుత్రుని లాగా ఆదరించాడు. శ్రీరాములకు కలిగిన కష్టాలు తెలిసినవారు కావడంతో, అనునయ వాక్యాలతో ఓదార్చాడు. తానే స్వయంగా అతిథి సత్కారాలు చేశాడు.

ఇంతలోనే 'అనసూయాదేవి' అక్కడికి వచ్చింది. సీతారాములకు, ఆ తల్లి పరదేవతాస్వరూపిణిగా కనిపించింది. అత్రిమహాముని ఆమెను పరిచయం చేస్తూ, అనసూయతపోమహత్త్వాన్ని విశదం చేశాడు.

సతీపతులలో ఒక పతి సతిని గురించి ఎదుటివారితో గొప్పగా చెప్పడం అత్రిమహామునిలో కనిపిస్తుంది. ఈ రోజుల్లో ఇలాంటివి పునరుద్ధరింపబడాలి.

'ఒకసారి దుర్భరమయిన క్షామంతో లోకాలన్నీ తల్లడిల్లగా ఈమె ఋషిలోకానికంతకు కందమూలఫలాలు సమృద్ధిగా సమకూర్చి ఇలపై గంగానదిని ప్రవహింపజేసింది. ఒకసారి దేవకార్యం కోసం పదిరాత్రులు ఒకే రాత్రిగా పరివర్తింపజేసింది. సమస్త ప్రాణులకు ఈమె పూజ్యురాలు. ఈమెకు కోపం లేనేలేదు, రానేరాదు' అని ఆమె ప్రభావాన్ని గూర్చి శ్రీ సీతారామలక్ష్మణులకు చెప్పాడు అత్రిమహాముని. సీతాదేవి ఈమెను సేవించుకోవాలి అనికూడా సూచించాడు.

సీతాదేవితో అనసూయమ్మకు పరిచర్యలు చేయవలసినదిగా కూడా చెప్పాడు శ్రీరాముడు. ఆమె ఎంతో వినయంతో, భక్తిప్రపత్తులతో వెళ్ళి, అనసూయాదేవితో తన పేరు చెప్పుకొని, తన తల్లిదండ్రుల గురించి, తన మెట్టినిల్లు గురించి మనవి చేసుకొని పాదాభివందనం చేసింది.

సీతాదేవిసంస్కారానికి అనసూయ మెచ్చుకొంది. అంతేకాదు, ఆమెపట్ల తనకు గల అభిమానాన్ని, ఆదరాన్ని, గౌరవాన్ని బాహ్యంగా ప్రకటించుకొంది. ఆమె పాతివ్రత్యాన్ని, భర్తతోటి అరణ్యవాసాన్ని శ్లాఘించింది. నీవు కీర్తి, ధర్మాన్ని సంపాదిస్తావని అక్కున చేర్చుకొంది. ఆపై

సీతమ్మా! నీ కళ్యాణాన్ని గురించి ఆ నోటా, ఈ నోటా విన్నాను. నీ పెళ్ళిగాథ పరమాద్భుతం. ఆ కథ చెప్పవూ అంటూ, అడిగించుకొని విని ఆనందించింది. చివరకు "సర్వకాల సర్వావస్థలలోను సర్వ సౌందర్యరాశిగా కనిపించే సకల సౌభాగ్య సన్మంగళమయిన వరాన్ని నీకు ఇస్తున్నాను. నిరంతరం సువాసనలు చిమ్మే అంగరాగాలు ఇస్తాను. ఎప్పుడూ వాడని దివ్యసుగంధ పుష్పమాలికను ఇస్తాను. సీతమ్మా! వీటిని ఇప్పుడే ధరించు. నా కనులవిందుగా కనిపించవమ్మా" అంది. అనసూయ ముందు అలంకృత సీతమ్మ సౌందర్యరాశిగా కనిపించింది. అనసూయాదేవి అనుగ్రహం కలిగినందుకు రామలక్ష్మణులు

సంబరపడ్డారు. ఆ మరుసటి ఉదయమే సీతారామలక్ష్మణులు ఆ దివ్యదంపతుల ఆశీస్సులు పొంది అరణ్యవాసానికి కదిలిపోయారు.

ఋషులలో అత్రిమహాముని స్థానం పదిలమయినది. వేంకటేశ్వర సుప్రభాతములో 'అత్ర్యాది సప్త ఋషయః' శ్లోకంలో అత్రిముని ప్రసక్తి కనిపిస్తుంది. ఒక స్త్రీ ఎలా వుండాలో అనడానికి అనసూయ అనుగ్రహం సాక్ష్యం. ఏకవస్త్రధారిణిగా సీతమ్మ అరణ్యవాసం గడపడానికి అనసూయ అనుగ్రహమే సాక్ష్యం. పోతన "జీర్ణమలినాంబరధారిణి" అని సీతమ్మను వర్ణించాడు. త్రిమూర్తులనే పసిపాపలుగా మార్చిన "పతివ్రతాశిరోమణి" అనసూయ.

ఉత్తమ స్త్రీలను గౌరవించాలని ధర్మప్రబోధం. 14 ఏళ్ళ అరణ్యవాసంలో స్త్రీలు ఎదుర్కొనే ఇబ్బందులను గుర్తించి అనుగ్రహించడం ధర్మప్రబోధం.

## 3. గౌతముడు

పురాణేతిహాసాలలో గౌతమనామధేయులెందరో. నిద్ర లేవగానే మానవులు స్తుతించే ఋషులలో గౌతముడు ఒకడు. ఈతడొక బ్రహ్మర్షి. ఇతని భార్య అహల్య. పంచకన్యలలో ఒకతె. ఇతని వృత్తాంతం బాలకాండ 4, 8వ సర్గలో చెప్పబడింది.

విశ్వామిత్రునితో వెళ్తున్న శ్రీరాముడు మిథిలానగరానికి దగ్గరి అరణ్యప్రాంతంలో శోకాన్వితమయిన ఆశ్రమాన్ని చూచి కుతూహలంతో ఈ ఆశ్రమం ఎవరిదని ప్రశ్నించగా, విశ్వామిత్రుడు, అహల్యాగౌతముల వృత్తాంతం చెప్పాడు.

ఈ ఆశ్రమం ఒకప్పుడు దివ్యంగా వెలిగినది, దేవతలచే కొనియాడబడినది గౌతముని ఆశ్రమం. ఇచటనే గౌతముడు అహల్యా

సమేతుడయి అనేక సంవత్సరాలు తపస్సు చేశాడు. త్రిలోకాధిపతి అయిన దేవేంద్రుడు, గౌతముని భార్య అయిన అహల్యపై కన్నువేసినవాడై గౌతముడు లేనివేళ మునివేషంతో అహల్య దగ్గరికి వెళ్ళి ఆమెతో సంగమించడం తప్పు కాదన్నాడు. దేవేంద్రలగ్నమనస్క అయిన అహల్య అందుకు మనసా అంగీకరించింది. సంగమం అనంతరం "సురశ్రేష్ఠ! గచ్ఛ" అన్నది. దేవేంద్రుడు సంతృప్తి పొందాను అంటూ, గౌతముడు వస్తాడేమోనని పర్ణశాల నుండి బయటకు వస్తుండగా గౌతముడు దేవేంద్రుని చూచాడు. కళావిహీనుడయిన, బిత్తరచూపులతో దిక్కులు చూస్తున్న దేవేంద్రుణ్ణి గౌతముడు చూచి కోపంతో

'దుర్మతీ! నా రూపంతో వచ్చి తగనిపని చేశావు. అందుచేత నీ వృషణాలు ఊడిపడతాయి' అని శపించాడు. అలాగే అహల్యను చూచి

**"వాయుభక్షా నిరాహారా తప్యంతీ భస్మశాయినీ**
**అదృశ్యా సర్వభూతానామాశ్రమేఽస్మిన్నివత్స్యసి"**

దశరథతనయుడయిన రాముడు ఈ భయంకరాశ్రమానికి ఎప్పుడు వస్తాడో అప్పుడు నువ్వు పవిత్రురాలవవుతావంటూ, ఎప్పుడయితే శ్రీరాముల వారికి ఆతిథ్యమివ్వడంతో లోభ, మోహాదులు నశించగా నీ స్వస్వరూపంతో నా దగ్గరికి చేరగలవని శాపవిమోచనం కూడా చెప్పాడు. ఆపై హిమాలయాలకు వెళ్ళిపోయాడు. అలాగే అహల్య శాపవిమోచనతో రూపవతి అయ్యింది. రామలక్ష్మణులు ఆ తల్లికి నమస్కరించారు. అహల్య శ్రీరామునికి అతిథిమర్యాదలు చేసింది. దేవతల భేరీనినాదాలతో పూలవాన కురిసింది. ఆపై గౌతముడు అహల్యను స్వీకరించి అచ్చటనే తపం కొనసాగించాడు.

శ్రీమద్రామాయణంలో వాల్మీకి గౌతముని మహాత్ముడన్నాడు. అతని ఆశ్రమం "దివ్యసంకాశః సురైరపి సుపూజితః" అన్నాడు.

**"దేవదానవదుర్ధర్షం, తపోబలసమన్వితం**
**తీర్థోదకపరిక్లిన్నం, దీప్యమానమివానలమ్"**

అన్నాడు. అలాగే "వృత్తసంపన్నమ్" అంటూ సదాచార సంపన్నుడని కొనియాడినాడు. అహల్యకు శాపమిచ్చిన గౌతముడు "మహాతేజస్వి, మహాతపస్వి"గా కనిపించాడన్నాడు. అహల్యాశాపవిమోచనానంతరం, అహల్యతోబాటు గౌతముడు కూడా రాముని పూజించాడు.

పదుగురి ముందు పెళ్ళాడిన తరుణిని, తెలిసో, తెలియకనో తప్పు చేసిన మానవతిని పదుగురిముందు స్వీకరించడం సబబు. అంతేగాక పశ్చాత్తాపతప్తకు శిక్ష కూడా అవసరమే. విశ్వామిత్రుని సమక్షంలో అహల్యాపరిగ్రహణం గౌతముని శ్రేష్ఠత్వాన్ని నిరూపిస్తున్నది.

గౌతముని కథ భారతం అరణ్య, శాంతి పర్వాలలో కూడా ఉంది. గౌతముని పేర వెలసిన గౌతమవంశంలో అహల్యాహ్రదంలో స్నానమాడినవారు ఉన్నతస్థానాలు పొందుతారని, వారికి సిరిసంపదలు అబ్బుతాయని అరణ్యపర్వంలో వర్ణితం.

ఈ కథ తరువాతికాలంలో పలు పోకడలకు పోయింది. మోహశృంగారకావ్యాలలో అహల్య సంక్రందనంలో నాయికాస్థానంలో వెలిగింది. ఇందుకు 'అవగాహనాలోపం' ప్రధాన కారణం. కాని ఈ కథను సాధకుని యొక్క సాధనాక్రమంగా సమన్వయించినవారు కూడా లేకపోలేదు.

## 4. జాబాలి

శ్రీమద్రామాయణం అయోధ్యాకాండలో దర్శనమిచ్చే ముని జాబాలి. ఇతరుల మునులకంటే భిన్నంగా కనిపించే బ్రాహ్మణోత్తముడు.

భరతుడు శ్రీరామచంద్రులవారిని తనతో అయోధ్యకు వెంటబెట్టుకొని వెళ్ళాలన్న వేళ, రాముడా కోర్కెను తిరస్కరించాడు. ఆ సందర్భంలో జాబాలి వింతగా "హేతువాదమే ప్రమాణం. ప్రత్యక్ష అనుభవానికి రాని పరలోకసుఖాలు, దుఃఖాలు, అమూర్తమయిన పాపపుణ్యాలు, సత్యాసత్యాలు ప్రమాణం కాదన్నాడు. ఇంకా చాలక ఈ లోకంలో ఎవరు, ఎవరికి మిత్రులు కారు, విరోధులూ కారు, చుట్టాలు కారు, పగవారు కారు. ఏ ప్రాణి అయినా ఒంటరిగా పుడతాడు. ఒంటరిగానే మరణిస్తాడు. జనన, మరణాలు ఇలా ఉంటే, వీడు నా తండ్రి, ఆమె నా తల్లి అనడం, వ్యామోహం పెంచుకోవడం, వాటిని గుర్తుంచుకొని శ్రాద్ధాదులు చేయడం అర్థరహితం. ఈ తతంగాన్ని సృష్టి చేసినవారు స్వార్థపరులు. అంధవిశ్వాసాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని వ్యాపారం చేసేవారు. పిండప్రదానం పరలోకవాసులకు అందుతుందనడం అర్థరహితం. మనం ఒకచోట వాసం చేసుకొని ఆపై ఆ ఊరు వదిలిపెడతాం. ఆ గ్రామంలో ఆ గ్రామవాసులతో నిరంతర సంబంధం ఎలా? అలాగే, ఈ జగత్తులో ఎవరికి, ఎవరూ కారు. మార్గమధ్యంలో కలవడం, నడవడం, ఏదో మాట్లాడుకోవడం, ఆపై విడిపోవడం సహజం. అలాగే కనిపించిన సంబంధాలు ఇవన్నీ అస్థిరాలు, భ్రమలు.

శ్రీరామచంద్రా! బాగా ఆలోచిస్తే నీలాంటివారికి కాననావాసం క్లేశదాయకం. నీకోసం అయోధ్యాలక్ష్మి స్వాగతం చెప్పడానికి సిద్ధంగా ఉంది. నీవు దేవేంద్రునిలా సకల భాగ్యాలు అనుభవిస్తూ అయోధ్యలో కాలం గడుపు. ఈ లోకంలో కొందరు స్వప్రయోజనదృష్టితో వ్రతాలు, నోములు, దానధర్మాలు, దైవారాధనలు, యాగాలు, జపతపాదులు మొదలైన వాటిని గోరంతదాన్ని కొండంతగా గ్రంథాలలో వ్రాసి ప్రజలను నమ్మిస్తున్నారు.

అయినా రామా! తండ్రి ఎవరు? కొడుకు ఎవరు? తండ్రిమాట జవదాటననడం అర్థరహితము. అదిగో భరతుడు నీ సోదరుడే రమ్మంటుంటే నీవు భీష్మించుకోవడం తగదన్నాడు.

అపుడు రాముడు – ఓ బ్రాహ్మణోత్తమా! నీ వితండవాదనలో నిజం ఎవరినో సంతోషపెట్టాలని ఆడినట్లున్నది. ఇలా ఆలోచించడం, కుతర్కవ్యాఖ్యానం చేయడం – నాస్తిక సంప్రదాయం. ఇవన్నీ వేద, ధర్మశాస్త్ర విరుద్ధాలు. వీటిని కాదనడం వల్ల పాపం, అపచారం. ఇలాంటి వాటివల్ల పరిమిత జనంలో గౌరవాదులు కాదు, ప్రాజ్ఞులు కూడా మెచ్చుకోరు.

నేను క్షత్రియుణ్ణి, రాజపుత్రుణ్ణి, వేదాదులు చదివిన నేనే ఇలా చేస్తే లోకులు ఇదే మార్గమని నాలాగే చేస్తారు. ధర్మచ్ఛేదకమయిన తరాలను అంగీకరించను. రాజధర్మం సత్యస్వరూపాన్ని నిరూపించ గలగాలి, నిర్మూలించకూడదు. "సత్యాన్నాస్తి పరం పరం" అని నీకు తెలియదా?

సత్యాన్ని మించిన ఉన్నతస్థానం లేదు. తండ్రిది సత్యప్రతిజ్ఞ. నేను తండ్రికి తగ్గ కుమారుణ్ణి. కనుక నాదీ సత్యప్రతిజ్ఞ. అంతఃశుచి, బాహ్యశుచిని పాటించే రాజపుత్రుణ్ణి. అంతేకాదు లోకులు ధర్మాన్ని ఆచరించాలి. కర్మలు చేయాలి. సత్పురుషుల మార్గంలో నడవాలి.

అయినా, జాబాలి, నీవు చార్వాకమతమును ప్రచారం చేస్తున్నావు. ధర్మవిశ్వాసకులు ఈ వాదాన్ని ఎపుడో త్రోసిపుచ్చారు. అహింస, సత్యం, యజ్ఞం, దానం, తపస్సులే ఉత్తమోత్తమం అన్నాడు. ఈ వాదనలు జాబాలికి నచ్చలేదు. అయినా జాబాలి, తన్ను అపార్థం చేసుకోకూడదని

రామా! నేను నాస్తికుడను కాను. పరలోకాలు లేవని అనడం లేదు. శుభాశుభాలు లేవని అనను. వాదం కోసమే ఇలా అన్నాను

అన్నాడు. ఆ సందర్భంలో వసిష్ఠులవారు జాబాలి నాస్తికుడు కాదని, పుణ్యలోకాలు నిరాకరించటం లేదని శ్రీరాములవారికి సర్దిచెప్పాడు.

సత్యనిరూపణం రెండు రకాలు. నిషేధరూపంలో వాదిస్తూ సత్యప్రతిష్ఠ చేయడం. జాబాలివాదన ఇలాంటిదే. సత్యాన్ని చెప్పినవాడు, సత్యానికి బద్ధుడయినవాడు యోగ్యుడు. ఈ దృష్టితో కొందరు జాబాలిని ఋషిగా పరిగణిస్తారు.

ఆధునిక జగత్తులో వితండవాదానికి బలం ఎక్కువ. వితండవాదం ముందు ధార్మికవాదం గజగజవణకిపోతుంది. ఇలాంటివేళ రెంటిని చెబుతూ శాశ్వతమూ, సంప్రదాయబద్ధమూ అయిన ధర్మాన్ని నిరూపించవలసింది పెద్దల కర్తవ్యం. ధర్మప్రబోధం కన్నా ధర్మాచరణం సర్వులను ఆకర్షింపజేస్తుంది.

## 5. నిశాకరమహర్షి

శ్రీమద్రామాయణం, కిష్కింధకాండలో ప్రస్తావితమయిన దివ్యతపోధనుని వృత్తాంతమే "నిశాకరమహర్షివృత్తాంతం". ఇతని నివాసం వింధ్యపర్వతం దరిదాపుల్లో. అతడు "అప్రతిహత దివ్యసంపన్నుడు", ''అమేయతపఃప్రభావుడు''. అతనితో క్రూరమృగాలు, పెంపుడు జంతువులుగా సంచరించేవి. అతని స్నేహితులు జటాయువు మరియు సంపాతి.

ఒకసారి అన్నదమ్ముల మధ్య ఒక పోటీ వచ్చింది. సూర్యమండలం దాకా ఎవరు ఎగరగలరో అనేది ఆ పరీక్ష. ఆ పరీక్షలో జటాయువు, సంపాతి ఇద్దరూ పోటీపడ్డారు. జటాయువు కాసేపటికి సొమ్మసిల్లిపడబోతే సంపాతి, తన రెక్కలు కప్పి అతనిని రక్షించాడు. అయినా ఎండ వేడిమికి సంపాతిరెక్కలు కాలిపోయాయి.

ముడతలు, ముడతలుగా మాంసం వేళ్లాడసాగాయి. కాళ్ళు కదిపే శక్తి లేకున్నా లేవబోయింది. అప్పుడు సంపాతికి నిశాకరమహర్షి గుర్తుకు వచ్చాడు. దొరలుతూ, దొరలుతూ సంపాతి అక్కడికి చేరుకున్నాడు. ఆ మహర్షి తనను స్వస్థుణ్ణి చేయగలడని విశ్వసించాడు. అప్పుడే స్నానార్థం వెళ్ళిన నిశాకరమహర్షి ఆశ్రమం చేరుకున్నాడు. అతనివెంట క్రూరమృగాలు వచ్చి నమస్కరించి వెళ్ళిపోయాయి.

మహర్షి సంపాతిని చూచి నిర్ఘాంతపోయాడు. కాలిపోయిన శరీరాన్ని, వికృతరూపాన్ని, రెక్కలు లేని అతని దుస్థితిని చూచి జాలిపడ్డాడు. ఆ సమయంలో తనను రక్షించవలసినదిగా సంపాతి కోరాడు. కాని మహర్షి దివ్యదృష్టితో,

"నీకు రెక్కలు తప్పక వస్తాయి. అయినా ఇప్పుడు కాదు. కాలాంతరాన నీవల్ల ఒక మహోపకారం జరుగవలసి వుంది. దశరథుని పుత్రుడు శ్రీరాముడు ఇక్కడికి రానున్నాడు. అప్పుడు రావణుడు నీలా జటాయువును ఎదిరిస్తాడు. సీతాదేవి అన్వేషణలో రామలక్ష్మణులు వింధ్యపర్వతం చుట్టూ తిరుగుతారు. అప్పుడు నీవు జటాయువు మరణం వింటావు. వారు నిన్ను ఓదారుస్తారు. ఎప్పుడైతే నీవు సీతమ్మజాడను రాములవారికి విన్నవిస్తావో అప్పుడే నీకు రెక్కలు మొలుస్తాయి" అన్నాడు.

నిశాకరమహర్షి ఆదేశించినట్టుగా సంపాతిరెక్కలకు బలం వచ్చాయి. తన వలన జరుగవలసిన లోకోపకారం అతనికి అర్థమయింది. నిశాకరమహర్షి సుదీర్ఘదృష్టి అర్థమయింది.

నిశాకరమహర్షిని రామలక్ష్మణులు దర్శించలేదు. అయినా సంపాతి, వానరులకు తన కథను చెప్పారు. సీతమ్మను రావణుడు అపహరించి లంకవైపు వెళ్ళాడనే యథార్థవిషయం రామునికి అందించడంలో సంపాతి కృతకృత్యుడయ్యాడు.

మహర్షులలో కొందరు వరానుగ్రహసమర్థులు, కొందరు కర్తవ్యదీక్షాబోధకులు, మరికొందరు సర్వలోకసంక్షేమపరులు. పేరు కోసమే ప్రాకులాడకూడదని ధార్మికప్రబోధం.

## 6. భరద్వాజ ఋషి

శ్రీమద్రామాయణం అయోధ్యకాండ ఉత్తరభాగంలో భరద్వాజ ఋషి ప్రస్తావన కనిపిస్తుంది. శ్రీరామవనవాసగమనవార్త తెలిసిన భరతుడు దశరథునికి అంత్యక్రియలు పూర్తిచేసి శ్రీరాములవారిని ఎలాగయినా ఒప్పించి అయోధ్యకు తనతో తీసుకురావాలని సంకల్పించి చతురంగబలాలతో, అయోధ్యానగరంలోని సర్వవర్ణాల ప్రముఖులతో, తల్లులతో, వసిష్ఠులవారితో గంగానదీతీరంలోని గుహుడి రాజ్యం చేరుకున్నారు. గుహుని ద్వారా శ్రీరాములవారి వనవాస వేషధారణ గురించి తెలుసుకొని చివరకు పాదచారిగా భరద్వాజమహర్షి దగ్గరికి వసిష్ఠుల వారితో వెళ్ళాడు.

భరద్వాజమహర్షి ఇంత పరివారంతో రావడమేమిటని భరతుణ్ణి అడిగాడు. అయోధ్యావిశేషాలను అడిగి తెలుసుకున్నాడు. అప్పుడు భరతుడు తన ఆంతర్యాన్ని విశదీకరిస్తే ఋషి సంతోషించి అరణ్యంలో తన ఆతిథ్యాన్ని స్వీకరించమని కోరాడు.

భరద్వాజమహర్షి సమస్త పరివారానికి తన తపోబలం వల్ల కనీ విని ఎరుగని ఎవరూ ఊహించనిరీతిలో గొప్ప విందు ఇచ్చాడు. షడ్రసోపేతమయిన పిండివంటలు, కోరినంత లభించేలా చేశాడు. అంతేగాక నృత్యగీత, గానవినోదాలు, జంత్ర తంత్రీవాద్యాల సంగీతాలు, అప్సరసల నాట్యవినోదాలతో భరతుని సైన్యం పరవశించేలా ఒక నూతన ప్రపంచాన్ని సృష్టించాడు. పుష్పవర్షం కురిపించాడు. భరతుని సైన్యంలోని గజ, తురగ జాతులు సంతృప్తితో కేకలు వేశాయి. అందరు తాము

అద్భుతమయిన కలకన్నట్టు భావించారు. మరుసటిరోజు భరతుడు తన అన్నను చూడటానికి తహ తహలాడుతున్నట్లు వ్యక్తీకరించాడు. భరద్వాజుల వారు ఆశ్రమం వెలుపలికి వచ్చినవేళ కౌసల్యాదులు నమస్కారం చేశారు.

అప్పుడు భరద్వాజమహర్షి గంగాయమునాసంగమానికి దగ్గరిదయిన ప్రయాగక్షేత్రానికి రెండున్నర యోజనంలో 'చిత్రకూటం' వుందని దాని ఉత్తరభాగంలో మందాకినీ అనే నది ప్రవహిస్తూ వుంటుందని, అక్కడి ప్రాంతాలు పుష్పవనాలతో కళ కళలాడుతూ వుంటాయని, అక్కడ మునులు సంచరిస్తారని, ఆ ప్రాంతంలోనే చిత్రకూటపర్వతం ఉందని ఆ రెండింటి మధ్య శ్రీరాములవారి పర్ణకుటీరముందని విశదం చేశాడు. భరద్వాజుడు సూచించిన మేరకు భరతుడు శ్రీరాములవారి పర్ణకుటీరాన్ని చేరుకున్నాడు.

ఈ వృత్తాంతం వల్ల మునులు ఎంత తపశ్శక్తివంతులో అవగతమవుతుంది. తాము ఆధ్యాత్మికజగత్తులో వాసం చేస్తున్నా, భౌతిక లోకానికి దూరంగా గడిపేవారని, తపస్సుచేత దేనినయినా సాధించి చూపించగలవారని తెలుస్తున్నది. అంతేగాక రాజ్యాధిపతి తమ ప్రాంతానికి విచ్చేసినవేళ వారి హోదాకు తగినట్లే సత్కరించే సత్‌సంప్రదాయం ఆనాడు కూడా ఉందని తెలియజేస్తున్నది. ఎవరికయినా అనుకోనిచోట అత్యవసరంలో భోజన, భజనాది సౌకర్యాలు లభ్యమయితే 'భరద్వాజుల విందు' అనడం లోకంలో రూఢి అయిపోయింది.

విందు అనేకరకాలు. కనులకు విందు, వీనులకు విందు, కడుపుకు విందు. వీటిలో చివరిది పుణ్యోపేతం. అన్నం పరబ్రహ్మస్వరూపం. అన్నదానం సర్వశ్రేష్ఠం. తగినవారికి పెట్టడం ధార్మికకార్యం. భరద్వాజుడు విందు పెట్టడంలోని ఆంతర్యం రాజులు అరణ్యాలలో తాపసుల

యోగక్షేమాలు పట్టించుకొనేవారు కావడమే. వారే తమ తపస్సులో ఆలోచనల్ని వరాలరూపంలో పన్నులు చెల్లిస్తారట. ఇది ధార్మికప్రబోధం.

## 7. మతంగమహాముని

శ్రీమద్రామాయణం అరణ్యకాండలో శబరి వృత్తాంతంలో ప్రస్తావితమయిన ఆశ్రమం మతంగాశ్రమం. మతంగుడు తపోధనుడు. అతని ఆశ్రమం జ్ఞానకేంద్రం. అదియొక కర్మక్షేత్రం. ఆ ఆశ్రమప్రాంతానికి చేరిన 'శబరి' మతంగుని దివ్యవర్చస్సుకు ఆకర్షితురాలయినది. నిర్మల అంతఃకరణతో శుశ్రూష చేయాలనుకొంది. తాను హీనకులజాత కావడం వల్ల సాహసించలేక పోయింది. అతని కంటపడకుండా ఆశ్రమప్రాంతాన్ని పరిశుభ్రం చేస్తూ, అతని నిష్ఠాగరిష్ఠజీవితానికి అవసరమయిన వస్తుసముదాయం సమకూరుస్తూ ప్రశాంతజీవితానికి అలవాటుపడింది. ఆమె సేవాసక్తిని గుర్తించి కొందరు మునులు మతంగుని పరిచయం చేశారు. మతంగుడు సౌజన్యభావంతో శబరిని తన శిష్యురాలిగా చేర్చుకున్నాడు. తన మరణావసానసమయంలో,

'బిడ్డా! కొంతకాలానికి, శ్రీరామలక్ష్మణులు ఇచ్చోటికి రాగలరు. వారికి అతిథిమర్యాదలు చేయ్. ఆ పుణ్యఫలితంతో నా చెంతకు చేరుతా'వని చెప్పి భౌతికదేహాన్ని చాలించాడు.

ఆనాటినుండి శబరి శ్రీరామస్మరణధ్యానపరురాలయింది.

శ్రీరాముడు కబంధుని ద్వారావనసరోవర ప్రకృతిదృశ్యాలను విన్నాడు. దారిలో శబరి ఆశ్రమం చేరుకున్నాడు. శబరి మునివేషధారులైన రామలక్ష్మణులను గుర్తించి అతిథిసేవలు చేసింది. తన గురుమహత్వాన్ని విశదం చేసింది.

"మా గురువు సప్త సముద్రస్నానార్థం వృద్ధాప్యంలో వెళ్తున్నప్పుడు సాక్షాత్కరించిన తీర్థం 'సప్తసాగరతీర్థం'. ఆ తీర్థంలో తానమాడి ఆరవేసిన

వస్త్రాలు తడి ఆరక నేడు కనిపిస్తున్నాయి. నేను గురువులకు పరిచర్య చేశాను. తమ దర్శనం తరువాతనే ఇహలోకవిముక్తి అని గురువులు చెప్పడంతో వేచివున్నాను" అని శబరిమాత చెప్పగానే, విద్యుల్లతలా, దివ్య శరీరంతో ప్రకాశిస్తూ మహర్షిలోకాలకు చేరుకుంది. ఆచార్యానుగ్రహంతో దివ్యలోకం చేరుకున్న శబరి వందనీయురాలు.

మతంగ ఆశ్రమదర్శనం, శబరి ఆతిథ్యస్వీకరణ శ్రీరాములవారి సర్వజాత్యాభిమానాన్ని స్పష్టం చేస్తుంది. ముఖ్యంగా బాహ్యవేషాదులతో భ్రమింపజేస్తూ ఇతరుల తపశ్శక్తిని గుర్తించని కాషాయధరులు గుర్తించవలసిన అంశం.

## 8. వసిష్ఠుడు

ఋషులలో వసిష్ఠుల నామం సుప్రసిద్ధం. ఈ ఋషికి సంబంధించిన వృత్తాంతాలనేకం. వాటిలో వసిష్ఠునికి మూడు జన్మలనడం. అతని మూడవ జన్మ ఇక్ష్వాకుల కులగురువు కావడం. శ్రీమద్రామాయణంలో బాల, అయోధ్య, అరణ్య, యుద్ధకాండలలో వసిష్ఠ చరిత్ర కానవస్తుంది. రామాయణంలో ప్రధానమయినది విశ్వామిత్ర ఋషితో వసిష్ఠుని అనుబంధమయిన సంఘటనలు.

బాలకాండలో రామలక్ష్మణులకు విశ్వామిత్రుని చరిత్ర అవగతం చేయబడింది. ప్రస్తుతం ఋషిత్వానికి సంబంధించిన వృత్తాంతం కనుక బాల, అయోధ్యకాండల వృత్తాంతం మాత్రమే గ్రహింపబడింది. విశ్వామిత్రుడు ఒకనాడు దశరథమహారాజుకొలువుకు వచ్చాడు. అంతఃపుర ద్వారపాలకులు హడావిడిగా పరుగెత్తుకొని వెళ్ళి మహారాజుకు విశ్వామిత్ర ఆగమనవార్త చేరవేశారు. మహారాజు పురోహితులతో వచ్చి మహర్షికి స్వాగతం పలికారు. అర్ఘ్యపాద్యాదులు సమర్పించాడు. "మీరాక నీటికోసం పరితపించిన వేళ వర్షం కురిసినట్లు, పోగొట్టుకొన్న పెన్నిధి

దొరికినట్లుగా ఉంది. మీరాక విశేషాలు చెబితే మీరేది కోరితే అద్దానిని చేయడానికి సిద్ధుణ్ణి" అన్నాడు. అంతేకాదు, అపుడు విశ్వామిత్రుడు రాజుతో నీవు 'వసిష్ఠ వ్యపదేశినః' అన్నాడు.

ఈ మాట ఒక్కటే విశ్వామిత్రునికి వసిష్ఠుని పట్ల గల గౌరవం సువ్యక్తమవుతుంది. అంతేకాదు -

**యది హ్యనుజ్ఞం కాకుత్స్థ దదతే తవ మంత్రిణః**
**వసిష్ఠప్రముఖాః సర్వే తతో రామం విసర్జయ.**

రాజేంద్రా! నీకు ఈ భూతలంలో ఉత్తమధర్మం, కీర్తి స్థిరంగా ఉండాలంటే రాముణ్ణి నాతో పంపు. వసిష్ఠుని వంటి ప్రముఖుల అనుమతితో అనడంలోని కటువు గ్రహించవలసింది. కనుకనే రాముణ్ణి పంపడంలో దశరథునికి ఇష్టం లేకపోయినా, వసిష్ఠుడు

**ఏష విగ్రహవాన్ ధర్మ ఏష వీర్యవతాం వరః ।**
**ఏష బుద్ధ్యాఽధికో లోకే తపశశ్చ పరాయణమ్ ॥**

విశ్వామిత్రుని గొప్పతనాన్ని మూర్తీభవించిన ధర్మజ్ఞుడు అని పరాక్రమవంతులలో శ్రేష్ఠుడని, బుద్ధిమంతుడని, తపస్సంపన్న పరాయణుడని చెప్పాడు. అంతేకాదు చరాచరాత్మకమగు ముల్లోకాలలో ఇతనికి మించి అస్త్రవిద్యాప్రావీణ్యం మరెవరికీ లేదు అన్నాడు. కొత్త అస్త్రములను సృష్టించడంలోను గడుసరి అన్నాడు. ఇవన్నీ విన్నాక వసిష్ఠుల వారిపట్ల గల విశ్వాసంతో చివరకు దశరథుడు తన కుమారులను విశ్వామిత్రుని వెంట పంపడానికి అంగీకరించాడు. అంతేకాదు విశ్వామిత్రుడు యాగవిధ్వంసకులను తానే చంపగల సమర్థుడు. నీ కుమారుని హితం కోసమే అయోధ్యకు వచ్చాను అనడంతో దశరథుడు కుదుటపడ్డాడు.

వసిష్ఠమహర్షి పునః ప్రవేశం మిథిలానగరంలో కనిపిస్తుంది. సీతమ్మ పెళ్ళివారితో, ఇక్ష్వాకుల వంశజుల ఉన్నతి చెప్పే బాధ్యత వసిష్ఠుల వారికే దక్కింది. విశ్వామిత్రుని ఆజ్ఞతో వసిష్ఠులవారు మరీచి మొదలు, దశరథుల దాకా వంశచరిత్రను పరిచయం చేస్తూ జనకమహారాజు తనయలను వరించగల సమర్థులు, యోగ్యులనడం అతనికే చెల్లింది. జనకుడు కూడా తన వంశచరిత్ర చెప్పగా వసిష్ఠ విశ్వామిత్రులిద్దరు ఇక్ష్వాకురాజవంశాల వైభవం సాటిలేనిది. ఈ కార్యక్రమం వల్ల ఇరువంశాల గౌరవాలు, రూపసంపదలు వర్ధిల్లుతాయన్నారు.

సీతాశ్రీరాముల కల్యాణం జరిగాక వసిష్ఠులవారే భరతాదుల వివాహానికి అనుమతిస్తే వారి వివాహాలు కూడా జరిగాయి.

దశరథమహారాజు తన కుమారుడయిన శ్రీరామునికి యువరాజ్య పట్టాభిషేకం చేయాలని వసిష్ఠాదులను పిలిపించి ఆనతి ఇవ్వడంతో వసిష్ఠుల పునఃప్రవేశం కనిపిస్తుంది. వసిష్ఠులవారే శ్రీరామచంద్రుడి అంతఃపురానికి వెళ్ళి అక్కడ శ్రీరామచంద్రులవారికి, సీతమ్మతల్లికి వారు వారు ఆచరించవలసిన, జపహోమవ్రతాలను, అర్చనాది విధులను నిర్దేశించారు. ఆపై పట్టాభిషేకానికి అవసరమయిన శాస్త్రవిధులు, రాజలాంఛనాలు, పవిత్ర నదీనద సముద్రజల కలశాలు సిద్ధం చేయడానికి పూజావస్తువులను సమకూర్చడానికి వెళ్ళారు. అలాగే పుష్యమీ నక్షత్ర శుభముహూర్తం సమీపించేవేళ వసిష్ఠులు, వారి శిష్యపరివారం సరయూనదిలో ప్రాతఃకాల శాస్త్రవిధులు నిర్వర్తించి, అభిషేక పదార్థాలను వెంటబెట్టుకొని మహాజనసమ్మర్దమయిన పురవీథులలో దారి చేసుకొంటూ అంతఃపురం చేరుకున్నారు. చివరకు అయినా కారణాలేవయితేనేం పట్టాభిషేకం ఆగిపోయింది.

వసిష్ఠుడు పురోహితుడు మాత్రమే కాదు న్యాయపక్షపాతి. అందుకే కైకతో ఖరాఖండిగా దశరథమహారాజు యొక్క వరాలు సీతాదేవికి

వర్తించవు అన్నాడు. అంతేకాదు జనకరాజుకుమార్తె శ్రీరాముని ప్రతినిధిగా కోసలదేశానికి పట్టపురాణి కావడం సమంజసమన్నాడు. ఆమె నారచీరలు ధరించవలసిన అవసరం లేదని వాదించాడు.

శ్రీరామవనవాసగమనానంతరం, వసిష్ఠుడు తన ధర్మాన్ని మరువలేదు. దశరథుడు మరణించాడు. అంతేగాక భరతునికి రాజ్యాభిషేకం అంగీకరించాడు. కనుక కేకయరాజ్యం నుండి భరతుణ్ణి తీసుకురావలసిందిగా తన సలహా చెప్పాడు. సభాసదులు వసిష్ఠుని నిర్ణయానికి కట్టుబడడం అతనిపట్ల గల గౌరవాన్ని సూచిస్తుంది. అక్కడ దశరథుని అంత్యక్రియలను పూర్తిచేయడంలో సహకరిస్తూ భరతాదులతో ఆకలిదప్పులు, శోకమోహాలు, జరామరణాలు ఎవరికీ తప్పవని మానవ జీవితసత్యాలను బోధించి స్వస్థచిత్తులను చేశాడు.

భరతుడు ఎలాగయినా శ్రీరాములవారిని అయోధ్యకు రప్పించడానికి ప్రయత్నం చేస్తున్నవేళ భరతాజ్ఞతో వసిష్ఠులవారు శ్రీరామ పట్టాభిషేకం సమయాలలోనే బంధుబలగానికి, సామంతరాజులకు, కేకయ మహారాజుకు, భరతుని మేనమామకు ఆహ్వానం పంపడంలో శ్రద్ధ వహించాడు.

వసిష్ఠులవారికి ఇతర మునిలోకంలో వున్న పరిచయం ఆశ్చర్యకరం. భరతునితో వసిష్ఠులవారు శ్రీరామవనవాసస్థలాన్ని వదలి భరద్వాజ ఆశ్రమానికి చేరుకున్నవేళ వారిరువురు పరస్పరం అభివాదాలు చేసుకున్నారు. కుశలప్రశ్నలతోబాటు, ఆశ్రమసదుపాయాలు, శిష్యుల అభ్యుదయవాదాలు, ఆశ్రమంలో జీవించే పశుపక్ష్యాదుల సుఖసంతోషాదుల గురించి మాట్లాడుకున్నారని వాల్మీకి వర్ణించాడు. కౌసల్య, సుమిత్ర, కైకలను శ్రీరాముని వద్దకు వెంటబెట్టుకొని వెళ్ళినవాడు వసిష్ఠుడు. వసిష్ఠులవారు కనిపించగానే అతనికి శ్రీరాముడు పాదాభివందనం చేసి అతను కూర్చొన్నాక తాను కూర్చొన్నాడు.

భరతుడు తాను అయోధ్యలో ఉండి పాలన చేయలేనని నందిగ్రామంలో వుంటూ, పాలిస్తానంటూ తనకు అనుమతి ఇవ్వవలసినదిగా వసిష్ఠుల వారిని కోరాడు. తదనంతరం వసిష్ఠదర్శనం శ్రీరామపట్టాభిషేక సమయంలోనే. వానరవీరులందరు సముద్రజలాలు, నదీజలాలు తీసుకొనిరావడంతో శత్రుఘ్నుడు ఆ సంగతిని వసిష్ఠుల వారికి తెలియజేశాడు. వసిష్ఠుడు వేదవిదులయిన వామదేవ, జాబాలి, కశ్యప, కాత్యాయన, సుతీక్ష్ణ, గౌతమ, సుయజ్ఞ, విజయాదులు మహర్షులతో అష్టవసువులు ఇంద్రునికి రాజ్యాభిషేకం చేసినట్లుగా అభిషేకం నిర్వహించారట.

వసిష్ఠుడు పురోహితుడు, పురహితం కోరేవాడు. తాను ఆశ్రయించిన రాజుల శుభాశుభాలు గుర్తించి సలహా ఇచ్చేవాడు. రాజ్యంలోని అందరికీ హితుడు బ్రహ్మజ్ఞాని. వసిష్ఠులవారు విశ్వామిత్రులవారితో గతంలో వైరమున్నా అన్నీ మరచి అతనిలోని సుగుణాన్ని మాత్రం గణించగలిగినవాడు. 'పురోహితులు' ఎలా ఉండాలో అనడానికి వసిష్ఠుని జీవనం మేలుబంతి.

## 9. వాల్మీకి

వల్మీకం నుండి పుట్టినవాడని వాల్మీకిశబ్దానికి వ్యుత్పత్తి. ఇతడే రామాయణేతిహాసకర్త. శ్రీరామావతారం కాలంనాడు జీవించినవాడు. శ్రీరామజీవనసంబంధి అనేకానేక సన్నివేశాలలో అవగాహన కలవాడు.

**"తపః స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరమ్**
**నారదం పరిప్రపచ్ఛ వాల్మీకిర్మునిపుంగవమ్"**

అనే శ్లోకంతో బాలకాండ మొదలు, వాల్మీకి రామాయణానికి పరోక్షంగా అవగాహన కలిగించినవాడు నారదుడు. అతనితో వాల్మీకి "శ్రేష్ఠగుణాలు కలవారు ఎవరయినా ఉన్నారా" అని ప్రశ్నించడంతో నారదులవారు

అన్ని గుణాలు కలవారు అరుదు. అయినా ఆలోచించి చెబుతానని ఇక్ష్వాకు వంశ ప్రథముడయిన శ్రీరాముని పేరుచెప్పి శ్రీరామగుణాకర్ణనం చేశాడు. శ్రీరామకథను సంగ్రహంగా చెప్పాడు.

వాల్మీకి శిష్యగణంతో తమసానదీతీరానికి ఒకసారి కదిలాడు. అక్కడ బురదలేనిది, నిర్మల జలపూర్ణమయినది, స్నానయోగ్యమయిన సరస్సును చూశాడు. ఆ రేవులో దిగకముందు చుట్టూ కలియజూచాడు. ఆ దగ్గరిలోనే క్రౌంచమిథునాన్ని సంగమస్థితిలోని పక్షిజంటను చూశారు. అంతలోనే ఒక బోయవాడు ఏమాత్రం దయలేక తన బాణంతో మగపక్షిని చంపాడు. అనుకోని సంఘటనకు ఆడపక్షి విలవిలలాడింది. ఈ దృశ్యాన్ని చూసిన వాల్మీకికి జాలి కలిగింది. రతిపరవశమై వున్న జంటను చంపడం అధర్మమనిపించింది. ఆవేదనతో వాల్మీకినోటనుండి

**"మా నిషాద ప్రతిష్ఠాం త్వ**
**మగమః శాశ్వతీః సమాః**
**యత్ క్రౌంచమిథునాదేక**
**మవధీః కామమోహితమ్"**

అనే శ్లోకం వెలువడింది. ఇది అప్రయత్నంగా వెలువడిన ఛందోబద్ధమైన శ్లోకం. రామాయణరచనకు కారణమయినది. దీనినే నాందీశ్లోకంగా పండితులు భావిస్తారు.

ఆశ్రమం చేరుకున్న వాల్మీకి ఆ దృశ్యభావనలోనే వుండగా బ్రహ్మవచ్చి, వాల్మీకి నీవు పలికించిన శ్లోకమే నా అనుగ్రహం వల్ల నీనోట వెలువడింది. నీవు ఋషిశ్రేష్ఠుడివి. నీనోట వెలువడినది కూడా రామాయణకథాసారమే. అందువల్ల శ్రీమద్రామాయణ రచన సాగించమన్నాడు. నా అనుగ్రహం వల్ల నీకు తెలియని రామకథా సన్నివేశాలు తెలుస్తాయి. భూతలంపైన కొండలున్నంతదాకా నదులు

ప్రవహించేదాక, రామాయణం కథ లోకంలోని జనులందరిలో ప్రచారంలో ఉంటుందన్నాడు.

వాల్మీకి రచించిన ఆరు కాండలలో వాల్మీకి ప్రసక్తి లేదు. కాని శ్రీరాముల అశ్వమేధయాగానికి వాల్మీకి వచ్చిన వృత్తాంతం ఉత్తరకాండలో వర్ణితం. ఆ యాగానికి వాల్మీకితోపాటు లవకుశులు వచ్చారు. వారు అయోధ్యానగరిలో శృతిలయబద్ధంగా శ్రీరామకథాగానం చేశారు. ఆనోట ఈనోట ఈ సంగతి రాములవారి చెవినపడ్డది. వారిని తమ సభకు ఆహ్వానించి పాడించాడు. తన కథ విని, సీతాదేవిని తలచుకొని శ్రీరాముడు దుఃఖితుడయ్యాడు. ఈ కథ ఎవరు చెప్పారని అడుగగా మాకు నేర్పించినవారు వాల్మీకులన్నారు. ఆపై యజ్ఞవిరామసమయంలో అందరు వినేలా చేశాడు. చివరకు వాగ్విశారదులయిన దూతలను పంపి సీతమ్మతో రావలసిందిగా వాల్మీకిని అర్థించాడు. రాజసభలో సీతమ్మ తన పాతివ్రత్యాన్ని మహర్షిసమక్షంలో నిరూపించుకోవాలని చెప్పి పంపాడు. అలాగే సీతమ్మ యజ్ఞవాటిక దగ్గరకు వచ్చింది.

శ్రీరామా! సీత పరమసాధ్వి, సుచరిత. నా సంరక్షణలో ఇంతకాలం గడిపింది. నా తపస్సు మీద శపథం చేస్తున్నా సీతకు ఏ కళంకమూ లేదన్నాడు. సీతాదేవి త్రికరణాలతో శ్రీరాముడే నాకు గతి, పతి, దైవం, ఆశ్రయుడు. ఇదే తథ్యము అయితే భూదేవి తనను తనలో చేర్చుకుంటుంది అని శపథం చేసింది. భూదేవి సీతకు ఆశ్రయం ఇవ్వగా రాముడు కోపించాడు. ఆ సమయాన బ్రహ్మ ప్రత్యక్షమై కోపాన్ని ఉపశమింపజేసి నీ చరిత్ర ఆదికావ్యమవుతుంది. నీ చరిత్రలో ఆగామి కథను కూడా వాల్మీకి దివ్యదృష్టితో రచించాడని చెప్పి అదృశ్యమయ్యాడు.

వాల్మీకి లేకపోతే రామాయణకథావిస్తరణ జరిగివుండదు. రామాయణానికి వాల్మీకిచరిత్ర కేంద్రబిందువు.

అసహాయులు అకారణంగా పీడింపబడితే స్పందించగలవాడే ఉత్తమజీవి అని ధార్మికప్రబోధం. కావ్యరచనతో కవులు చిరంజీవులవుతారని ధార్మికబోధ. గుడిమేలును, నుయిపూడును, వడినీళ్ళం జెరువుతెగును వనమును ఖిలమౌ చెడనిది పద్యం బొకటియె' అనడం త్రికాలసత్యం.

## 10. విశ్వామిత్రుడు

ఋషులలో విశ్వామిత్రుడు విభిన్నమయినవాడు. రాజసత్వంతో, పట్టుదలతో బ్రహ్మర్షివని వసిష్ఠునిచేత అనిపించుకున్నవాడు. తన వంశజులవారి సత్యనిష్ఠను లోకానికి ఎరుకపరచినవాడు. భారత విశ్వామిత్రునికంటే శ్రీమద్రామాయణ విశ్వామిత్రుడు ప్రపంచకల్యాణం ఆశించి సీతారాములవారి కల్యాణానికి సుపథం వేసినవాడు.

శ్రీమద్రామాయణంలో విశ్వామిత్రుని ప్రవేశం చిత్రంగా జరిగింది. అరణ్యాలలో తపస్సు చేసుకొనేవారిని కూడా వారి తపశ్చర్యలు సాఫీగా జరగడానికి రక్షణ కల్పించినవారు రాజులు. అందుకు ప్రతిఫలంగా తపస్సులో ఆరవ భాగాన్ని మునులు ఆశీస్సుల రూపేణ, వరాల రూపేణ ఇస్తారని పురాణాలు ఘంటాపథంగా ఘోషించాయి. ఈ నేపథ్యంలోనే విశ్వామిత్రుడు తన యాగానికి విఘ్నాలు కలిగించే రాక్షసుల సంహరణార్థం తనతో శ్రీరామలక్ష్మణులను పంపవలసినదని కోరడానికోసం విశ్వామిత్రుడు సభలో ప్రవేశించాడు. కానీ విశ్వామిత్రుని విన్నపం వినగానే దశరథుని వికసిత వదనారవిందం విషాదపూరితమై వికలతకు లోనయింది. తనది సత్యవాక్యపాలనాదక్షతకు పేరు గడించిన వంశం. మరి శ్రీరాముడు పిన్నవాడు. తానే వస్తానని చెప్పినా విశ్వామిత్రుడు శ్రీరాముణ్ణే పంపమన్నాడు. చివరకు పురోహితుడయిన వసిష్ఠుడు శ్రీరామచంద్రుడు విద్యకు, వినయానికి, పౌరుషప్రకటనకు అన్నిటికీ మించి విశ్వామిత్రకృపావిశేషాలకు పాత్రుడవుతాడని దశరథునికి చెప్పి సమ్మతింపజేశాడు.

రామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంట వెళ్తున్నవేళ దర్శించిన ప్రకృతి దృశ్యాలు, దారిలో విశ్వామిత్రుని వల్ల విన్న గాథలు, ఒడిసిన అనుభవాలు వారి జీవితాలకు నూతనోత్తేజాన్ని కల్గించాయి. విశ్వామిత్రుని గురుత్వం వల్ల శ్రీరాముడు తన ధర్మనిర్వహణక్రతువుకు సకల సంపత్తిని సమకూర్చుకొని ఆత్మోద్దీపం, ఆత్మవిశ్వాసం చేకూర్చుకొని తన ధర్మాన్ని గురుతరబాధ్యతగా స్వీకరించాడు.

రాక్షససంహారానికి విశ్వామిత్రుడు శ్రీరామలక్ష్మణులను తీర్చిన విధం చిత్రం. ముందుగా బల-అతిబల విద్యోపదేశం, మంత్ర విశ్రుతమార్గంలో వారికి తర్ఫీదు చేయడం, వివిధ ఆశ్రమాల సందర్శన రామలక్ష్మణుల అంతర్దృష్టికి సాధనాలయినాయి. అంతేగాదు సిద్ధాశ్రమ సందర్శనంతో విశ్వామిత్రునికి గల సకల భూతాలతోటి సాన్నిహిత్యం అవగతమయినది.

శ్రీరాముని చేత చేయించిన తాటకవధ, సుబాహుసంహరణ, అహల్యాశాపనివారణకు దోహదం చేయడం, చివరకు తనకు చేసిన ఉపకారాలకు ప్రత్యుపకారంగా, సీతారాముల కళ్యాణానికి మార్గనిర్దేశకత్వం లాంటివి విశ్వామిత్రుని పథకంలోని అంశాలే. సుందరకాండలో హనుమంతుడు ఎలాంటి ప్రధానభూమికను నిర్వహించాడో అలాగే విశ్వామిత్రుడు బాలకాండలో తగిన పాత్రను పోషించి శ్రీరామునికి గురువుగా, భక్తుడిగా మారిపోయాడు.

జననీజనకుల ప్రేమబంధం భౌతికం. గురుశిష్యుల అనుబంధం మానసికం. కనుకనే సభాంగణంలో విశ్వామిత్రుడు రాముడు కుర్రవాడని, రణరంగవిన్యాసాలు తెలియనివాడని సంశయిస్తే విశ్వామిత్రుడు “అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమం”

అన్నాడు. శ్రీరాముని ఆత్మోద్దీపనకు విహితకర్తవ్యంగా భావించినవాడు విశ్వామిత్రుడు. కనుకనే గోదావరీనదీతీరంలో విశ్రమించినవేళ భగవంతుని అవతార కథలు, ఇక్ష్వాకుల వీరచరిత్రలు, విశ్వామిత్రుని చరిత్రలు రామలక్ష్మణులకు ప్రబోధాత్మకములయ్యాయి.

రాక్షసస్త్రీవధకు కారకుడయిన విశ్వామిత్రుడు, భస్మరూపి అయిన అహల్య పునరుజ్జీవనానికి కారకుడు కావడం విశేషం. ఆశ్రమవాసి అయిన విశ్వామిత్రుడు తనతోడి గౌతమమహర్షి సంసారాన్ని చక్కదిద్దడం మరొక విశేషం.

అయోధ్యలో ఋషిపుంగవులెందరు వున్నా శ్రీరాముని మహిమను గుర్తించి అతని ధర్మకర్తవ్యపాలన నిర్వహణకు సంపూర్ణంగా సహకరించినవాడు విశ్వామిత్రుడే. రావణరాజ్యంలో జరిగే అన్యాయాలను, ప్రజల కంటకజీవితాలను గురించి విని హిమాలయాల నుండి దిగివచ్చి సిద్ధాశ్రమం వేదికగా పథకము వేసినవాడు విశ్వామిత్రుడే. పౌరుష దైవీశక్తుల సమ్మేళనమొకటే రాక్షసనిర్మూలనానికి సహకరిస్తుందని తెలిపిన దీర్ఘదర్శి.

విశ్వామిత్రుని నిష్కామకర్మకు ప్రబల నిదర్శనం, అతని నిరాడంబర నిష్క్రమణం. అతని కీర్తికి జయపతాక, శ్రీరాములవారికి గురువు, పథనిర్దేశకుడు, శక్తిప్రదాత విశ్వామిత్రుడే.

ఒక పనితో అనేక ఫలితాలను సాధించడం కొందరికే తెలుసు. విశ్వామిత్రుడు రామునిచే చేయించిన రాక్షసనిర్మూలనం, అహల్యా శాపవిమోచనాలు అలాంటివి. ఉపకారికి ప్రత్యుపకారం చేయాలి కనుక అస్త్రాదుల ప్రదానంతో, సీతాస్వయంవరంతో సుఖాంతం చేయడం ధార్మికుల విధానం.

## 11. శరభంగమహాముని

శ్రీమద్వాల్మీకి రామాయణంలో అరణ్యకాండలో శరభంగ మహాముని ఉల్లేఖనముంది. ఈ ఆశ్రమం ఉనికిని సీతారామలక్ష్మణులకు చెప్పినవాడు విరాధుడు. సీతారామలక్ష్మణులు శరభంగమహాముని ఆశ్రమానికి వెళుతూ ఇంద్రుడు ఆ మునితో సంభాషించే దృశ్యాన్ని చూశారు. శరభంగుడు ఎంతటి గొప్పవాడో అర్థమయింది. వీరినిచూచి ఇంద్రుడు అంతర్హితుడయ్యాడు.

శరభంగుడు తన్ను స్వర్గలోకానికి తీసుకొని వెళ్ళడానికి ఇంద్రుడు వచ్చాడని, కాని శ్రీరామదర్శనం చేయకుండా బ్రహ్మలోకాలకు వెళ్ళడానికి అయిష్టుడనని చెప్పాడు. ఆపై శరభంగుడు శ్రీరాములవారికి తాను దివ్యతపం ద్వారా ఆర్జించిన పుణ్యఫలమంతా ఇస్తానని స్వీకరించవలసినదిగా కోరాడు. అపుడు శ్రీరాముడు తాను క్షత్రియుడనని, ఇతరుల దగ్గర దానం పుచ్చుకొనే అధికారం తనకు లేదని తానే అంతటి శక్తిని సంపాదించుకొంటానని అనునయంగా చెప్పాడు.

శ్రీరామదర్శనార్థం ఆ మహాముని యజ్ఞకుండంలో అగ్నిని ప్రజ్వలింపజేసి తాను ప్రవేశించి తన జీర్ణశరీరం వదిలిపెట్టి కౌమార వయస్సులో దివ్యస్వరూపంతో బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు.

శరభంగమహాముని దివ్యతపశ్శక్తిసంపన్నుడు. తన తపశ్శక్తిని తగినవారికే ఇవ్వాలనే అభిలాష కలవాడు. తన దానానికి రాముడే అర్హుడని వేచివున్నాడు. ఒకవేళ ఆ దానఫలితాన్ని రాముడు స్వీకరిస్తే బ్రహ్మలోకగమనం సాధ్యం కాదు. ఇది శరభంగునికి, శ్రీరాములవారికి పరీక్ష. అయినా సర్వమూ సానుకూలం కావడం అభినందనీయం.

పరిగ్రహణం కొందరికి తగు, అందరికి తగవు. శరభంగుల తపశ్శక్తి వలన అతడు ఉత్తమలోకానికి వెళ్ళాలని శ్రీరాముని లక్ష్యం.

కనుకనే తాను తీసుకోనన్నాడు. రామునికి తపశ్శక్తి ధారపోయాలనుకోవడం అరణ్యవాసి ధర్మం కావచ్చు. శరభంగుడు, శ్రీరాముడు ఇరువురు ఆదర్శప్రాయులే.

## 12. సుతీక్ష్ణముని

సీతారామలక్ష్మణులు అత్రి అనసూయల దర్శనం తర్వాత కలుసుకొన్న ముని శరభంగుడు. ఆపై సుతీక్ష్ణమహర్షి. శరభంగుడే సీతారాములకు సుతీక్ష్ణ మహాముని సందర్శించమని ఆదేశించినవాడు.

శరభంగదర్శనం తర్వాత రామలక్ష్మణులు ఎటువెళ్ళాలని ఆలోచిస్తుండగా అక్కడి మునులు వచ్చి దండకారణ్యంలోని రాక్షసుల వల్ల బెడదలను విన్నవించాడు. రాముడు అక్కడివారికి అభయమిచ్చాడు. సుతీక్ష్ణమహాముని సీతారామలక్ష్మణులను ఆదరించి తనతోనే ఉండవలసిందిగా కోరాడు. అంతేకాదు శరభంగునిలాగా తాను ఆర్జించిన పుణ్యలోకాల సందర్శనఫలితాలను ధారాదత్తం చేస్తానన్నాడు. కాని రాముడు శరభంగునికి చెప్పినట్లే తాను క్షత్రియుడని ఎవరి దానాలను స్వీకరించరాదని తామే సంపాదించాలని మనవి చేశాడు. చివరకు తనతోనే వుండమంటే నా కోదండధనువును, అస్త్రాలను చూచి మృగాలు భయపడుతున్నాయని, ఆశ్రమప్రాంతపవిత్రతకు భంగమని అది తనకు సమ్మతం కాదని నమ్మబలికాడు.

ఈ సందర్భంలో సీతమ్మ అరణ్యవాసం చేస్తూ ధనుర్బాణాల ధారణ, హింసాదులెందుకని ప్రశ్నించింది. అందుకు శ్రీరాముడు, భరతుడు నగరపాలనం చేస్తే తాను అరణ్యపాలన చేస్తూ రక్షించడం ధర్మమన్నాడు. అంతేకాదు ఋషుల సంప్రార్థన క్షత్రియులకు అవశ్యం వినదగినదని ఇదే తన ప్రతిన అని నచ్చచెప్పాడు. ఈ వాగ్దానమే ఉత్తరోత్తర రాక్షస

సంహారానికి శ్రీరాముల ప్రతిజ్ఞ దోహదం చేసింది. సీతమ్మను విముక్తురాలినిగా చేసింది.

'మునులను రక్షిస్తానని వాగ్దానం చేశాను. నేను జీవించి వుండగా నామాట తప్పలేను. నాకు సత్యపాలన ఇష్టం. నామాట నిలుపుకోవడానికి ప్రాణాలు అయినా ఇస్తాను. అవసరమైతే నిన్ను, లక్ష్మణుణ్ణి సహా వదలిపెడతాను' అన్నాడు. సుతీక్ష్ణుని ఆశ్రమంలో గడిపిన సీతారామలక్ష్మణులు అగస్త్యాశ్రమదర్శన కుతూహలం కనబరచగా అతడే అగస్త్యాశ్రమ మార్గనిర్దేశం చేశాడు.

వేషం తాపసవేషమా, చేత ధనుర్బాణాలా – ఇవి విడ్డూరం కదా అని విడ్డూరంగా ఆక్షేపించేవారికి తగిన సమాధానం ఈ వృత్తాంతంలో ఉంది. స్త్రీలు సదా హింసను సహించలేకపోవడం స్త్రీల మనస్తత్వానికి ప్రతీక.

* * *

# మహాభారతంలో మునులు

## 1. అగస్త్యమహర్షి

శ్రీమద్రామాయణంలోను, మహాభారతంలోను చదువరులకు పరిచయమయ్యే ఋషులలో అగస్త్యుడు ఒకడు. ఇతని చరిత్ర ఆంధ్రమహాభారతం ఆది, అరణ్య, ఉద్యోగ, శాంతి, అనుశాసనిక పర్వాదులలో విస్తృతంగా కనిపిస్తుంది.

ఋషులలో సర్వలోకహితకారిగా కనిపించే ఋషులలో అగస్త్యుడొకడు. అతని లోకోపకారిత్వం అనేక రకాలు. దేవతలు వేడగా వారిని గౌరవించి, వారు చేపట్టమని చెప్పిన కార్యం సానుకూలం చేయడం. వింధ్య, హిమవత్పర్వతాల మధ్య ఆధిక్యపోరాటం విపరీతాలకు కారణమయినపుడు దేవతల విన్నపాలు ఆలించి దక్షిణంవైపు కదిలి వింధ్యునితో తాను దక్షిణం వైపు వెళ్ళవలసి ఉన్నది, నేను తిరిగి వచ్చువరకు పెరుగుట మానుమని కోరగానే వింధ్యుడు అగస్త్యునికి దారి ఇచ్చాడు. సూర్య, చంద్రాదుల గమనం యథాస్థితిగా జరగడానికి వీలైంది. ఉత్పాతాలు నివారితాలయ్యాయి.

లోకంలో కొందరు తనకు తెలిసినదానిని ఇతరులకు తెలియజెప్పడానికి ఇష్టపడరు. కాని అగస్త్యుడు అరణ్యవాసంలోని ధర్మరాజుకు వివిధ తీర్థక్షేత్రాదుల గురించి విశదంగా చెప్పి అతనికి తీర్థయాత్రాభిలాషను కలిగించాడు. ఒక రాజుకు అవసరమయిన జ్ఞానాలలో భౌగోళిక అవగాహన. ధర్మరాజు ఎట్టకేలకు హస్తినాధీశుడు కాబోతున్నాడు. కనుక అగస్త్యుడు ఆ పరిజ్ఞానాన్ని ధర్మరాజుకు కలిగించాడు. ఈ విజ్ఞానం తీర్థయాత్రాభిలాషులకు అవసరమయినదే.

మాతాపితరులు ప్రత్యక్షదేవతలు. వేదం మాతృదేవోభవ, పితృదేవోభవ అన్నది. అలాంటివారి సమంజసమైన కోరికలు తీర్చడం

పుత్రుల విధి. ఒకచో తలక్రిందులుగా వేలాడే వారిని చూచి కారణం తెలుసుకొని వారు తన పితృదేవతలు అని తెలుసుకొని తాను సంసారి కావడానికి సిద్ధపడ్డాడు. ఇది అగస్త్యుడు గృహస్థులకిచ్చే ధర్మోపదేశం.

ఒక భార్య ఎలా ఉండాలో అనడానికి తగినట్లు ప్రవర్తించడం అగస్త్యుని స్వభావం. లోపాముద్రను వివాహమాడిన తరువాత భార్యతో విలువయిన దుస్తులు, ఆభరణాలు వదులుము అన్నాడు. కారణం తాను సంచారజీవి కనుక. తనలాగే ఉండాలని అగస్త్యుని కాంక్ష. అలాగే భార్య ఒకసారి తాను రాజసౌధంలో పానుపుపై ఉన్నట్లుగా రావాలని, పూలహారాలు ధరించాలని కోరినపుడు వీటికోసం నాతపశ్శక్తిని వృథా చేయనన్నాడు. ఇది ఆనాటి స్త్రీల నైజాలకు ఉదాహరణ. అలాగే అగస్త్యుడు మిగులుధనం కలవారినే యాచించడం విశేషం. ఇది రాజులకు, అర్థులకు అవసరమయిన ఆర్థికనీతి.

రాక్షసులు రెండు రకాలవారు. నమ్మించి మోసం చేసేవారు. ఇలాంటివారిని ఎదుర్కోవడం కష్టం. ఇతరులెవ్వరు వాతాపి, ఇల్వలులను అణచలేనివేళ అగస్త్యుని అర్థించారు. అగస్త్యుడు వారి మోసాన్ని గ్రహించి తానొక్కడే మాంసాన్ని తిని ఇల్వలుడు వాతాపీ, వాతాపీ అని కేక వేస్తుంటే, అగస్త్యుడు "వాతాపి జీర్ణం" అన్నాడు. కనుకనే అవసరమైనదానికంటే చాపల్యంతో ఎక్కువ తిన్నవారు ఆపై నేడు కూడా భోజనానంతరం అగస్త్యుణ్ణి ఆహారపరిణామార్థం స్మరించడం.

సంతానవిషయంలో కూడా అగస్త్యుడు జాగ్రత్తపడినవాడు. భార్య మనసు తెలిసినవాడు. కనుక భార్యతో "వేవురు పుత్రులు కావాలా! ఏక పుత్రుడు కావాలా" అని అడిగి ఆమె కోరిన ప్రకారం ఏకపుత్రునికి తండ్రి అయ్యాడు. సంతానవిషయకంగా అగస్త్యుని ధర్మోపదేశమిది. ఈనాటికీ అవసరమయిన సద్బోధ.

బలవంతులయిన, గర్వితులయిన అధిపులను ఎదుర్కోవడం కష్టం. అలాగని మౌనంగా ఉండరాదని అగస్త్యమతం. కనుకనే శచీదేవి దగ్గరికి నహుషుడు మునులు మోసే పల్లకిలో వెళ్ళేవేళ సామాన్యబోయీలను గదమాయించినట్లు సప్తర్షులను సర్ప సర్ప అంటుంటే అగస్త్యుడు నహుషుని "సర్పో భవ" అన్నాడు. మహాత్ముల కోపం గడ్డి నిప్పులాంటిది. కనుక నహుషునితో నీ గర్వం నశించాక పుణ్యఫలాలు అనుభవిస్తావన్నాడు.

కాలకేయరాక్షసులు సముద్రంలో దాగినవేళ దేవతలు కోరగా బహుళార్థ ప్రయోజకమయిన కార్యం కనుక సముద్రజలాన్ని తాగివేశాడు. అఘటన ఘటనాశక్తులు కలవాడు సమయానికి సమయానికి సాయం చేయాలని ఉద్బోధ.

లోకంలో ప్రతివ్యక్తికి ఆత్మవిశ్వాసం అవసరం. ఆ విశ్వాసం దృఢమయితే ఎదుటివాడు భీష్మించుకొన్నవాడు కాళ్ళబేరానికి రావడం ఖాయం. ఒకసారి ఇంద్రుడు వర్షాలకు అవరోధం కల్పించాడు. అప్పుడు అగస్త్యుడు వర్షం కురవకపోతే తానే ఇంద్రునిగా మారతానన్నాడు. చివరికి ఇంద్రుడే అగస్త్యుని ముందు మోకరిల్లాడు.

ఒకానొక సందర్భంలో కార్తవీర్యార్జునుడు అగ్నిదేవుని కోరిక ప్రకారం ఆశ్రమప్రాంతాలను కూడా కాలనిచ్చేవాడు. అలాగే అగ్ని అగస్త్యాశ్రమాన్ని మసిచేశాడు. ఆజ్ఞ చేసేవాడు ఆంక్షలు విధించక అప్పగించినవానికే సర్వాధిపత్యం ఇస్తే ఇలాగే జరుగుతాయని, ఆజ్ఞ ఇచ్చినవానికే బుద్ధి గరపాలని కార్తవీర్యార్జునుని వేయి చేతులు పరశురామునిచేత ఖండింపబడతాయన్నాడు.

అన్నిటికన్నా అగస్త్యుడు నిస్స్వార్థబుద్ధితో సర్వజనసంక్షేమం కోసం ద్వాదశ వార్షిక (కూడా) దీక్ష కూడా చేపట్టాడని భారతం అశ్వమేధ పర్వంలో ఉల్లేఖితం.

మహాత్ముల ఆశయాలు, జీవితాలు, చేతలు, ధర్మబద్ధత ఇతరులకు ఆచరించడానికి వీలయినవే, శిరోధార్యమే అని సారాంశం.

## 2. అత్రిముని

అత్రిమహాముని వృత్తాంతం ఆంధ్రభారతం ఆది, సభా, అరణ్య, శాంతి, అనుశాసనాది పర్వాలలో వర్ణితం.

ఆదిపర్వకథనం బట్టి బ్రహ్మామానసపుత్రులలో అత్రి ఒకడు. శాంతిపర్వం బట్టి లోకంలో జనించిన ప్రజాపతులు ఇరువది ఒక్క వారిలో అత్రి ఒకడు. ప్రాతఃకాలవేళ అత్రిస్మరణ పాపహరణం, పుణ్యదాయకం. అత్రిభార్య అనసూయ ముప్వురు దేవతల్ని పసిపాపలుగా చేసిన పవిత్రురాలు.

లోకంలో వాదించేవారు రెండు రకాలవారు. పెడసరివాదం చేసేవారు ఒకరయితే యుక్తాయుక్తవాదం చేసేవారు మరొకరు. అత్రి రెండో వర్గం వాడు. ఒకసారి అత్రి వైన్యమహారాజు దగ్గరికి వెళ్ళి, నీవు సర్వతంత్ర స్వతంత్రుడవు. ధర్మం గురించి నీకు తెలిసినంత ఇతరులకు తెలియదన్నాడు. అక్కడున్న గౌతముడు 'అత్రి! నీజ్ఞానం పరిపక్వం కాలేదు. దేవరాజు అయిన మహేంద్రుడు మాత్రమే సర్వతంత్ర సమర్థుడ'న్నాడు. ఆపై వూరుకోక అత్రివయసును హేళనగా తూలనాడాడు. అపుడు అక్కడికి వచ్చిన కశ్యపుడు వేగంగా సనత్కుమారుని దగ్గరికి వెళ్ళి సత్యం గ్రహించి మరల అత్రికడకు వచ్చి అత్రిని సమర్థించాడు. రాజు చాల సంతోషించి అధిక ధనం ప్రదానం చేశాడు. కాని అత్రి ఆ ధనాన్ని కుమారులకిచ్చి ఆనందంగా తపస్సుకు వెళ్ళాడట. ఇలా! ఎందరుంటారు?

పెడసరివాదం పనికిరాదని, పండితుల మధ్య ఈర్ష్య పనికిరాదని హితవు. అలాగే ఒక స్థితినందుకొన్నవారు ధనాదులకోసం, ఆశపడరాదని, పడరని కూడా ఉపదేశం.

దేవదానవుల యుద్ధంలో రాహువు అనే రాక్షసుడు సూర్య చంద్రాదులను చాల బాధించాడు. వారు తమ కాంతిని కోల్పోయారు. అపుడు దేవతలు అత్రిని ఆశ్రయించారు. ఈ విపత్తు లోకానిది, ప్రజలది. రాక్షసహింస నిందార్హమంటూ తపశ్శక్తితో తానే చంద్రుడయ్యాడని కథ. ప్రకృతికే వినాశనం కలిగినవేళ తనకేమి అని నిరాశక్తతో వుండడం తగదని లోకోత్తర ధర్మోపదేశం.

అత్రి అంటే సూర్యుడని ఒక అర్థం. ఈ అంశం సంస్కృత భారతంలో 156వ అధ్యాయంలో "యశ్చోదితో భాస్కరే భూతప్రనష్టే అత్రిశబ్దేన సూర్యః గృహ్యతే" అని సంస్కృత భారతం గచ్ఛత్ వ్యాఖ్యలో వివరణ కనిపిస్తుంది.

శ్రీమంతుడు, నిమిపుత్రుడు. అతడొకసారి శ్రాద్ధం చేయాలను కొన్నాడు. అంతవరకు శ్రాద్ధవిధి వాడుకలో లేదు. మునులెవ్వరు ముందడుగు వేయలేదు. అత్రి తాను ముందుండి యాగంలాగా శ్రాద్ధవిధి చేశాడట. ఈనాటికీ "అత్రి" మహాముని శ్రాద్ధాదులకు మూలపురుషుడని నమస్కరించేవారున్నారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి సుప్రభాత శ్లోకాలలో 'అత్ర్యాది సప్త ఋషయః' అని ప్రస్తుతింపబడినవాడు. నేటికీ విప్రులలో ఆత్రేయగోత్రజులు ఎక్కువ. వారు సహజంగా పవిత్రకార్యాలకు తాము ఉన్నామని నిలబడేవారు. లోకంలో మంచి పనికయితే అందరు ముందడుగు వేస్తారు కాని అశుభకార్యాలకు ఎంత స్నేహమున్నా కారణాంతరాలు చెప్పి తప్పించుకొంటారు. కాని కొన్ని మతాలలో మంచికీ, చెడుకూ ముందుకు వచ్చేవారున్నారు. అలాంటివారిని అభినందించవలసిందే.

## 3. అష్టావక్రమహాముని

మహాభారతంలో అష్టావక్రమహర్షిచరిత్ర అరణ్యపర్వం, అనుశాసనికపర్వంలో ప్రస్తావితం. ఉద్దాలకుడు ఒక మహర్షి, అతని కుమార్తె సుజాత. తండ్రి తన సుతను తన శిష్యుడయిన "కహునికి" ఇచ్చి అనుబంధం పెంచుకున్నాడు. కహుడు వేదాధ్యయనంలో అధ్యాపనంలో ఘటికుడు. ఇలా వుండగా సుజాత గర్భవతి అయింది. వేదాధ్యయనంలోని లోపాలను గర్భస్థశిశువు గుర్తించి తండ్రిని ఆక్షేపించాడు. శిష్యులముందు శిశువు చేసిన ఆక్షేపణ తండ్రికి అవమానమనిపించింది. వెంటనే గర్భస్థశిశువును అష్టావక్రుడవుగా పుట్టమని శపించాడు.

ఈ కథలో కొందరికి కొన్ని సంశయాలు కలగవచ్చు. శిశువుకు వేదాధ్యయనం వినబడుతుందా అని ఒక సందేహం. గర్భస్థశిశువుకు 5వ నెలనుండి అన్ని రకాలైన జ్ఞానాలుంటాయి అని నేటి వైద్యులు కూడా అంగీకరించిన అంశం. తండ్రిని ఆక్షేపించవచ్చునా అని ఒక ప్రశ్న. వేదమంత్రాల విషయంలో తప్పు ఏనాటికి ఒప్పు కాదు. ఉచ్చారణలోపం, స్వరవ్యత్యయం వల్ల అర్థాంతరాలు అనర్థాలు. కనుక ఆక్షేపణ తప్పేమీ కాదు.

ఒకసారి యాగశాలనుండి రాజసేవకులు అష్టావక్రుని వేషం చూసి సామాన్యునిగా తలపోసి తరిమేశారు. అలా చేయడం తప్పు, అయినా ఆ తప్పేమిటో చెప్పడం ఎదుటివారి కర్తవ్యం. అందుకే ద్వారపాలకులతో బ్రాహ్మణులు ఎక్కడయినా ఎదురులేక నడవవచ్చు. బ్రాహ్మణులు నడువనిదారిలో నడవడానికి గ్రుడ్డివానికే అర్హత అంటూ వారికి తెలిపారు. తదనంతరం స్త్రీలకు, ఆపై భారవాహకులకు అన్నాడు. ఇవన్నీ రహదారి నియమాలు. తెలియనివారికి నేడు కూడా చెప్పదగ్గ అంశాలు.

సంతానాపేక్ష మంచిదే. కాని ఆ సంతానం వివాహం చేసుకొన్న భార్యయందే అయితే సర్వశ్రేష్ఠం. స్త్రీలకు కన్యాత్వం వేళ తండ్రి, యౌవనంలో భర్త, వృద్ధ అయినవేళ కుమారుడు రక్ష. ఎంత వితండవాదం చేసినా ఇవి త్రైకాలికసత్యాలు. అలాగే మరోసారి అష్టావక్రుని బోధ.

వెంట్రుకలు తెల్లబడినంత మాత్రాన ఎవ్వరిని కాని వృద్ధులనరాదు. వయసులో చిన్నవారయినా జ్ఞానవంతులయితే యోగ్యులనడం దేవాధిదేవతలయినా వారిని జ్ఞానవృద్ధులుగానే గణించాలి.

ఒకసారి అష్టావక్రుని ఒక స్త్రీ ఆశ్రయించి తన సంతానవాంఛను ప్రకటించింది. అపుడు అష్టావక్రుడు నా భార్యకాని స్త్రీతో సంభోగం పట్ల ఆసక్తి లేదన్నాడు. ఇది ధార్మికోపదేశం.

కొందరు స్త్రీలు కామేచ్ఛతో వితండవాదం చేస్తారు. అలాగే ఒక స్త్రీ నేను కన్యను. నాపై అధికారం నీకుంది. ఎవరికీ లేదన్నది. అయినా భార్య అయితే ఇష్టపడేవాడవయితే నేను భార్యను అవుతానంది. ఇంకా చాలక పిల్లతనం నుండి నేను కన్యనే. పురుషసంపర్కం లేనిదాన్ని అంది. చివరకు ఆ స్త్రీ తన వృద్ధరూపాన్ని వదలి నవ యువతి అయింది. ఆపై నిన్ను పరీక్షించాలని వచ్చాను. నీ ఇంద్రియనిగ్రహం ప్రశంసనీయమన్నది. అయినా అష్టావక్రుడు చలించక వచ్చిన చోటుకే వెళ్ళమన్నాడు.

స్త్రీలలో చంచలులు తటస్థపడితే మసలుకొనే విధానానికి ఇది సూక్ష్మాంతరమయిన ఉపదేశం. ఇలాంటివారు నేడూ ఉన్నారు.

అలాగే కుబేరుని నగరంలో చాలాకాలం అష్టావక్రుడున్నారు. అంగరంగభోగాలున్నా నీ ఆతిథ్యం నాకు నచ్చింది. నాకు సెలవు ఇమ్ము అన్నాడు. ఇది కూడా ఒక ధర్మోపదేశం. ముఖ్యంగా యోగులు, తాపసులు, ఔపదేశికులు, సన్యాసులు సౌకర్యాలున్నాయని ఒకచోట ఉందామనుకోకూడదు. వాటివల్ల బంధాలు, చిక్కులు.

## 4. ఆస్తీకముని

ఈ మునివృత్తాంతం ఆదిపర్వంలో విపులంగా ఉంది. నన్నయ ఆస్తీకమహామునిని వర్ణిస్తూ

**విమల తపో విభవంబున**
**గమలజ నట్టిండ విగతకల్మహం౦ దాస్తి**
**కమహాముని యాతని వచ**
**నమున మహిమల రక్షణంబగు౦ బేర్మిన్ 2-217**

అని స్పష్టం చేశాడు.

జనమేజయుడు తన తండ్రిమరణానికి తక్షకుడే కారకుడని భావించి సర్పాలపై పగబట్టి సర్పయాగం మొదలెట్టాడు. ఆ యాగం వినూత్నంగా సంబరంగా సాగుతుంటే సర్పాలు అగ్నిలో ఆహుతులవుతున్నాయి. ఇక తన గతి కూడా అంతేనేమో అని తక్షకుడు గడగడ వణికిపోతున్నాడు.

ఆ సమయంలో వాసుకి ఎలాగయినా సర్పయాగం ఆపాలనుకొన్నాడు. తన చెల్లెలితో (జరత్కారు మహాముని భార్య) 'చెల్లెలా! సర్పయాగం కారణంగా సర్పకులమంతా ఆహుతి అయిపోతూ వుంది. అయినా నాకు ఒక ఆశాకిరణం కనిపిస్తున్నది. ఏలా పుత్రుడయిన నాగకుమారుడు సర్పయాగం ఆస్తీకముని కారణంగా ఉపసంహరింప బడుతుందని చెప్పాడు. ఇది బ్రహ్మవాక్కట. అంచేత నీవు నీ కుమారుని జనమేజయుని యాగస్థలికి పంపు' అన్నాడు. అన్న వాసుకి ప్రార్థనను మన్నించి జరత్కారువు తన కుమారునితో భవన్మాతల వియోగం చేయించవలసినదిగా కోరింది. తల్లి ఆనతిమేరకు ఆస్తీకుడు జనమేజయ యాగస్థలికి వెళ్ళాడు. సకలవేద వేదాంగపారగులతో వెళ్ళి జనమేజయుని

ముందు ప్రశంసించాడు. తన యాగస్థలికి వచ్చిన ఆస్తీకుని స్వదేహకాంతితో సభాంతరాన్ని కాంతివంతం చేసిన తేజస్సును వీక్షించి విస్మితుడయ్యాడు. ఆపై ఆస్తీకముని ప్రశంసలకు ఉబ్బితబ్బిబ్బవుతూ "మునీశ్వరా! నీకేది అభీప్సితమో అద్దానిని ఇత్తు"నన్నాడు. అపుడు ఆస్తీకుడు "మదీయ బంధుసంతాన మహోజ్వరంబు పరతంబుగ నాకు ప్రియంబుగా మహోర్వీనుత సర్పయాగ ముడిగింపుము కావుము సర్పసంహితిన్" అని కోరాడు. అపుడు సభ్యులందరు తగినవాడు, అర్హుడు, తపోధనుడు అయిన ఆస్తీకునికి ఏది ఇచ్చినా క్షయం కాదని గౌరవంతో, ప్రేమతో అనుగ్రహించవచ్చని చెప్పారు. అపుడా జనమేజయుడు సర్పయాగాన్ని సర్వజనానుమతంబుగా ఉడిగించాడు. ఆపై తక్షక! మరలిపొమ్ము అన్నారు. ఆస్తీకమహామునిని సంతత స్తుతి పదారవంబు రమ్యంబుగా కీర్తించారట.

ఆస్తీకునిలో ప్రశంసింపదగిన అంశాలు మూడు. తల్లికోరితే కాదనక సర్పయాగస్థలికి వెళ్ళడం, జనమేజయునికి కోపం తెప్పించక కులగౌరవాదులను పొగడి వేదవేదాంగపారగులలాగా వెళ్ళి ఈ యాగం తగదని యుక్తాయుక్తంగా చెప్పడం, యాగసమాప్తికోసం తగిన పరివారంతో వెళ్ళడం. కనుకనే వ్యాసుడు ఈ కథను విస్తారంగా వర్ణించి ఫలశ్రుతిని కూడా చెప్పాడు. ఇది ధర్మోపదేశమే. ఆస్తీకమహామునిని తలిస్తే ఉరగభయం ఉండదని సూచన ప్రబోధం.

లోకంలో తప్పులు చేసేవారుంటారు. వారు శిక్షార్హులే. అంతమాత్రాన అతని కుటుంబాన్ని, అతని అనుచరులను, అతని సంతతిని పీడించడం తగదు. మన సాహిత్యంలో కొందరు తమకు కలిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని జాతికంతా శిక్షవేయడం తగదు. ఇది అనాలోచితం.

## 5. ఉదంకుడు

సంస్కృతభారతంలో ఉత్తంకుడుగా చెప్పబడినవాడే తెలుగు భారతంలో ఉదంకుడు. ఇతని వృత్తాంతం ఆది, అరణ్య, అశ్వమేధ పర్వాలలో కనిపిస్తుంది.

"వేద" ఉదంకుని గురువు. గురువు ఆజ్ఞమేరకు పౌష్యమహారాజు దగ్గరికి వెళ్ళి పౌష్యమహాదేవికుండలాలను స్వీకరించి గురుదక్షిణ తీర్చినవాడు. అయినా ఇతడు క్షణకోపి. పౌష్యుడు మునిని భోజనానికి ఆహ్వానించాడు. కాని ఆ భోజనంలోని కేశపాశాన్ని చూచి ఉదంకుడు పౌష్యుణ్ణి 'అంధుడవు కమ్మని' శపించినాడు. తనకే శాపమిచ్చాడని పౌష్యుడు కూడా దీటుగా ఉదంకుని శపించాడు. అయినా ఉపశమించిన ఉదంకుడు రాజుకు మరల చూపు వస్తుందన్నాడు.

ఒకసారి ఉదంకుడు తనకు సాక్షాత్కరించిన కృష్ణునితో విశ్వరూపం చూపమన్నాడు. కృష్ణుడు అలాగే రూపసందర్శనం చేసి వరం కోరుకోమన్నాడు. అపుడు ఆ ప్రదేశంలో జలసంపద లేదు. అయినా నేను కోరినవేళ జలసమృద్ధి అనుగ్రహించమంటే కృష్ణుడు సరేనన్నాడు. ఒకసారి కారడవులలో ఉదంకుడు సంచరిస్తుంటే అతనికి తీవ్ర దప్పిక కలిగింది. చుట్టప్రక్కల నీరు లేదు. ఆ సమయంలో కృష్ణుని వరం గుర్తుకు రాగా జలార్థం స్మరించగానే జలరాశి కనబడింది. అంతేకాదు. జలరాశికి ముందు మబ్బులు దట్టంగా ముసిరాయి. ఆకాశం నిర్మలంగా ఉండి మబ్బులు చేరితే ఇలాంటి మబ్బులనే "ఉదంక" మేఘాలని అంటారు.

ఉదంకుడు తనకోసం గాక గురుదక్షిణకోసం ప్రయత్నించడం, నిర్జల ప్రదేశంలో జలరాశి కనపడడానికి ప్రయత్నించడం ఇతరుల కోసమే. సత్పురుషుల ప్రవర్తనలో పరోపకారమే దాగి వుంటుంది. ఇది చాల అవసరం.

## 6. ఔద్దాలకి

ఈతని వృత్తాంతం భారతం అనుశాసనికపర్వంలో వర్ణితం. ఉద్దాలకుని కుమారుడు ఔద్దాలకి. అతడే నచికేతుడు.

ఉద్దాలకుడు ఒకసారి స్నానార్థం నదీతీరానికి వెళ్ళాడు. స్నానానంతరం పూజార్థం, హెూమార్థం, దర్భలకట్టను, జలపూర్ణకలశాన్ని పువ్వులను తెచ్చుకోవడంకోసం ఒకచోట ఉంచి మరచి ఆశ్రమం చేరుకొన్నాడు. ఆశ్రమం చేరుకొన్నాక వాటిని తెమ్మని కుమారుని పురమాయించాడు. ఆ కుమారుడు వెళ్ళేసరికి నదీప్రవాహం కారణంగా అవి కొట్టుకుపోయాయి. నచికేతుడు వట్టిచేతులతో వచ్చాడు. హెూమాదులకు ఆలస్యం కావడం పైగా భోజనసమయం దాటి పోవడంతో ఉద్దాలకుడు కొడుకును చూచి 'ఓరి జము ఁజూడ ఁబొమ్మని' శపించాడు. కుమారునితో శాపం ఉపసంహరించమని, ప్రసన్నుడవు కమ్మని వేడుకొంటుండగానే తెలివి తప్పి నేలపడ్డాడు. తండ్రి తన పరుషవాక్కును తానే నొచ్చుకున్నాడు. రాత్రి గడిచింది. తెలతెల్లవారింది. నిదురనుండి లేచినట్లు కుమారుడు లేవడంతో తండ్రి ఆశ్చర్యపడ్డాడు.

'తండ్రీ మీరు ఆదేశించినట్లే యమలోకాన్ని, యమలోకదృశ్యాలను చూచా'నన్నాడు.

ఈ కథలో అంతరార్థముంది. స్పృహ తెలియని దశలో శరీరం భూమిపైవున్నా అంతఃశరీరప్రవృత్తి పుణ్యలోకానికి వెళుతుంది. మనకు ఈ లోకంలో గాఢనిద్రలోని అవస్థ ఇదే. తండ్రి కోపంతో కసిరాడు. కాని తెలిసి కసరడం లేదు. అంతేకాదు కోపప్రకటన పశ్చాత్తాపం వెనువెంటనే జరిగాయి. ఇది చిత్తసంస్కారలక్షణం. గుణదోషాలను తర్కించుకోవడం, సరిదిద్దుకోవడం ఉత్తముల లక్షణం. ఇది ధార్మిక ప్రబోధమే.

## 7. ఔర్వుడు

ఇతని వృత్తాంతం ఆంధ్రమహాభారతం ఆదిపర్వంలో విస్తారంగా వర్ణితం.

ఈ పేరు చాల విచిత్రంగా కనిపిస్తుంది. ఊరువు అంటే తొడ. తల్లితొడను చీల్చుకొని పుట్టడం వలన ఔర్వుడనే పేరు వచ్చింది.

మార్తాండుని లాగా తొడనుండి బయటికి రావడంతో క్షత్రియులు దృష్టిహీనులయ్యారు. పర్వతారణ్యసంచారం చేస్తూ చివరకు దయనీయంగా ఔర్వుని తల్లినే దృష్టికోసం ప్రార్థించారు. మాపై భృగుపుత్రుడు ఔర్వుడు చాలా కోపంగా వున్నాడు. కారణం కార్తవీర్యసంతతి భృగుశిష్యుల కిచ్చిన దానం సొమ్ము మరలా యాచించడం అతనికి నచ్చలేదు. అంతేకాదు మేము అడగగా బ్రాహ్మణులు ధనమిచ్చినా మాకు పూర్తిగా ఇవ్వలేదని అన్నారు. కొందరు వారి భార్యల గర్భస్థ శిశువులను చంపడం. కనుక మీరు ఔర్వుని వేడుకోండి అన్నది. చివరకు అలాగే వారు ఔర్వుని వేడుకొంటే కార్తవీర్యసంతానానికి దృష్టి వచ్చింది.

ఔర్వుడు తన పితృదేవతల ప్రార్థనలతో తన కోపాన్ని ఉపసంహరించుకున్నాడు. తమ పూర్వీకులు కార్తవీర్యసంతానంతోనే మరణం కోరుకున్నారని ఆలస్యంగా తెలుసుకోవడం, ఆత్మహత్యకన్న తమకు దానమచ్చిన వారి చేతిలో మరణం మంచిదనుకోవడం.

ఈ వృత్తాంతంలో ధార్మికోపదేశముంది. లోకంలో దానం చేసిన వారెవరు మరల పుచ్చుకొన్నవారి దగ్గరనుండి ఇచ్చిన దానం కోరుకోరు. కాని కార్తవీర్యసంతతి తమకు డబ్బు అవసరం కావడంతో పుచ్చుకొన్న వారు ధనవంతులు కావడంతో వారి దగ్గరున్న ధనాన్ని దోచుకోవడానికి ప్రయత్నించడం లోకన్యాయం కాదు. భృగుపుత్రులు కార్తవీర్య

సంతానానికి కొంత ఇచ్చినా వారు సంతృప్తి పడలేదు. పూర్తిగా ఇవ్వలేదని సంశయించారు. ఒకసారి దానగ్రహీత ఇంట్లో వేడుకతో త్రవ్వుతుంటే సంపద లభించింది. బ్రాహ్మణులు తమకు మోసం చేశారని భృగువులను, వారి భార్యలను చంపడం సరికాదు. కాని వారే మరల పశ్చాత్తాప తప్తులైనవేళ ఔర్వుడు కరుణించాడు. "అపకారులకు ఉపకారం" చేయడం పుణ్యం అని సారాంశం. అంతేగాక తపోధనునికి కోపం పనికిరాదని పితృదేవతలు ఆదేశిస్తే ఆ కోపాన్ని నీళ్ళల్లో వదిలిపెట్టడం పితౄజ్ఞాపాలనా ధర్మాన్ని సుస్పష్టం చేస్తుంది.

## 8. కపిల మహాముని

ఈ మునిప్రస్తావన ఆంధ్రమహాభారతంలో అరణ్య, ఉద్యోగ, శాంతి, అనుశాసనిక పర్వాలలో కనిపిస్తుంది. శ్రీకృష్ణుడు సాంఖ్యులతో తాను "కపిలుడను" అని విభూతియోగంలో చెప్పాడు. యోగవిద్యలో కపిలుడే శ్రేష్ఠుడని అభిప్రాయం. అంపశయ్యపై పరుండిన భీష్ముని చుట్టూ చేరిన మునులలో కపిలుడు ఒకడు.

సగరుడు అశ్వమేధయాగం చేశాడు. అతనికి కుమారులు 60 వేలమంది. వారు తమ యాగానికి అశ్వరక్షకులుగా వెళ్ళారు. ఒకచోట అశ్వం అదృశ్యమయింది. వారు తండ్రికి ఈ విషయం చెప్పారు. అన్ని దిశలలో అన్వేషించమని సగరుడు ఆనతిచ్చాడు. కాని అశ్వం ఆచూకి తెలియలేదు. గుర్రం ఆచూకి లేకుండా వట్టి చేతులతో రావద్దని కఠిన శాసనం చేశాడు. వారు వెదుకుతూ ఒకచోట ఒక బిలాన్ని చూచారు. ఆ బిలాన్ని లోతుగా ఈశాన్యం వైపు త్రవ్వారు. తుదకు పాతాళం చేరారు. అక్కడ అశ్వాన్ని, కపిలమహామునిని చూశారు. వారు కపిలమహామునిని లెక్కచేయలేదు. అపుడు కపిలుడు కోపించి తీక్ష్ణంగా చూడగా మంటలు రేగి ఆ మంటలలో సగరపుత్రులు మాడిపోయారు. ఈ విషయం తెలిసి సగరుడు తన రెండవ భార్య కుమారుడయిన అంశుమంతుని పంపాడు.

అతడు కపిలుని చేరి సవినయంగా ప్రార్థిస్తే గుర్రాన్ని తీసుకెళ్ళమని కపిలుడు ఆదేశించాడు.

సగరుడు నూరు యాగాలు పూర్తి చేశాడు. భగీరథుడు తన తపశ్శక్తితో గంగను పారించి సగరపుత్రులను జీవితులను చేస్తానని శపథం చేస్తాడు.

సత్యాసత్యాలు తెలియక ఒకరిపై నిందవేయడం తగదు. అది అధర్మం. "వినయం" సర్వార్థసాధకము అని ధర్మప్రబోధం. ఫలితం ద్విగుణీకృతమని సారాంశం. లోకంలో సాధువర్తనులు ఇతరుల జోలికి పోరు. అయినా కొందరు అహంకారంతో వారిని పీడిస్తారు. వారి 'సహనమే' వారికి రక్ష. ఆ సహనం శత్రువులకు అశనిపాతమవుతుంది.

## 9. దధీచి

ఈ మహాముని ప్రస్తావన అరణ్య, శల్యపర్వాలలో కనిపిస్తుంది.

'అంగిరస' వంశంలో జన్మించినవాడు దధీచి. దేవేంద్రుడు వృత్రాసురుని సంహరించడానికి ఉపాయం ఆలోచిస్తూ బ్రహ్మను శరణువేడాడు. బ్రహ్మ దధీచిని ఆశ్రయించమన్నాడు. అతడు వరం ప్రసాదించగానే త్రిలోకహితార్థం అతని శరీరంలోని ఎముకలను ఇమ్మని కోరుకో అన్నాడు. అతడు తప్పక తన శరీరాన్ని త్యజిస్తాడు. అతని ఎముకలతో వజ్రాయుధం చేయించుకో. ఆ ఆయుధానికి ఆరు అంచులుంటాయి. ఆ వజ్రాయుధంతో వృత్రాసురుని సునాయాసంగా చంపగలవు అన్నాడు. ఆపై బ్రహ్మ చెప్పినట్లుగా సర్వం సన్నద్ధమై వృత్రాసురసంహారం జరిగింది.

లోకోత్తరులయిన వారు తనవలన మహోత్తరకార్యం నెరవేరుతుందంటే దేనికయినా సిద్ధపడతారు. దధీచి త్యాగం అలాంటిది. ఇది సామాన్యమయినది కాదు. ఇది పరులకోసం సిద్ధమయిన ఆత్మార్పణ.

ఈ ఆత్మార్పణం గడచిన దశాబ్దంలోను ఉన్నదే. చెరువుకు గండిపడితే ఒక ముత్తైదువ ఆత్మార్పణ చేసుకోవడం బుక్కరాయసముద్రం కథ ఇలాంటిదే.

## 10. కణ్వమహర్షి

ఆంధ్రమహాభారతంలో కణ్వమహర్షి ప్రస్తావన ఆది, ఉద్యోగ, శాంతిపర్వాలలో కనిపిస్తుంది.

కణ్వుడు తపస్వి అయినా కరుణాళువు. కనుక పక్షులచే రక్షింపబడే శిశువును చేరదీశాడు. తన కుమార్తెగా పెంచాడు. అతని తపశ్శక్తి చాలా గొప్పది. కనుక అతని ఆశ్రమప్రాంతంలో జంతువులకు సహజ విరోధం లేదు. శకుంతల కణ్వుడు లేనివేళ ఆశ్రమానికి విచ్చేసిన దుష్యంతుని రూపానికి, మాటల తీయదనానికి మైమరచి తనను తాను అర్పించుకొంది. ఆపై పెంపుడుతండ్రికి తెలియక చేసిన చర్యకు పరితపించింది. కణ్వమహర్షికోపాగ్నికి బలి అవుతానో ఏమో అని వగచింది. కాని కణ్వుడు కోపపడలేదు. వరం అనుగ్రహించాడు. పైగా పురువంశరాజులు సదా సుగుణవంతులుగా ఉంటారని, చిరకాలం రాజ్యపాలన చేస్తారని శకుంతల కోరినవిధంగా, మానసిక, ధార్మికబుద్ధి సదా వుంటుందని, శాకుంతలుడు దీర్ఘాయుష్షు, ఆరోగ్య, ఐశ్వర్య బలసమన్వితుడుగా రాణిస్తాడని, వంశకర్త అవుతాడని వరమిచ్చాడు.

ఉద్యోగపర్వంలోను కణ్వప్రసక్తి వుంది. సమరం వద్దని యుధిష్ఠిరునితో కలిసి పాలన చేయుడని దానితో ఉభయులకు శ్రేయస్కరమని చెప్పినవారిలో కణ్వుడు ఒకడు. అంతేగాక భౌతికబలం గురించి విశదం చేసినవాడు. భౌతికబలం బలంకాదు. దైవబలమే బలం. ఈ రెండూ పాండవులకున్నాయని చెప్పాడు. ఇందుకు ఉదాహరణగా 'గరుడభంగవృత్తాంతం' వినిపించాడు.

కణ్వుని మాటలలో "ఋషిత్వం" - సుస్పష్టం. భవిష్యత్ జ్ఞానం కలవారి సూచనలన్నీ ధార్మికాంతమే. భారతీయస్త్రీ ఏది కోరుకోవాలో శకుంతల చేత చెప్పడం ధార్మికత్వమే.

## 11. కశ్యపుడు

కశ్యపుని వృత్తాంతం భారతంలో ఆది, సభా, ఉద్యోగ, శాంతి పర్వాలలో కనిపిస్తుంది.

ఒక కన్యను దానం పుచ్చుకొనే విషయంలో విరోచన, అంగిరసుల మధ్య వివాదం పెరిగింది. మా ఇద్దరిలో ఎవరు గొప్పో తేల్చమని వారు ప్రహ్లాదుణ్ణి అడిగాడు. ప్రహ్లాదుడు ఏం చెప్పాలో తోచక కశ్యపుని దగ్గరికి వెళ్ళాడు. ప్రహ్లాదుడు తీర్పు చెప్పకపోవడానికి కారణం విరోచనుడు తన కొడుకు. అంగిరసుడు బ్రాహ్మణుని పుత్రుడు. సుగుణాలలో ఎవరు గొప్ప ఎవరు తక్కువ అని తేల్చడానికి ప్రమాణాలు లేవు.

కశ్యపుడు ప్రహ్లాదుని అర్థం చేసుకొని నీతులు చెప్పాడు. సాక్షి ధర్మాన్ని దర్శించే న్యాయమూర్తి క్షుణ్ణంగా పరిశీలించకుండా ధర్మనిర్ణయాలకు విరుద్ధంగా సాక్ష్యం, ధర్మం చెబితే అలాంటివారికి వెయ్యి వరుణపాశాలు బంధిస్తాయి. క్రమంగా ఏటేట ఒక్కొక్క పాశం వదలుతాయి. ధర్మం, అధర్మం చేత బాధింపబడి ఎవరయినా సభకు వస్తే దాన్ని తీర్చలేని సభ్యులు అధర్మం చేత బాధింపబడతారు. సభ్యులు కామక్రోధాదులను వదలి అధర్మాన్ని ఆపకపోతే ఆ అధర్మంలో నాల్గవ భాగం సభ్యులకు, మరొక నాల్గవ భాగం రాజులకు, మిగిలినవి కర్తకు సంక్రమిస్తుంది. అందుచేత ధర్మం తప్పక చెప్పాలన్నాడు. ప్రహ్లాదుడు క్షుణ్ణంగా పరిశీలించి తన కుమారుని కంటే అంగిరసుడు గొప్పవాడన్నాడు. తన కుమారునిపైగల మమకారాన్ని దూరం నెట్టి తీర్పు చెప్పిన ప్రహ్లాదుణ్ణి పొగిడాడు.

ఈ వృత్తాంతం న్యాయం చెప్పేవాడు ఎలా ఉండాలో నిర్దేశిస్తుంది. అలాగే పాపాల పంపకం గురించి విశదం చేస్తున్నది. ఇదొక హెచ్చరిక.

### 12. కిందముడు

ఈతడొక ముని. హిమాలయం దక్షిణం వైపున ఉండే భూములలో తపం ఆచరించేవాడు. ఆ చోటికి పాండురాజు వేటాడవచ్చాడు. అనేక మృగాలను తరిమి ఒక్కదాన్ని కూడా కొట్టడం సాధ్యం కాక కోపించి

**'మనసిజ రాగంబునఁ బెనఁ**
**గిన యిట్టిని వేడి ఁజూచి కృతహస్తుఁడు పె**
**ల్చన యే నమ్ముల నా రెం**
**టిని ద్రిళ్ళగఁనేసె ఁగడు కఠిన హృదయుండై.'**

ఆ జింకలు మరణిస్తూ మనుష్య వచనాలతో తన్ను పరిచయం చేసుకొంది. మృగాలుగా ఉంటే నీవు చంపినా తప్పులేదు. వేటాడడం, మృగాలను చంపడం రాజులకు ధర్మం. కాని పరిగెత్తలేనివి, ఆడుదానితో కూడుకొన్నవి, ఈనుతున్నవి, వ్యాధితో బాధపడేవాటిని, మాంసం తినే బోయలు కూడ చంపడం, కొట్టడం చేయరు. భరతవంశంలో పుట్టిన నీవు రాజధర్మం తప్పావు. మేము ఇష్టమైన సంభోగం సాగిస్తున్న వేళ మమ్మల్ని చంపావు. మాకెలాంటి మరణమో నీవు కూడా ప్రియురాలితో కలిసివున్నవేళ మరణం తప్పదు అని శపించారు.

ఈ కథకు ఒక సందేశముంది.

**ఎట్టి విశిష్టకులంబునఁ**
**బుట్టియు సదసద్వివేకములుగల్గియు మున్**
**గప్పిన కర్మఫలంబులు**
**వెట్టిన భోగింపకుండ నేర్తురే మనుజుల్**

మునులు జింకలు అయ్యారనడం నమ్మదగింది కాదు. సామాన్య పామరులకోసం జానపదధర్మంగా చెప్పిన తీరు ఇది. వాత్స్యాయన కామసూత్రంలో 'చౌశీతి' బంధాలని రకరకాల సంయోగవిధానాలు చెప్పబడ్డాయి. ఇది కురంగబంధమనాలి. అరణ్యంలో మునులు ఇలా చేస్తారని అనడానికి సమాధానం లేదు. కాని మాద్రి, పాండురాజులకు శిక్షపడడంకోసం సమన్వయించిన వృత్తాంతంగా దీనిని గ్రహించడం సబబు.

## 13. గౌతముడు

ఆంధ్రమహాభారతంలో గౌతమవృత్తాంతము ఆది, సభా, అరణ్య, శల్య, శాంతి, అనుశాసనిక పర్వాలలో ప్రసక్తం.

గౌతముడు ఋషి. అతని శిష్యుడు ఉదంకుడు. గురువు శిష్యులకు విద్యనేర్పి వివిధ వరాలనిచ్చి వీడ్కోలు ఇచ్చాడు. కాని ఉదంకునికి సెలవు ఇవ్వలేదు. ఒకరోజు అడవినుండి ఉదంకుడు కట్టెలు తెచ్చాడు. కిందపెట్టేవేళ ఒక కట్టె జడను తగులుకొని పడిపోయింది. అది ముసలితనం కారణంగా నెరసినకేశం. అద్దంలో చూచి తనకు ముసలితనం వచ్చింది అని బాధపడ్డాడు. గౌతముడు ఈ దృశ్యం చూచాడు. ఉదంకుని కన్నీటిబొట్టు కిందబడకుండా దోసిలి పట్టమని కుమార్తెకు ఆనతిచ్చాడు. ఆపై ఉదంకుని పిలిచి బాధకు కారణమడిగాడు గౌతముడు. వెళ్ళిపోయిన శిష్యులపట్ల దయవున్నట్లు తనపై గురువుకు దయవుండాలని కోరుకున్నాడు. గురువు

**ఎలప్రాయ మిచ్చితిని నీ**
**కలఘుమతీ యిచ్చెదను మదాత్మజ మల్లం**
**బలరంగ బెందిలి నమ్మ**

అన్నాడట. ఓర్చినవారికి చక్కని గంజిలాగా గురుసాన్నిహిత్యం గురు తనూజతో వివాహం జరగడం విశేషం.

## 14. చండకౌశికుడు

బృహద్రథుడు రాజు, పరాక్రమవంతుడు. కాని అతనికి సంతానం లేదు. ఒకసారి పత్నిద్వయంతో అడవికి వెళ్ళి చండకౌశికుని చూచాడు. అతడు ముక్తికాంక్షాపరుడు. అగ్నిలా మహాతేజస్వి, ధన్యుడు, పాపరహిత మనస్కుడు, పుణ్యాత్ముడు. అలాంటి మునిని రాజు సేవించాడు. ముని "నీ కిష్టంబు చెప్పు మిచ్చెద" అన్నాడు. అపుడు రాజు తనకుగల పుత్రోదయ కాంక్షను ప్రకటించాడు. అపుడు ముని కూర్చున్న మామిడి చెట్టునుండి ఒక ఫలం పడింది. రాజుకు ఆ ఫలం ఇచ్చాడు. రాజు సమంగా కోసి ఇద్దరి భార్యలకు ఇచ్చాడు. వారు గర్భవతులయ్యారు. కాని సంతానం ఒక కన్ను, ఒక చెంప, ఒక చన్ను, సగం బొడ్డు, ఒక చేయి, ఒక పక్క ఒక తొడ, ఒక కాలు అన్న చందంగా మానవ శరీరపు భాగం ముక్కలుగా జన్మించాయి. రాణులిద్దరు ఎలా ఈ విషయం రాజుకు చెప్పడానికి జంకి పనికత్తెలను పురమాయించి దూరంగా పారవేయమన్నారు. నాలుగు త్రోవలు కలిసేచోట పడవేశారు. రాత్రి 'జర' అనే రాక్షసి ఆ రెండు ముక్కలను సంధించి రాజుకు ఇచ్చింది. తన్ను తాను జర అని పరిచయం చేసుకొంది. చివరకు నా సహవాసం సర్వదా నీక్షిష్టమైనది చేయాలన్నది. రాజు ఆ రాక్షసికి ఏటేట మహోత్సవాలు జరిగేలా కట్టడి చేశారు. కొంత కాలానికి చండకౌశికుడు బృహద్రథుని చూడడానికి వచ్చాడు. రాజు మునిని గౌరవించాడు.

ముని రాజును పొగిడాడు. జరాసంధుడు ప్రతాపవంతుడవుతాడని అన్నాడు. కుమారస్వామివంటివాడు నీ కొడుకు అన్నాడు. నిప్పులో పడ్డ శలభంలా ప్రతివారలు ఇతని చేతిలో మరణిస్తారన్నారు. దివ్యాస్త్రాలు చీల్చని దేహం నీ కుమారునిది. ఇవన్నీ విన్న బృహద్రథుడు

**తనయుని నభినవ యౌవను**
**ననుపము నభిషిక్తుఁజేసి యవనీభరమా**
**తని ఁబుచ్చి సభమ్యుండయి**
**యనఘ తపోవనమునకు బృహద్రథుడరిగెన్.**

'వార్ధకమునివృత్తానాం' అనే ధర్మాన్ని ప్రతిఒక్కరు పాటించాలని చెప్పే వృత్తాంతమిది. అలాగే పుట్టిన వైకల్యంగల శిశువులను పారవేయడం ఆనాటికి ఉందేమో. అలాగే సంతానం బ్రతకడానికి కారణమయిన గ్రామదేవతను (జరను) పూజించడం ఆనాటికి ఒక ఆచారం కావచ్చు.

## 15. చ్యవనుడు

ఆంధ్రమహాభారతం ఆది, అరణ్య, శాంతి, అనుశాసనిక పర్వాలలో చ్యవనవృత్తాంతముంది.

చ్యవనుడు శుక్రుని కుమారుడు. పులోముడను రాక్షసుడు పంది రూపంలో భృగుపత్నిని ఎత్తుకొనిపోతుండగా, ఆమె గర్భములోని బాలకుడు బయటపడ్డాడు. బయటపడినవాడు కనుక చ్యవనుడు అని పేరు.

చ్యవనుడు తపోనిష్ఠలో వుండగా పుట్టకట్టగా విహారార్థం వచ్చిన శర్యాతి కూతురు సుకన్య పుట్టలోనివాని కన్నులు చూచింది. కళ్ళను పొడిచింది. చ్యవనుడు కోపంగా శర్యాతిసైన్యానికి మూత్రప్రవాహ నిరోధం చేశాడు. యథార్థం తెలుసుకొన్న శర్యాతి మునికోరికతో తన కుమార్తెను ఋషికి భార్యగా అప్పగించాడు. ముసలివానిని పెళ్ళాడినా, సుకన్య అతనికి తగినట్లే తపశ్చర్య ఆచరించేది. ఒకసారి అశ్వినులు ఆమెను చూచి వృద్ధుని సేవించుట ఎందుకు? మాలో ఒకరిని వరింపుమన్నారు. వారు మాలో ఒకరిని వరిస్తే చ్యవనుని యువకునిగా

మారుస్తామన్నారు. చ్యవనుడు అంగీకరించమన్నాడు. చివరకు ముగ్గురు సరస్సుల్లో దిగారు. వారందరు ఏకాకృతులు. సుకన్య తన మగడయిన అసలు చ్యవనుని గుర్తించింది. చ్యవనుడు మీవలన యౌవనం, అందం, అనుకూలవతి భార్య దక్కిందని అందులకు ప్రత్యుపకారంగా సోమపీథులను చేస్తానని వాగ్దానం ఇచ్చాడు. కాని దేవేంద్రుడు వారు దేవవైద్యులయినా సోమపానార్హులుకారని ఆక్షేపించినాడు. కాని చ్యవనుడు సోమపానం ఇస్తే వజ్రాయుధం ప్రయోగిస్తానన్నాడు. చ్యవనుడు జడియక సరేనన్నాడు. ఇంద్రుని శక్తులు స్తంభించాయి. అశ్వినీదేవతలకు సోమపానం దక్కింది. అపుడు ఇంద్రుడు చల్లబడి నీ యశస్సు వ్యాపించాలని నేనే ఈ మాయ చేశానన్నాడు.

ఒకసారి చ్యవనుడు ఉపవాసజీవితం గడపాలని అనుకున్నాడు. గంగాయమునల సంగమస్థలంలో నీళ్ళక్రింద 12 సంవత్సరాలు తపస్సు చేశాడు. నదిలోని జలచరాలు హాయిగా తిరిగేవి. ఒకసారి జాలరులు వల వేయగా చ్యవనుడు పట్టుబడ్డాడు. జాలరులు భయపడ్డారు. క్షమించమన్నారు. చేపలు మరణించాయి. నదిలోని చేపలతో సహజీవనం కనుక చేపలు లేక తాను నివసించలేనన్నాడు. లేదా చేపలతో తన్ను అమ్ముకోమన్నాడు. అమ్మకానికి బేరం తగలలేదు. ఒక ఆవునుండి పుట్టినవాడు బ్రాహ్మణులకు, గోవులకు సమానత్వం. జాలరులకు ఒక గోవును ఇమ్మన్నాడు. రాజు అలాగే చేశాడు.

ఈ కథలో ధర్మప్రబోధాత్మక అంశాలు చాలా వున్నాయి. చపల చిత్తలయిన స్త్రీలు ఎక్కడ ఎలా ప్రవర్తించాలో నేర్చుకోవాలని ప్రబోధం. రాజుకు సైన్యరక్షణ ప్రధానం. కనుక సైనికుల మూత్ర పురీష నిరోధ నివారణార్థం తన కూతురినైనా వదులుకోవడంలో రాజు తన్ను నమ్ముకున్న వారి క్షేమంపట్ల జాగరూకత వహించాలనడం. మూడవది

పెళ్ళాడిన భర్త ఎలాంటివాడయినా అతనితో గడపాలని నిర్ణయించుకోవడం. ఇక చిరకాలం ఎవరితో సహవాసం చేశాడో వారిని విస్మరించడం సరికాదనే సిద్ధాంతం.

ఈ రోజుల్లో ఆయుర్వేదంలో చ్యవనప్రాసకు ఎంతో విలువ వుంది. బలవర్ధకమూ ఆరోగ్యరక్షకమయిన ఔషధం. ముసలివారయినా సేవిస్తే యువకులలాగా జపసత్త్వాదులతో మెరుస్తారని విశ్వాసం.

## 16. జమదగ్ని

ఆంధ్రభారతంలో అరణ్య, అశ్వమేధపర్వాలలో జమదగ్నివృత్తాంతం ప్రస్తావితం.

జమదగ్ని భార్య రేణుక. అతనికి ఐదుగురు పుత్రులు. ఒకసారి రేణుక కుమారులతో అడవికి వెళ్ళింది. కుమారులు ఫలార్థం వెళితే రేణుక వనంలో చిత్రరథదంపతులను చూచింది. వారి సంయోగాన్ని చూచిన మైకంలో తగనిరీతిలో చిత్రరథునితో మెలిగింది. అయినా ఈ వృత్తాంతం జమదగ్నికి తెలిసింది. రేణుకను చంపమని కుమారులకు ఆజ్ఞ ఇచ్చినా ఎవరు ముందుకు రాలేదు. కాని పరశురాముడు ఆ ఆనను పాటించాడు. తండ్రి వరం కోరుకోమంటే పరశురాముడు జననీవధదోషనిష్కృతి, సోదరుల శాపనిష్కృతి, సమరంలో అప్రతిహతశక్తి, దీర్ఘాయువును కోరితే అనుగ్రహించాడు.

జమదగ్ని పితృకార్యార్థం, స్వయంగా హోమధేనువు పాలను పితికి కొత్తకుండలో భద్రపరచినాడు. జమదగ్నిని పరీక్షించాలని క్రోధాధిదైవం ప్రత్యక్షమై ప్రామాదికంగా పడవైచినట్లు ఆ భాండాన్ని నేల దొరలించింది. జమదగ్ని కోపపడలేదు. అతని సహనానికి మెచ్చుకొని నేనోడితిని అని క్రోధాధిదేవత చెప్పింది. వెంటనే వెళ్ళమని జమదగ్ని ఆ

దేవతను కోరాడు. కాని పితృదేవతలు అతని నిశ్చలత్వాన్ని చూచి ముంగిస కమ్మని శపించాడు. తాపసికి కోపం రాకూడదనే తలంపుతో తాను కోపబడలేదని సంజాయిషి ఇచ్చాడు జమదగ్ని. అపుడు ఏనాడయితే విదర్భవిప్రులు సమ్మతించే వాక్యాలు పలికిననాడు శాపవిముక్తి అని అనుగ్రహించారు. తల్లిని చంపవలసిందిగా ఆనతిచ్చి తన ఆనతిని లెక్కచేయని కుమారులను ఘోరాడవిలో జడమతి మృగపక్షుల్లాగా జీవించండని శపించాడు. కాని పరశురాముని ప్రార్థనతో శాపం తొలగింది.

ఈ మూడు సన్నివేశాలలో మూడు ధర్మాలున్నాయి. తప్పుచేసిన తల్లి వలన కుమారులకు జీవితాంతం చెడ్డపేరు. భర్తగా తనకు అపవాదు, కనుక శిక్ష అవసరమే. అరణ్యానికి కదిలి వెళ్ళినవారు రేణుకను ఒంటరిగా వదలి తాము ఫలాదులకోసం వెళ్ళడం తప్పు. కనుక తప్పుకు శిక్షతగినదే అని ధర్మోపదేశం.

రెండవది తాపసికి కోపం తగదు. క్రోధాన్ని జయించినవాడే ఉత్తమ తాపసి. ఆ సద్గుణం జమదగ్నికి ఉండడం ప్రశంసార్హం. మూడవది సత్యవచనం. ధర్మరాజు అన్నదానంకంటే సక్తుప్రస్థుని దానం సర్వశ్రేష్ఠము అని నిర్భయంగా చెప్పడం ఇవన్నీ ధార్మికకథనాలే.

దానం చేసినా ప్రశంసలను చేయరాదు. కుడిచేయి చేసే దానం ఎడమచేతికి తెలియరాదని శాస్త్రవచనం. మరి అన్నదాన విషయంలో ప్రకటన, ఆర్భాటం తగవు.

## 17. దుర్వాసుడు

దుర్వాసుని వృత్తాంతం, మహాభారతం, ఆది, అరణ్య, అనుశాసనిక పర్వాలలో కనిపిస్తుంది.

దుర్వాసుడు సంచారిగా ప్రసిద్ధి. కోపి అని మరో విమర్శ. అయినా శ్వేతకి యాగానికి ఋత్విక్కుగా యాగం నిర్వహించాడు. అలాగే దుర్వాసుడు ఒకసారి ముద్గలుని దగ్గరికి చింపిరి తలతో, పిచ్చివానిలా పోయి ఆహారం అర్థిస్తే ముద్గలుడు చాలినంత ఇచ్చాడట. దుర్వాసుడు అంతా తిని ఇంకా కావాలని అర్థించాడట. రాజు దుర్వాసుని ఆకలిని గ్రహించి ఆహారం సమకూర్చేవాడట. దుర్వాసుని ఆహారవాంఛను, అసహ్యించుకోక, అతని వేషాన్ని ఆకలివాని వేషంగా గుర్తించడం శ్వేతకి గొప్పతనం. దుర్వాసుడు వరం కోరుకోమంటే స్వర్గప్రాప్తిని శ్వేతకి కోరాడు. తథాస్తు అనగానే హంస, సారసాలు అలాగే రంభ వచ్చిందట. శ్వేతకి సంతోషంతో దివి చేరుకున్నాడు.

కుంతిభోజుని ఇంటగల కుంతి దుర్వాసునికి సేవచేసి మెప్పించింది. దుర్వాసుడు సుతప్రాప్తి మంత్రోపదేశం వల్ల ఆమె ధర్మ, భీమ, అర్జునులకు తల్లి కాగలిగినది. మాద్రిని కూడా సంతానవతిని చేసింది. దుర్వాసుడు ద్వారకలో తన్ను నమస్కరించిన స్త్రీ వేషధారిలోని సాంబునికి ఏ సంతానమంటే "ముసలం" అన్న మునులలో దుర్వాసుడు ఒకడు. యాదవకుల వినాశనానికి ఇదే ఉపాయమయింది. కృష్ణుణ్ణి ఒళ్ళంతా పాయసం పూయమని చెప్పగా కృష్ణుడు అలాగే అని పూశాడు. అరికాలిలో పాయసం పూయకపోవడం వల్ల కృష్ణా! నీకు అరికాలిలోనే మరణం అన్నాడు. ఏది ఏమయినా అనేక సందర్భాలలో దుర్వాసుని చేతలు ఎబ్బెట్టుగా కనిపించినా అవన్నీ ఎదుటి వారి ఔన్నత్యాన్ని, ప్రసిద్ధిని పెంచినవే. పరోక్షంగా ధర్మోపదేశాలే!

దుర్వాస వరం లేకపోతే పాండురాజుకు సంతానం లేదు. కాగల కార్యాన్ని భవిష్యత్ జ్ఞానంకల ఋషి తీర్చడం విశేషం. పరిహాసం సమవయస్కుల మధ్య అయితే తప్పేమిలేదు. కాని తాపసులతో పనికిరాదని ధార్మికోపదేశం.

## 18. నారదమహర్షి

పాశ్చాత్య విద్వాంసులకు, సంస్కృత సాహిత్య పరిచయం కలవారికి అచ్చెరువు కలిగించిన పాత్ర నారద పాత్ర. కరావలంబస్తోత్రంలో ప్రహ్లాద నారద పరాశర పుండరీక వ్యాసాంబరీష శుకశౌనక హృన్నివాస పాదంలో ప్రహ్లాదుని తరువాత గణనకెక్కినవాడు నారదుడే. నారదుడు అనేకాంశాలలో అసమానుడు. నారాయణభక్తిని నారాయణుని నుండే స్వీకరించినవాడు. గాన విద్యాగ్రహీతలలో ప్రథముడు. ముల్లోకాలలోను సుప్రసిద్ధుడు. భూలోకంలో జనమేజయుడు సర్పయాగం చేసినవేళ సదస్యుడుగా వ్యాసాదులతో పాల్గొన్నవాడు. లోకంలో నారదుడు కలహభోజనుడిగా ప్రసిద్ధుడయినా లోకకళ్యాణాలకు కారణమయిన వాడు. నారదుడు ఇతరులకు ధర్మబోధ గావించిన సంఘటనలు చాలా ఉన్నాయి.

నారదుడు దక్షప్రజాపతి కుమారులకు సాంఖ్యం ఉపదేశించాడు. ఈ ఉపదేశప్రభావంతో వారందరు సన్యాసులయ్యారు. ఈ అంశం సంస్కృత భారతం ఆదిపర్వంలో ఉంది.

నారదుడు పాండవులకు సన్నిహితుడు. వారి మేలును కోరినవాడు. ఇందుకు తొలి ఉదాహరణ పాండవులు ద్రౌపదిని పెళ్ళాడాక వారికి కలిగిన సందేహాన్ని నివృత్తి చేయడం. మత్స్యయంత్రాన్ని ఛేదించడం వల్ల అర్జునుడే ద్రౌపదికి మగడు. కాని ధర్మరాజు తల్లితో అమ్మా భిక్షం తెచ్చామన్నాడు. నాయనా! ఐదుగురు పంచుకొనండి అంది. అసలు సంగతి చెప్పగానే కుంతి మాట మరల్చుకోలేకపోయింది. చివరకు ద్రౌపది ఐదుగురికి పెళ్ళామయింది. ఇంతవరకు బాగుంది కానీ ఐదుగురు పాంచాలితో ఎలా గడపాలనే సందేహం ఐదుగురిలోను ఉంది. ఆ సమయాన నారదుడు సుందోపసుందుల కథ చెప్పి

**ఇంతుల నిమిత్తమున ధృతి**
**మంతులు బొందుదురు భేదమతిగావున మీ**
**రింతయు నెఱఁగి యొండులు**
**చింతింపక సమయ మిందుసేయుఁడు బుద్ధిన్.**

అన్నాడు. పాండవులు నారదోపదేశం విన్నారు. పాండవులు ఐదుగురి పట్ల ద్రౌపది ప్రేమతో ఒక్కొక్కరి ఇంట ఒక్కొక్క సంవత్సరము క్రమంగా ఉండడానికి, ద్రౌపది ఉన్న ఇంటివైపు ఇతరులు వెళ్ళకుండా ఉండడానికి, ఒకవేళ ఎవరైనా తెలియక వెళ్ళితే, అతడు పన్నెండునెలలు తీర్థయాత్రలు, విశేషవ్రతాలు చేయడానికి అంగీకరించారు. అంతేకాదు పాండవులు "అమ్మునీంద్రునొద్ద సమయంబు చేసినారు" ఇది నారద మహర్షి ధర్మప్రబోధంలో రెండవది.

ధర్మరాజు ఇంద్రప్రస్థం ఏలుతున్న వేళ నారదుడు పాండవులకు చేసిన ధర్మోపదేశం మూడవది. ఇది రెండు రకాలు. మొదటిది స్వర్గలోకంలోని పాండురాజు కోరిక తెలపడం. రెండవది రాజ్యపరిపాలనకు సంబంధించి సలహాలివ్వడం. ఈ రెంటినీ పాండవులు పాటించారు. ధర్మరాజు రాజసూయయాగం చేసి తమ్ముళ్ళ ఐక్యతను నిరూపించుకోవడమే గాకుండా తన కాలంనాటి రాజులలో తిరుగులేని గౌరవం అందుకోవటం జరిగింది.

నారదుడు ధర్మరాజుతో 'వంశానుగతమైన ధర్మపద్ధతిని పాలిస్తున్నావు కదా! యోగ్యులయినవారిని వారివారి సామర్థ్యాల కనుగుణంగా పదవుల్లో నియమించావు కదా! రహస్యాలోచనాన్ని జాగ్రత్తగా చేసుకొంటున్నావు కదా! సేవకులందరికీ కొరతలేకుండా తగుజీతాలు ఇస్తున్నావు కదా! సైన్యంలో మరణించినవారి కుటుంబాలకు ఆసరాగా ఉంటున్నావు కదా! అనావృష్టి భయంలేకుండా చెరువుల నిండా

నీళ్ళు నింపుతున్నావు కదా! రైతులకు తక్కువ ధరలో విత్తనాలు ఇస్తున్నావు కదా! అర్హులయిన వారిని గౌరవిస్తున్నావు కదా! అంటూ పురోహితుల ఎంపిక, సైన్యాధ్యక్షుని నియామకంలో జాగ్రత్త, జ్యోతిష్కుల సహాయంతో శాంతికర్మల పట్ల ఆసక్తి, శ్రద్ధ, వైద్యం అందేలా ఆలోచన, వంశపారంపర్యంగా వచ్చే సేవకులకు సన్మానం, ఉద్యోగుల పనితీరుల పట్ల పరిశీలన, వికలాంగులపోషణ, పన్నులపట్ల జాగరూకత, ప్రశంస పొందేవిధంగా కొలువు, గూఢాచారవ్యవస్థలో జాగ్రత్త, కోట సంరక్షణ సలహాలను తగినవారిని గుర్తించడం లాంటి అంశాలపట్ల ప్రశ్నించాడు. ప్రతి అంశం విషయంలో ఆజ్ఞగా నారదుడు చెప్పలేదు. రాజదోషంబుల పరిహరింతె, ఉత్సుకంతె, పరికింతె, ప్రోతె, ఇత్తె ఇలాంటి క్రియాదులతోనే నారదుడు ధర్మరాజు పాలనావిధానాన్ని ఆరా తీసాడు. ఆరా తీయడానికి నారదునికి అర్హతలున్నాయి. పాండురాజుతో స్నేహం, త్రిలోక సంచారిత్వం, ధర్మరాజుని పట్లగల అనురక్తి కారణాలు.

మూడవది రాజసూయయాగ ప్రేరకుడుకావడం. ఈ ప్రేరణలో తమ్ముళ్ళ సంఘటిత ఐక్యం, పాండవుల పరాక్రమం, దిగ్విజయ సామర్థ్యం కౌరవులకంటే పాండవులు సమున్నతులనే భావం కలిగించాడు. కనుకనే నారదుడు

**చేయుచు రాజసూయ మెడసేయన్ దాననజేసి దోషముల్**
**వాయునిఖిలేశ భూప్రజలకు బార్థివులెల్ల భవత్ప్రతాపని**
**ర్జేయులు సర్వసంపదలు చేకొనగా ఁదటియయ్యె**

అని బోధించాడు.

నాల్గవది కురుక్షేత్ర సమరసమయంలో సహాయం. కురుక్షేత్ర యుద్ధంలో 14వ రోజు కురుపాండవులు రాత్రి యుద్ధానికి తలపడినారు. ఆ సమయంలో నారద పర్వతులు దీపాలు వెలిగించారట.

పాండవుల ధర్మపాలనకు ఆకర్షితుడయిన నారదుడు చేసిన మరో సహాయం. అశ్వత్థామ పాండవులపై బ్రహ్మశిరోనామక అస్త్రం ప్రయోగించాడు. అర్జునుడు అదే అస్త్రాన్ని ప్రయోగించాడు. ఈ అస్త్రాలచేత బాధింపబడుతున్న లోకసంరక్షణార్థం నారదుడు వ్యాసునితో కలసి రెండు అస్త్రాల మధ్య నిలిచి తమ తమ అస్త్రాలను ఉపసంహరించుకోవలసిందిగా కోరారు. ఈ ఉపదేశంవలన పెద్ద ప్రమాదం తప్పింది.

నారదుడు త్రిలోకసంచారి. భారతం అరణ్యపర్వంలో ధర్మరాజుకు 227 పుణ్యతీర్థాలను, వాటి ప్రాముఖ్యాన్ని వివరించాడు.

ఒక కుటుంబంలో అన్నదమ్ముల మధ్య వివాదం పెరగకుండా తగిన నిర్ణయం సూచించే నైపుణ్యం నారదులకే ఉంది.

## 19. పరాశర మహర్షి

ఆంధ్రమహాభారతంలో పరాశర వృత్తాంతం ఆదిపర్వంలో విస్తారంగా కనిపిస్తుంది. దైవికఘటనతో సత్యవతీ పరాశరులు ఒకరిపట్ల ఒకరు ఆకర్షితులయ్యారు. ఈ సన్నివేశం వర్ణించే వేళ పరాశరుని గుణాలను నన్నయ విపులంగా వర్ణించాడు. అతడు హతమదమత్సరుడు, త్రిజగత్ విదితుడు, వసిష్ఠ పౌత్రుడు, శక్తిపుత్రుడు, అఘనాశన ఘోరతపోధనుడు, సువ్రతుడన్నాడు. అయినా ఏకాంతంలో సత్యవతిని చూడగానే కామవశుడై పరాశరుడు తన కోరికను తీర్చమన్నాడు. అపుడు ముని తనను శపిస్తాడేమోనని సత్యవతి తనకు దోషం లేకుండా చూడమన్నది. పరాశరుడు కన్యాత్వంబు దూషితం కానట్లు వరము ఇచ్చాడు. అంతేకాదు నీవు వసురాజ్యవీరసంజాతవు సూతకుల ప్రజాతవు కావు. తనువు నుండి సుగంధం వెలువడుతుందని అనుగ్రహించాడు. అప్పటినుండి గంధవతి, యోజనగంధి అనే పేర్లు సత్యవతికి స్థిరపడ్డాయి.

పగటివేళ సంగమం నిషేధం, అని సత్యవతి అనగానే పరాశరుడు చీకటికమ్మేలా చేశాడట. వారిరువురికి జన్మించినవాడే వేదవ్యాసుడు.

పరాశరునిచేత ధర్మబద్ధమా అనే వివాదం సాహిత్య సామాజిక లోకంలో లేకపోలేదు. అయితే పరాశరుడు సత్యవతిని బలవంతం చేసి లోబర్చుకోలేదు. తన అభిప్రాయం ప్రకటించి ఆమె కోరిక ప్రకారం కోరిన వరాలిచ్చి సంగమించాడు. కనుక అద్దానిని తప్పిదం అనరాదు. పరస్పరం అంగీకరించిన సంగమం దోషంగా ఎంచడానికి వీలులేదు. ఈ కారణంవలన బెస్తవేషంలోని సత్యవతి ఎన్నో ఫలితాలను పొందింది. గంధవతి కావడం, కన్యాత్వానికి కళంకం లేకపోవడం చివరకు విష్ణురూపుడయిన వ్యాసజననానికి కారకులు కావడం జరిగాయి. అంతేకాదు జనించిన వేదవ్యాసుడు కృష్ణాజినపరిధానుడయి కపిలజటామండల దండకమండల మండితుడయి తల్లి తలచేవేళ వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. సాంఘికనియమాలు కాలానుగుణంగా వుంటాయి. ఈ దృష్టితో 'సత్యవతి' శీలాన్ని పరీక్షించడం సబబు. అలాంటి సత్యవతిని శాంతనవుడు కోరాడు. కనుక పరాశరుడు సత్యవతికి ఇచ్చినది మహర్షి రక్షకవరం. ఈ కథ జరిగింది ద్వాపరయుగం. ద్వాపరయుగంలో ధర్మం రెండు పాదాలలో నడుస్తుందనడం వల్ల ఇలాంటివి ద్వాపర ధర్మ లక్షణాలుగా గ్రహించడం సబబు.

## 20. పులస్త్యబ్రహ్మ

ఆంధ్రమహాభారతంలో ఆది, సభా, అరణ్య, ఉద్యోగపర్వాలలో పులస్త్యబ్రహ్మచరిత్ర ప్రస్తావితం.

బ్రహ్మమానసపుత్రులు ఆరుగురు. వారిలో పులస్త్యుడు ఒకడు. ఇతరులు మరీచి, అత్రి, అంగిరసుడు, పులహుడు, క్రతువు. వీరిలో వసిష్ఠుని చేర్చగా ఏడుగురని ప్రసిద్ధి. పులస్త్యుని సంతానమంతా రాక్షసులు, వానరులు, కిన్నెరులు.

పరాశరుడు తన తండ్రిని చంపిన రాక్షసులపై పగపట్టినాడు. రాక్షసయాగం మొదలెట్టాడు. ఆ యాగంలో అనేకులు మరణించారు. పులస్త్యుడు పరాశరునితో – నీ తండ్రివధతో ఏ సంబంధంలేని రాక్షసులను చంపడం న్యాయమా అన్నాడు. తాపసులయిన బ్రాహ్మణులు ఇలాంటి ప్రయత్నం చేయరాదు అని మందలించాడు. పులస్త్యుని మాటలు విని పరాశరుడు రాక్షసయజ్ఞం ఆపేశాడు. వారే దుర్యోధనాది సంతానంగా జన్మించారు.

'వినదగు నెవ్వరు చెప్పిన' అని నీతి. పులస్త్యుడు చెప్పగా పరాశరుడు రాక్షసయాగాన్ని ఆపాడు. ఉత్కృష్టమయిన ధర్మోపదేశానికి ఎదురుండదు. అంతేగాక పరస్పరద్వేషంతో సంహారం మంచిది కాదు. అంతకన్న చెప్పినవానికంటె విన్నవాడు గొప్పవాడని ధర్మోపదేశం.

## 21. బకమహర్షి

భారతేతిహాసంలో బక నామకులు నలుగురు ఐదుగురున్నారు. వారిలో ఒకడు రాక్షసుడు. మరొకడు మహర్షి. ఇతడు దాల్భ్యుడు, దేవేంద్రుని స్నేహితులు.

ఒకనాడు ఐరావతం ఎక్కి దేవేంద్రుడు త్రిలోకసంచారం చేస్తూ బకాశ్రమానికి వచ్చాడు. మహర్షి త్రిలోకాధిపతికి అతిథిసత్కారం చేశాడు. ఆ తరువాత ఇష్టాగోష్ఠి సాగుతుండగా దేవేంద్రుడు

ఓ ఋషీ! నీవు లక్షసంవత్సరాలు జీవించావు. అంచేత చిరకాలం జీవించేవారి కష్టసుఖాలు నీకు బాగా తెలుసు. వాటిని చెప్పవా అని అడిగాడు. అందుకు సమాధానంగా బకమహర్షి ఇష్టులు కానివారితో కలిసి జీవించడం, ఇష్టులైనవారు వదలివెళ్ళిపోవడం చిరంజీవికి భరించరాని కష్టాలు. తన భార్యాపుత్రులు, తన ఇతర బంధుమిత్రులు మరణిస్తే, తాను ఇతరులపై ఆధారపడి బతకరావలసిరావడం కంటె

మరో బాధలేదు అన్నాడు. ఆపై చిరంజీవులకు ఏవి ఆనందాన్ని కలిగిస్తాయని అడగ్గా "తాను సంపాదించిన కొద్దిపాటి ఆకుల్ని తన ఇంట వండుకొని తినేవాడు గౌరవార్హుడు. ఇతరుల ఇంట్లో ఎంతటి భోజనమయినా తినడానికి సరికాదు. అది అనర్థం. అందువల్ల ఇతరుల ఇంటి భోజనాన్ని ఛీ అంటారు. తన అతిథులకు, భృత్యులకు, పితృదేవతలకు, బ్రాహ్మణులకు సమర్పించగా మిగిలిన ఆహారంకంటే మించిన పవిత్ర ఆహారం మరొకటి లేదు. తన ఇంట ఏ బ్రాహ్మణుడయినా భోంచేస్తే వెయ్యి గోవులు దానం చేసినంత పుణ్యఫలం దక్కుతుంది. తాను చేసిన పాపాలన్నీ నశిస్తాయి. ఇంతకు మించిన ఆనందం మరొకటి లేదు."

ఇవన్నీ సార్వకాలీన సత్యాలే. ఆచరణకు అన్నివిధాల తగినవే.

## 22. బకదాల్భ్యముని

ఈతని వృత్తాంతం ఆంధ్రమహాభారతం అరణ్యపర్వంలో కనపడుతుంది.

పాండవులు అరణ్యవాసంలో ద్వైతవనానికి వెళ్ళారు. అక్కడ వాసం చేస్తున్నవేళ బకదాల్భ్యముని వచ్చాడు. పాండవులు ఆ మునిని గౌరవించారు. పాండవులతోడవున్న బ్రాహ్మణులను, అగ్నిహోత్రులను చూశాడు. బ్రాహ్మణానుగ్రహంతో వైరోచనాదులు అనేక సంవత్సరాలు అక్షయ సంపదలతో భూమిని రక్షించావంటూ మీరు కూడా అలాగే రాణిస్తారని అనుగ్రహించాడు. వాయువుతో కూడిన అగ్నిదేవునిలాగా బ్రాహ్మణులతో వున్న రాజులు శత్రువర్గాన్ని నిశ్శేషం చేస్తారని ప్రజానురాగం గల రాజే సుస్థిరంగా ఉంటాడని ఆశీర్వదించాడు. మీరు బ్రాహ్మణప్రియులు, ధర్మనిరతులు ఎప్పుడును మీకు అభ్యుదయం కలుగుగాక! అని దీవించాడు.

సత్యవచనకథనం, ధర్మబోధనలోచనం, అంతేగాక చెప్పినవాడు ముని. ఇక్కడ బ్రాహ్మణశబ్దాన్ని జాతివాచకంగా గాక బ్రహ్మజ్ఞానం కలవారని గ్రహించడం పేచీలేని వ్యవహారమవుతుంది.

## 23. బృహదశ్వుడు

బృహదశ్వుడు ఒక ముని. అతడు అడవిలోని ధర్మరాజు దగ్గరికి వచ్చాడు. ధర్మరాజు అతనిని గౌరవించాడు. తాము కౌరవులవలన పడిన బాధలను వివరించి మాలాగా గతంలో ఇబ్బందులు పడినవారున్నారా అని ప్రశ్నించగా ఆ ఋషి నలుని కథను సువిస్తారంగా చెప్పాడు. అతడు ధర్మరాజుతో

**దేవసములైన యనుజులు**
**తో విప్రులతో రథాలతో వచ్చి యర**
**ణ్యావాసము సేసెదు ధర**
**ణీ వల్లభ నీవు ధర్మనిష్ఠిత బుద్ధిన్**

అని నలుని కథను చెప్పాడు. ఆ కథలో ఎన్నో సదుపదేశాలున్నాయి. మొదటిది భార్య అవసరం.

**'అధిక దుఃఖరోగార్తున కౌషధంబు**
**సురుచిరంబుగ భార్యయ చూలె యెందు**
**భార్య సమేతుడైయున్నవాని**
**కెంతలయ్యును నాపద వెఱుక పడవు'**

అలాగే

**ఎల్లవారు నెఱుగ రెల్లవారిని**
**భిన్న విషయులెల్లవారు విద్యలందు**

నలచరిత్ర వినడంవల్ల కలిగే ఫలితాలు అరణ్యపర్వంలో 2-231లో వర్ణితం.

సదః పరనిర్వృత్తి, చిత్తశాంతి, రసానందతన్మయత్వం, ఈ కథాశ్రవణం ఆంతరంగిక ప్రయోజనము. కర్కోటక, దమయంతి, నల, ఋతుపర్ణులను స్మరిస్తే కలిదోషాలుపోతాయనడం సామాన్య ప్రయోజనము.

క్షత్రియులలో సామాన్యులలాగా, ఇంకా చెప్పాలంటే నికృష్ట జీవితం గడిపినవారు హరిశ్చంద్రుడు, నలమహారాజు. సత్యనిష్ఠ హరిశ్చంద్రుని ఇబ్బంది పెట్టినా లోకోత్తరుని చేసింది. అలాగే నలమహారాజు జీవితం. కనుకనే కవులు చాలామంది వీరిరువురి కథలను అనేక ప్రక్రియారూపాలలో తీర్చారు.

## 24. భరద్వాజమహర్షి

ఆంధ్రమహాభారతంలో అరణ్య, శల్య, శాంతి, అనుశాసనిక పర్వాలలో భరద్వాజుని ప్రసక్తి కనిపిస్తుంది.

ఉదయం లేవగానే ప్రస్తుతింపబడే ఋషులలో భరద్వాజమహర్షి ఒకడు. బ్రహ్మ సృష్టించినవారు. ఒక్కొక్క విద్య నేర్వగా భరద్వాజుడు ఆయుధవిద్య నేర్చాడు. బ్రహ్మసభలోనివాడని ఒక కథనం.

కురుక్షేత్ర సమయంలో ద్రోణుడు సమరం సాగిస్తుంటే 15వ రోజు భరద్వాజమహర్షి ఇతర మునులతోబాటు ద్రోణునికి కన్పించి ద్రోణుని యుద్ధం చాలించమన్నాడు.

ఇది సదుపదేశం. బ్రాహ్మణజాతి విలువిద్య నేర్వాలి కాని సమరం చేయరాదు. ఇది కులధర్మం. ద్రోణుడంతటివాడికి చెప్పగలిగినవాడు భరద్వాజుడొక్కడే. బృహస్పతి నుండి ఆగ్నేయాస్త్రం పొంది పరశురామునికి ఇచ్చినవాడు ఈ ఋషియే. అలాగే దివోదాసునిచే యాగం చేయించి అతనికి ప్రతర్దనుడనే కుమారుని అనుగ్రహించినవాడు ఈ మునియే.

ఇది ఆచరణాత్మక ధర్మోపదేశం. సర్వులు అంగీకరించినవే.

## 25. భార్గవ చ్యవనముని

ఇతని వృత్తాంతం అనుశాసనికపర్వంలో ఉంది. భార్గవ చ్యవనుడు గంగానదిలో తపస్సుచేసే ముని. అతని చుట్టూ చేపలు. అయినా భార్గవుడు అక్కడ 12 ఏళ్ళు తపం కొనసాగించాడు. ఒకసారి బోయలు చేపలకోసం వచ్చి వల వేశారు. ఆ వలలో ముని పడ్డాడు. బోయలు తెలియని తప్పుకు తమ్ము క్షమించమన్నారు. ముని శాంతికాముకుడు కనుక శపించలేదు. అంతేకాదు. నా నదీ గర్భవాసం 12 ఏళ్ళు చేపలతోనే గడిచింది. చేపలను అమ్ముకున్నట్లే నన్ను అమ్ముకోండి అన్నాడు. వారా సంగతిని రాజుకు విశదం చేశారు. రాజు ఆ ప్రదేశానికి వచ్చి నమస్కరించాడు. బోయలు తెలియకచేసినా, తెలిసిచేసినా ఆ అపరాధానికి నేను బాధ్యుణ్ణి. కనుక తప్పుకు తగిన ప్రాయశ్చిత్తం చెప్పమన్నాడు. ముని ఈ తప్పు మీది కాదన్నాడు. అయినా చేపలకు వెలకట్టినట్లే నా శరీరానికి తగిన వెలకట్టి బోయలకు ఇమ్మన్నాడు. రాజు వేయి మాడలను పంపగా ముని తగవెరిగి మూల్యం చెల్లించమన్నాడు. ఇలా రాజు హెచ్చరించి డబ్బు పంపడం, ముని తిరస్కరించడమూ జరిగాయి. చివరకు రాజు తన రాజ్యాన్ని ఇవ్వడానికి సంసిద్ధుడయ్యాడు. కాని మునివైపు నుండి ఆశించిన సమాధానం రాలేదు. అపుడు 'కవిజాతుడు' అనే వ్యక్తి తాను మూల్యం నిర్ణయిస్తానన్నాడు. గోవులకు, బ్రాహ్మణులకు తేడా లేదు. కనుక జాలరులకు గోవు నిమ్మన్నాడు. ముని సరేనన్నాడు. రాజు గోవును జాలరులకు ఇచ్చాడు. మునికి చేపలమీద కరుణ కలిగింది. జాలరుల కోరికనే అందరూ వినేలా చేపలకు స్వర్గలోకప్రాప్తి అన్నాడు. చివరకు మునులు రాజును వరం కోరుకోమంటే

**"ధర్మ పరత్వంబు వాసవాభ**
**వైభవము నయ్యెడును నీకు వంశపావ**
**నాత్మ"** అన్నారట.

తానెవరితో చిరకాల సహవాసం చేస్తారో వారు సహచరుల సుగుణాన్ని, క్షేమాన్ని తమదిగా భావిస్తారు. ఇదొక ధర్మోపదేశం.

భార్య చేసిన తప్పు భర్తది. శిష్యుల తప్పు గురువులది. ప్రజల తప్పు రాజులది. కనుక రాజు మునితో తన్ను క్షమించమనడం సబబే.

## 26. భృగుమహర్షి

ఇతని చరిత్ర ఆంధ్ర మహాభారతంలోని అరణ్య, శాంతిపర్వాలలో కనిపిస్తుంది.

యువనాశ్వుడు ఇక్ష్వాకువంశపు రాజు. అతడు పరాక్రమ వంతుడు. అశ్వమేధయాగం చేసినవాడు. అయినా నిస్సంతానుడు. కనుక అతడు భృగుమహర్షి ఆశ్రమానికి వెళ్ళి సేవించాడు. ఆ ఋషి కరుణించి పుత్రకామేష్టి చేయించాడు. మంత్రపూత కలశాన్ని రక్షించమన్నాడు. ఆ కలశాన్ని ఋత్విజులు రక్షించేవారు. కాని ముందటిరోజు నిద్రలేమిచే వారు ముని ఆదేశాన్ని పాటించక నిదురపోయారు. ఆ సమయంలో నీటిదప్పిక కారణంగా రాజే ఆ మంత్రపూతజలాన్ని తాగేశాడు. తన నగరికి వెళ్ళిపోయాడు. ఆపై నూరు సంవత్సరాలకు రాజు వామభాగం నుండి తేజస్సుగల కుమారుడు పుట్టాడు. అపుడు దేవేంద్రుడు దిగివచ్చి వానినోట వేలుంచి అమృతమయంబగు దీనిని తాగమన్నాడు. ఆ సమయాన దేవతలు ఆ శిశువుకు "మాంధాత" అనే నామకరణం చేశారు.

గ్రస్తుడనే రాక్షసుడు భృగుమహర్షిభార్యను అపహరించాడు. ఈ వార్త తెలిసి భృగుమహర్షి కీటకమగుమని శపించాడు. ఆ రాక్షసుడు కీటకమయ్యాడు. ఇతడే పరశురాముని తన తొడపై నిడుకొని నిద్రాభంగం చేయక కాపాడుకొన్న కర్ణుని తొడను తొలిచాడు. రక్తం కాలువై పారింది. పరశురాముడు లేచి కీటకాన్ని చూచాడు. కీటకానికి శాపవిముక్తి.

భృగుమహర్షి నదీస్నానం కోసం వెళుతూ అగ్నిప్రజ్వలనకార్యాన్ని గర్భవతియైన తన భార్య పులోమకు అప్పగించాడు. ఆ సమయంలో ఒక రాక్షసుడు వచ్చి పులోమను చూచి కామాతురుడై ఈమె ఎవరి భార్య అని అగ్నిని అడిగాడు. నిజం చెప్పకపోతే పులోమను బాధిస్తాడని చెప్పకపోతే తనకు అసత్యదోషమని భావించి సత్యం చెప్పాడు. అపుడారాక్షసుడు పులోమ నా పూర్వపు ప్రేయసి అని తనవెంట ఎత్తుకొనిపోయాడు. దారిలో పులోమ ప్రసవించింది. ఆ శిశుదర్శనంతో ఆ రాక్షసునికి శాపవిమోచనం. భృగువు ఆశ్రమానికి వచ్చి అగ్నిని చూచి నీవు అతిక్రూరుండవు, సర్వభక్షకుండవు కమ్మని శపించాడు.

ఈ మూడు వృత్తాంతాలలోను ధర్మోపదేశమున్నది. మునిసేవనం వల్ల, ముని ఉపదేశంవల్ల సంతానం కలుగుతుందనే విశ్వాసం గొప్పది. రెండవది దుష్టుడు తపస్సు చేయడం సహజమే. కాని దుష్టుని పాపఫలం, మరొక మునివల్ల దర్శనంవల్ల విమోచనం. మూడవది రాక్షసుని కాముకత్వం హర్షింపదగ్గది కాదు.

## 27. మాండవ్యముని

మాండవ్యముని వృత్తాంతం ఆంధ్రభారతం ఆదిపర్వంలో కనిపిస్తుంది.

మాండవ్యుడు ఒక బ్రాహ్మణుడు. అతడు సత్యవ్రతుడు. తపస్సంపన్నుడు. అతడు సదా మౌనవ్రతంలో ఎన్నో సంవత్సరాలు ఆశ్రమ సమీపంలోని చెట్టుక్రింద కూర్చొని చేతులు పైకెత్తి ధ్యానించేవాడు. ఒకసారి దొంగలు దోచుకున్న వస్తువులతో ఆశ్రమానికి వచ్చి లోపల దాక్కున్నారు. వారిని వెంబడించి వచ్చిన రాజభటులు మునితో దొంగల సంగతి అడిగారు. ముని ఏమి మాట్లాడలేదు. రాజభటులు ఆశ్రమంలో దాక్కున్నవారిని దొంగలించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

వారికి ఋషిపై అనుమానం కలిగింది. దొంగలతోబాటు మునిని రాజు ముందు నిలబెట్టారు. రాజు మునిని శూలబంధితుని చేశాడు. చోరులను చంపించినాడు. శూలబంధునిగా మునిని చేసినా అతడు మరణించలేదు. అతడు తపశ్శక్తి చేత ఇతర మునులను రప్పించుకొన్నాడు. వారు మునికి విధించిన శిక్షను చూచి బాధపడ్డారు. పక్షుల రూపంలో వచ్చినవారు, ఈ స్థితికి కారణం ఎవరు అని అడిగారు. ఇవన్నీ వింటున్న రాజభటులు రాజుతో సర్వమూ చెప్పారు. రాజు తానే వచ్చి శూలాన్ని ఊడలాగించాడు. కాని సాధ్యం కాలేదు. అయినా అతడు తపం మానలేదు. చివరకు ముని తానేమి పాపం చేశానో చెప్పమని యమధర్మరాజును అడిగాడు. అపుడా! యముడు 'నీవు ఒక చిన్న పురుగును గడ్డిపరకతో గ్రుచ్చావు. ఆ కారణంగా నీవు ఈ ఫలితాన్ని అనుభవించావు' అని చెప్పాడు. మాండవ్యుడు చిన్న తప్పుకు పెద్దశిక్షనా అని జన్మ మొదలు 14 సంవత్సరాలు దాటనంతవరకు పురుషుడు వాడేది చేసినా పాపం లేకుండుగాక అంటూ యముణ్ణి శపించాడు.

ఈ వృత్తాంతంలో ఒక సందేశముంది. సృష్టిలో 84 లక్షల జీవరాశులున్నాయి. స్వతంత్రంగా బతకడానికి అవకాశముంది. అనవసరంగా ఒకరిని నొప్పించకూడదనే నీతి ఈ కథనంలో సుస్పష్టం.

తప్పుకు తగ్గ శిక్ష అవసరం. చేసిన తప్పుకు పెద్దశిక్ష తగదు. అలాగే తనలాగే చిన్న తప్పులకు ఇతరులు పెద్దశిక్షలు అనుభవించ కూడదని ఒక నిర్ణయం చేయడం హర్షణీయమే.

## 28. మార్కండేయుడు

ఆంధ్రమహాభారతంలో మార్కండేయ వృత్తాంతం సభాపర్వం, వనపర్వం, శాంతి, అనుశాసనిక, మహాప్రస్థానికపర్వాలలో కనిపిస్తుంది. బ్రహ్మసభలోని మహర్షులలో ఇతడొకడు. అంపశయ్యపై వున్న భీష్ముని

చుట్టూ వున్న మునులలో ఇతడొకడు. మయసభను దర్శించినవారిలో ఇతడొకడు.

పాండవులు అరణ్యవాసంలో వుండగా మార్కండేయమహర్షి వచ్చి ద్రౌపదిని తలచుకొని దశరథరాముడు గుర్తుకురాగా నవ్వాడట. అపుడు యుధిష్ఠిరుడు మా పాట్లు చూచి ఆనందంగా నవ్వుతున్నారెందుకు అన్నాడట. నేను మిమ్మల్ని చూడగా దశరథరాముడు గుర్తుకు రాగా నవ్వానన్నాడు. పరాక్రమవంతుడైన రాముడు కూడా అడవులలో తిరగవలసివచ్చింది అంటూ ఏనాటికి గాని నేను అనే గర్వం పనికిరాదని బోధించాడు. ధర్మరాజు హృదిలో లోలోపలగల రాజాహంకారాన్ని పోగొట్టాలని ముని చేసిన ప్రయత్నం ఇది. అలాగే మరోసారి వచ్చి అనేక కథలు చెప్పాడు. వానిలో శిశురూపంలో విష్ణువు పాలకడలిలో శయనించిన వైనం, "ఆయువు" కథ, యయాతి చరిత్ర, ధర్మవ్యాధుని కథ, కుమారస్వామి కథలను చెప్పాడట.

మార్కండేయుడు సంచారి. అతని పర్యటన ఇతరులకు బోధన జ్ఞానదాయకం. లోకంలో ఎవరూ వినని రాజుల వృత్తాంతాలు విన్నవాడు. రాజుకు బహుపురాణపరిజ్ఞానం అవసరం. అలాగే విద్వజ్జన పరిచయం అవసరం. వారి ధర్మబోధనలు సర్వజనావళికి అవశ్యం శ్రోతవ్యం.

## 29. మైత్రేయమహర్షి

ఇతని వృత్తాంతం మహాభారతంలో ఆది, సభాపర్వాలలో ప్రస్తావితం.

మైత్రేయుడు న్యాయవేత్తగా ప్రసిద్ధుడు. అతడు అరణ్యవాసులయిన పాండవుల కడనుండి ధృతరాష్ట్రుని దగ్గరకు వచ్చాడు. ధృతరాష్ట్రుడు అతనికి సపర్యలు చేశాడు. ఎక్కడనుండి వస్తున్నారని అడగ్గా "కామ్యక

వనం" నుండి వస్తున్నాను. పాండవులు కామ్యకవనంలో తపోభారంచేత పెరిగిన జడలతో మోటు నారబట్టలు కట్టుకొని, కూరలు, పండ్లు ఆహారంగా స్వీకరిస్తూ సమయపాలన చేస్తున్నారు అని చెబితే ధృతరాష్ట్రుడు కురుపాండవ సోదరభావానికి విఘాతం కలిగేలా ప్రవర్తించడం లేదు కదా! అని ప్రశ్నించాడు. ఆపై మైత్రేయుడు దుర్యోధనుని దగ్గరికి వెళ్ళి విరోధం విడనాడు. కురు, పాండవ వంశాలకు మేలు కలుగుతుంది. పాండవుల బలాన్ని తక్కువ సేయకు. వారు వజ్రశరీరులు. మహా పరాక్రమవంతులు. ఉత్సాహవంతులు. అందరు పదిలక్షల ఏనుగుల బలం కలవారు, యుద్ధానికి 'సై' అనేవారు. భీముడు అద్భుతవీరుడు. భీముని ఎదిరించగల వీరుడు మీ పక్షంలో లేరు. వారికి వాసుదేవ, దృష్టద్యుమ్నులు సంబంధ సహాయులు. మానవమాత్రులు వారిని ఎదిరించి బ్రతకలేరు. నీవు వారితో పొత్తుకుదుర్చుకో మంచిదన్నాడు.

మైత్రేయుడు ఇలా ఉపదేశిస్తుంటే దుర్యోధనుడు పాద అంగుష్ఠంతో నేలరాస్తూ చేతులు పైకెత్తి తొడలు చఱచినాడు. మైత్రేయుడు అతని చేతలను రోసి ఈ అపరాధం సహింపదగనిది. సమరంలో భీమ గదాఘాతంతో మరణిస్తావు అని శాపం ఇచ్చాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు మైత్రేయమునిని చూచి శాపాన్ని ఉపసంహరించుకోమన్నాడు.

**కడలో సమబుద్ధి వీనిని గలిగెనేని**
**గాదు శాపఫలం బట్లుగాక బుద్ధి**
**హీనుడై గర్వితుండగునేని శాప**
**హవ్యవాహఫలంబు వీఁడనుభవించు.**

ఎంత ఉన్నతపదవిలో ఉన్నా, ఇతరులను అవమానించరాదు. మరి తాపసుల ముందు ఈ వికారచేష్ట పనికిరాదు అనడమే ఈ వృత్తాంత సారాంశం.

## 30. రోమశమహర్షి

రోమశుని వృత్తాంతం ఆంధ్ర మహాభారతంలో అరణ్యపర్వంలో ప్రస్తావితం.

రోమశుడు ఒక మహర్షి. ఇంద్రుడు ఈ మహర్షిని ధర్మరాజుతో తీర్థయాత్రలు చేయించుము అని ఆదేశిస్తే అతడు ధర్మరాజు దగ్గరికి వచ్చి అతనితో తీర్థయాత్రాభిలాషను పెంచినవాడు. ఆ సందర్భంలో ధర్మరాజు రోమశునితో "వసుధన ధర్మవర్తులగు వారల వర్ధనకు కారణం ఏమిటి వారి వ్యవహారం ఇలాగే సాగవలసిందేనా" అని అడిగాడు. అందుకు రోమశుడు అధర్మవర్తనుల అభివృద్ధి స్థిరం కాదు. వారు గర్వితులై దుర్మార్గులై నశిస్తారు. ఇలాంటివారు సహస్ర సంఖ్యలో ఉన్నారు. ధర్మరాజు అధర్మపతుల పతనం ఎలా జరుగుతుందని ప్రశ్నిస్తే రోమశుడు

'అధర్మప్రవర్తన కలవారిలో గర్వం సహజం. గర్వంవల్ల స్వాభిమానం పెరుగుతుంది. స్వాభిమానం వలన కోపం, కోపం వలన సిగ్గు పోతుంది. సిగ్గూ, సత్ప్రవర్తన లేనివారికి నిగ్రహం, సంపద నశిస్తాయి. మీరు దేవతలతో సమానం. ధర్మంగల పనులలో మాత్రం పురుషాహంకారం నెరపటానికి ఇష్టపడతారు. మీకు శ్రమ విజయం తథ్యం అంటూ తీర్థయాత్రల వలన కోరికలు నెరవేరతాయి. అంతేకాదు కొందరు విప్రవరులతో కదిలారు. నైమిశం, అశ్వతీర్థం, కన్యాతీర్థం, గోమతి, బాహుద, మహానది, గంగా యమున నదులలో పుణ్యస్నానం చేశారు. అలాగే నాలుగు నెలలుపట్టే యాగాన్ని గయలో చేశారు.

ఈ వృత్తాంతం సందేశాత్మకం. దేహానికి సంబంధించిన నియమాలు మానుషవ్రతాలు. మనస్సును, బుద్ధిని, శుచిగా ఉంచేవి దేవవ్రతాలు. పుణ్యక్షేత్రాలను దర్శించిన వారిలో 8 మంది సార్వభౌములున్నారు. మీరు అలా తీర్థయాత్రలు సేవించి ధన్యులు కండి

అని ఉపదేశం ఇచ్చాడు. కన్నడంలో "దేశనోడు కోశ ఓదు" అనే నానుడి వుంది. అనగా దేశాన్ని చూడండి, గ్రంథాలు చదవండి అని అర్థం.

తీర్థయాత్రల వలన జీవనసరళిలో మార్పు, ప్రజల స్థితిగతులు అవగతమవుతాయి. తీర్థాదులలో వినే కథల వలన విజ్ఞానం అభివృద్ధి అవుతుంది.

## 31. వసిష్ఠ విశ్వామిత్రులు

వీరి వృత్తాంతం ఆంధ్రమహాభారతంలో ఆది, శాంతి, అనుశాసనిక పర్వాలలో కనిపిస్తాయి.

మహర్షిగణంలో వీరిది స్నేహవైరం, వైరస్నేహమనడం సముచితం. రామాయణభారతాదులలో వీరి ప్రశస్తి సుస్పష్టం.

వసిష్ఠ కుటుంబం సృష్ట్యాది నాలుగు కుటుంబాలలో ఒకటి. వసిష్ఠునికి మూడు జన్మలని ఒక విశ్లేషణ వుంది. బ్రహ్మమానసపుత్ర జన్మ మొదటిది. దక్షయజ్ఞంలో మరణించిన అరుంధతి అనుసరించగా ఇద్దరు నక్షత్రాలు కావడం. ఇక రెండవది బ్రహ్మయాగకుండం నుండి జన్మించడం. ఈ జన్మలో అరుంధతి అక్షమాలగా అవతరించింది. ఇక మూడవది ఇక్ష్వాకురాజుల శాపంవలన శరీరం కోల్పోయి మిత్రావరుణుల కుమారునిగా అగస్త్యునితోబాటు ఒక కలశంలో జన్మించడం.

విశ్వామిత్రుని కుటుంబం అనేక రకాలుగా చెప్పబడింది. జహ్ను, అజహ్నుడు, వల్లభుడు, కుశికుడు, గాధి విశ్వామిత్రుడని ఒక పరంపర. ఇతరత్రా తేడాలున్నా కుశిక - గాధి - విశ్వామిత్రుడనడంలో తేడా లేదు. భారతం ప్రకారం సత్యవతి తల్లికి సోదరుడిగా విశ్వామిత్రుడు జన్మించాడు. ఋచీకవృత్తాంతం బట్టి గాధిభార్యకు విశ్వామిత్రుడు, సత్యవతికి జమదగ్ని జన్మించారు. మొత్తముపై వసిష్ఠునిది బ్రాహ్మణ తత్త్వము. విశ్వామిత్రునిది క్షత్రియతత్త్వం. వీరిరువురి వైరం జగత్ప్రసిద్ధం.

విశ్వామిత్రుడు వసిష్ఠాశ్రమంలోని నందినిని బలవంతంగా పట్టుకొని వెళుతుంటే నందిని అరచింది. అపుడు వసిష్ఠుడు నేను బ్రాహ్మణుణ్ణి. క్షమాగుణం కలవాడు ఏమీ చేయలేడు. కాని నందిని నుండి పుట్టిన సైన్యం విశ్వామిత్రుని సైన్యాన్ని కకావికలం చేసింది. అపుడు విశ్వామిత్రుడు బ్రాహ్మణులదే నిజమైన బలం. క్షత్రియబలం బలంకాదని తాను బ్రహ్మర్షి అయ్యేదాకా శ్రమించాడు. ఆపై అతనిలో సాత్త్వికం పెరిగింది.

వసిష్ఠుడు కల్మాషపాదునికి సంతానవరం ఇచ్చినవాడు. అతని భార్య మదయంతి 12 ఏళ్ళు గర్భం మోసి చివరకు విసిగి విసిగి అశ్మశకలంతో ఉదరభేదం చేసుకొన్నదట. అపుడు పుట్టినవాడే అశ్మకుడు. కార్తవీర్యార్జునుడు సహస్రబాహువు, అనంతశాస్త్ర సమన్వితుడు. ఒకనాడతని వద్దకు అగ్నిదేవుడు విచ్చేసి ఆహారమడిగితే ఆరణ్యకులను ఆహారంగా నిర్దేశించాడు. అగ్ని అలా కాలుస్తూ వసిష్ఠుని ఆశ్రమాన్నే కాల్చాడు. ఆ సమయంలో అగ్నిదేవునికి రక్షకుడయిన కార్తవీర్యార్జునుని కోపించి తన ఆశ్రమం కాలడానికి కారకుడయిన కార్తవీర్యార్జునునికి బాహుఖండన శాపమిచ్చాడు.

పూర్వం భృత్యుని అపరాధానికి రాజే కర్త. అందువల్ల వసిష్ఠుడు అగ్నిపై కోపం ప్రకటించలేదు. రాజుపై కోపం ప్రకటించాడు. ఇది ఒక ధార్మికోపదేశం.

పూర్వగీర్వాణులు గీర్వాణుల క్రతువులను ధ్వంసం చేశారు. అపుడు గీర్వాణులు వసిష్ఠుని శరణువేడారు. అపుడా వసిష్ఠుడు అత్తాపసోత్తముని రోషానలజ్వాలలు సాకారంబులగు అద్వైతలోకాన్ని కాల్చిందట. ఇందులో ధార్మికోపదేశముంది. లోకక్షేమార్థం క్రతువులను

ఆచరించడం సంప్రదాయం. ఆ క్రతువులకు ఆటంకం కలిగించడం తగదు. వసిష్ఠుని శాపం సరి అయినదే.

విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అయ్యాక వసిష్ఠుని చంపాలనుకొన్నాడు. ఉపాయం ఆలోచించి సరస్వతీనదిని తలచుకొన్నాడు. సరస్వతి స్త్రీరూపంలో వచ్చింది. వసిష్ఠుని నా దగ్గరకు తీసుకురా అని ఆదేశించాడు. ఆమె విశ్వామిత్రుని తపోవైభవానికి భయపడి వసిష్ఠుని కడకు వెళ్ళి సత్యం చెప్పింది. వసిష్ఠుడు అలా చేయడం సబబు. కాకపోతే విశ్వామిత్రుడు శపిస్తాడన్నాడు. వసిష్ఠుడు కూర్చున్న స్థలాన్ని అపహరించి విశ్వామిత్రుని దగ్గరికి వెళ్ళి అప్పగించింది. విశ్వామిత్రుడు నదిని స్తుతించి, వసిష్ఠుని ఎలా చంపాలా అని అనుకొంటుండగా నది వసిష్ఠుని అక్కడినుండి తొలగించింది. అందుకు విశ్వామిత్రుడు కోపించి "శోణితవాహినివి" కమ్మని శపించాడు. కొంతకాలానికి మునులు వచ్చి ఆ నదిలోనే స్నానం చేసి యథాస్థితికి వచ్చేలాగా అనుగ్రహించారు.

కొందరు స్వసామర్థ్యం వల్ల మహోన్నతులు కావచ్చు. కాని వారిలో నిద్రాణమయిన దుడుకుతనం మాసిపోదు. మాత్సర్యవిషయంలో దుడుకుతనం బహిర్గతమవుతుంది. ఏది ఏమయినా రామాయణ కాలంనాటికి వీరిరువురు లోకక్షేమం కోసం శ్రమించినవారే. వసిష్ఠునికున్నంత సాత్త్వికత విశ్వామిత్రునికి తొలుతలేదు. అయినా రాముని గొప్పతనాన్ని, పరాక్రమాన్ని, ఆర్తరక్షణాన్ని ప్రపంచానికి తెలియచెప్పడానికి సహకరించినవాడు విశ్వామిత్రుడే. దశరథుడు విశ్వామిత్రుని వెంట అడవులకు పంపడానికి తటపటాయించిన వేళ విశ్వామిత్రుని అస్త్రశస్త్రప్రావీణ్యాన్ని రాజుకు అవగతం చేసి శ్రీరాములవారికి అద్దాన శుభమని చెప్పినవాడు వసిష్ఠుడే.

## 32. వామదేవుడు

ఇతని వృత్తాంతం భారతంలో అరణ్యపర్వంలో ఉంది.

ఇంద్రసభలో వుండే మునులలో వామదేవుడు ఒకడు. ఈతని దగ్గర కడువేగవంతములయిన వామ్యములనే గుర్రాలున్నాయి. వసుమను అనే మాధవీపుత్రులలో ఒకరుగా ప్రసిద్ధి. దశరథుని పురోహితులలో ఒకడని ప్రసిద్ధి.

ఒకసారి శలుడు వామదేవునితో నీ దగ్గరున్న గుర్రాలను ఇమ్ము అని కోరాడు. అంతేగాక ఇవి రాజుల దగ్గర వుండదగినవని దబాయించాడు. పైగా నాలుగు గుర్రాలకు బదులు కావాలంటే నాలుగు గాడిదలు తీసుకుపో అన్నాడు. అపుడు వామదేవుడు అతని పరిహాస ప్రసంగానికి, వేళాకోళానికి అసహ్యించుకొని నలుగురు రాక్షసులు నిన్ను నాలుగు భాగాలుగా నరికి తీసుకొని వెళతారని శపించాడు. కాని వామదేవుడు బ్రాహ్మణుల్ని దండిస్తే నీకు స్వర్గప్రాప్తి లేదన్నాడు. చివరకు దుర్మార్గపుచావు చచ్చాడు.

అలాగే దలుడు శలుని లాగా వితండవాదం చేస్తే, అపుడు అతని భార్య వామదేవా! నా భర్త మూర్ఖుడు, నేనే అతనికి బోధిస్తాను. నాకు సదా బ్రాహ్మణసేవ కలిగే భాగ్యం ప్రసాదించమని కోరింది. అపుడు వామదేవుడికి రాజ్యాలిస్తానన్నాడు. వామదేవుడు రాజ్యాలు నేనేం చేసుకొంటానని నాకవసరం లేదు అన్నాడు. చివరకు తన తప్పు తెలుసుకొని దలుడు నమస్కరించి వామదేవుని గుఱ్ఱాలు ఇచ్చేశాడు. పదవీ అహంకారం అనర్థదాయకమని నీతి.

లోకంలో ఒకరి అధీనంలోని దానిని బలవంతంగా పరిగ్రహించడం న్యాయవిరోధం. ధర్మసమ్మతం కాదు. పైగా నాలుగు గుర్రాలకు బదులు నాలుగు గాడిదలిస్తాననడం అహంకారానికి నిదర్శనం. అయినా

రాజపుత్రుడు సమ్మతించడం రాణి వామదేవుని వేడుకోవడంతో సమస్యకు పరిష్కారం సాధ్యమయింది.

## 33. వాలఖిల్యులు

వాలఖిల్య వృత్తాంతాన్ని ఆంధ్రమహాభారతం సభ, అరణ్య, శాంతి, అనుశాసనికపర్వాలలో సంగ్రహంగా వర్ణితం. పురాణవాఙ్మయాన్ని పరిశీలిస్తే మునుల ఆకారాలు, స్వభావాలు, చిత్ర విచిత్రంగా వుంటాయి. వాలఖిల్యులనే మునులు అల్పసత్త్వులు, అంగుష్ఠప్రమాణదేహులు. అనవరత ఉపవాస కృశీభూత శరీరులు. వారు కశ్యప్రజాపతి చేసే పుత్రకామేష్టి యాగానికి మోదుగు కట్టెలను, దర్భలను, సమిధలను సమకూర్చేవారు. వీరి ఆకారాన్ని, వీరు చేస్తున్న పనిని చూచి పరిహసించాడు ఇంద్రుడు. ఆ కోపంతో వాలఖిల్యులు ఒళ్ళుమండి ఇంద్రునితో "రెండవ ఇంద్రుడు పుట్టు గాక" అని శపించాడు. ఇంద్రుడు వణికి కశ్యపుని ఆశ్రయించాడు. కశ్యపుడు ఒక ఇంద్రుడుండగా మరొక ఇంద్రుడేమిటని రాజుగా పక్షిజాతికి ఇంద్రుడగు గాక అని చెప్పాడు.

మునుల శాపం తప్పేమీకాదు. లోకంలో కొందరు శారీరక బలం కలవారు. మరికొందరు బలహీనులు. బలహీనులను పరిహసింపరాదు. అయినా ఆకారం చేత వాలఖిల్యులు బలహీనులు. కాని తపస్సు కారణంగా బలవంతులు. ఇదొక ధర్మప్రబోధం.

## 34. వేదవ్యాసుడు

వేదవ్యాసుడు పరాశరమహర్షి పుత్రుడు, సత్యవతీతనూజుడు, కృష్ణద్వైపాయనుడు, వేదవిభాగం చేసినవాడు, భారతసంహితారచన బంధురుడు. ఇతని ప్రసక్తి లేని పర్వం భారతంలో లేదనడం అతిశయోక్తి కాదు. వేదవ్యాసుల ధర్మప్రబోధాలను విభిన్నరీతులలో భారతంలో

పరిశీలించడానికి వీలుంది. నన్నయ భారతం గురించి చెబుతూ "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని" అని సీసపద్యం తొలిపాదంలోనే చెప్పాడు.

వ్యాసుడు జన్మించగానే తల్లి సత్యవతితో 'అమ్మా! నీవెపుడు తలిస్తే అపుడు ప్రత్యక్షమవుతా'నని పాటించిన ధర్మజ్ఞుడు, సత్యవచనుడు.

విచిత్రవీర్య, చిత్రాంగదులు అకాలమృత్యువుపాలయ్యారు. మరి అంబిక, అంబాలికకు సంతానం లేదు. భీష్ముడు తానేమో ప్రతిన దాటనన్నాడు. ఆ సమయంలో సత్యవతి వ్యాసుని తలచుకొంది. వ్యాసునితో హస్తినాపురపాలకత్వం గురించి చర్చించింది. చివరకు దేవర న్యాయంతో అంబిక, అంబాలికకు పుత్రసంతానం ప్రసాదించమంది. వ్యాసుడు సమ్మతించడం తల్లిమాట జవదాటకూడదనే నియమం ప్రకారం.

ముందుగా అంబికాగృహానికి వెళ్ళాడు వ్యాసుడు. వ్యాసుని చూడగానే సంగమ కాలంలో అంబిక కనులు మూసుకొంది. అపుడు వ్యాసుడు ఆమెకు అంధుడైన కుమారుడు జన్మిస్తాడన్నాడు. అతడే ధృతరాష్ట్రుడు. ఆ తరువాత అంబాలిక అంతఃపురానికి అడుగులు వేశాడు. వ్యాసులవారి ఆకారాన్ని చూచి అంబాలిక తెల్లబోయింది. కనుక అంబాలికకు బలవంతుడు, గుణవంతుడు, వంశవర్ధనుడయిన కుమారుడు జన్మించినా అతడు పాండురోగపీడితుడు అవుతాడని చెప్పాడు. అంబాలికకు జన్మించినవాడే పాండురాజు. అయినా సత్యవతి మాటకు కట్టుబడి మరల అంబిక అంతఃపురానికి వెళ్ళాడు. అంబిక జడుసుకొని తన దాసిని వ్యాసుని కడకు పంపింది. ఆ దాసీపుత్రుడే విదురుడు, ఇలాగ ధృతరాష్ట్ర, పాండురాజు, విదురులకు వ్యాసుడు తండ్రి అయ్యాడు.

సలహాలివ్వడంలో వ్యాసుడు దిట్ట. పాండవులు జూదంలో ఓడి అరణ్యవాసం చేస్తున్నవేళ పాండవుల దగ్గరికి వెళ్ళాడు. కౌరవులకున్న

విజయావకాశాలను స్మరిస్తూ, తర్కిస్తూ, సందేహాస్పదచిత్తుడయిన వేళ వ్యాసుడు, ధర్మరాజుకు "స్మృతి, ప్రతిస్మృతి" వరప్రదానం చేశాడు. అంతేగాక ప్రస్తుతమున్న ద్వైతవనంలో చిరకాలవాసం చేయడం తగదని సలహాలివ్వడంతో పాండవులు మకాం మార్చారు.

కురుక్షేత్రసమరం తప్పదని తేలిపోయిన వేళ ధృతరాష్ట్రుడు నిర్వేదంలో పడ్డాడు. అవ్వేళ వేదవ్యాసుడు ధృతరాష్ట్రుని దగ్గరికి వచ్చి అతని నిర్వేదాన్ని గుర్తించి కురుపాండవుల సమరం చూచే దృష్టిని ప్రసాదిస్తాడనే నమ్మకం వుందని చెప్పాడు. కాని ధృతరాష్ట్రుడు తానందుకు ఇష్టపడను అంటే సమర విశేషాలు ధృతరాష్ట్రునికి విన్నవించే బాధ్యతను సంజయునిమీద పెట్టాడు. అందుకు తగినట్లు కొన్ని వరాలిచ్చాడు. రెండువైపుల వారి దివారాత్రప్రవర్తనం చూచేశక్తి, రహస్యభాషణం, ఆలోచించే వినే సామర్థ్యం, అతిశీఘ్రగమనం, సమరం జోరుగా సాగుతుంటె ఇరువైపుల వారి అస్త్రశస్త్రాదుల నుండి రక్షణ, గట్టిదయిన శారీరక మానసికస్థితి, దివ్యుల ఆలాపం, రూపం, తలంపులు తెలిపే నేర్పరితనంలాంటివి ప్రసాదించాడు. ఇలాంటి ప్రయత్నం ఇతరత్ర జరిగినట్లు ఆధారాలు లేవు. అలాగే ఇరువైపుల ఉపాయ పౌరుషాలు గలవారు ఎవరని అడిగితే నీకు దివ్యదృష్టి ఇస్తాను. నీవే పరిశీలించుకో అన్నాడు. చివరకు వాసుదేవుని స్మరణ గూర్చి అడగగా తాను కూడా వాసుదేవుని శరణుజొచ్చినవాడనని సమాధానమిచ్చాడు.

సమరంలో ఘటోత్కచుడు వీరమరణం పొందినవేళ ఆ మరణానికి కారకుడయిన కర్ణునిపై తాను దాడికి వెడలతానని ధర్మరాజు సన్నద్ధుడయినవేళ వేదవ్యాసుడు వారించాడు. అంతేగాక సమర సమయంలో దూషణానికి దిగులు పడరాదని రాజులు, మిత్రులు, తమ్ముళ్ళను కూడగట్టుకొని, కుంగిపోక పోరాడాలని, కలతలకు అవకాశం ఇవ్వరాదని సలహా ఇచ్చాడు. అంతేగాక ధర్మరాజుతో విశ్వాసం పెరిగేలా

**"విను మేనగు దివసంబున**
**నినుఁబొందు ననూన మేదిన్ రాజ్యశ్రీ**
**యనుమానమేమియునులేదు"** అని కోరగానే భవిష్యత్తు చెప్పాడు.

అశ్వత్థామ రారాజు సంతోషంకోసం "అపాండవం కరిష్యామి" అని బ్రహ్మశిరోనామక అస్త్రాన్ని ప్రయోగించాడు. ఈ అస్త్రాన్ని ఉపసంహరించమంటే అశ్వత్థామ ససేమిరా ఒప్పుకోలేదు. అపుడు శ్రీకృష్ణుడు, వేదవ్యాసుడును అశ్వత్థామను శపించారు.

**బ్రాహ్మణుడవయ్యు నిట్లు క్రూరతకు రోయ**
**కస్మదీయ వాక్యంబు నాదరంబుసేయ కీ**
**పాపకర్మంబు సేసినాడ**
**వచ్యుతుడు పల్కినట్టుల యగుము నీవు**

అన్నాడు. పెద్దలు చెప్పినా వినకపోవడం దోషం. పెద్దలు చెప్పినవేళ వినడం ఒక ధర్మప్రబోధం.

కురుక్షేత్రసంగ్రామం అనంతరం ధృతరాష్ట్రాదులు భాగీరథీతీరంలో చేరారు. ధృతరాష్ట్రాదులు ఆశ్రమవాసం గడుపుతున్నారు. వేదవ్యాసుడు ఆ చోటికి వచ్చి "వరం కోరుకో" అన్నాడు. రారాజు మాటలతో ఎందరో మరణించారు. వారికేది గతి అని ధృతరాష్ట్రుడు అడిగాడు. సరిగ్గా అదే సమయంలో కుంతి కర్ణుని తలచుకొన్నదట. వ్యాసుడు వారి తలంపును పసిగట్టి

**నీవు సుతుల cదోడబుట్టు**
**వులను గాంతు నీదు చెలియ గొంతియు**
**కర్ణుcజూడ cగాంచు గణ్యచరిత్ర**

అన్నాడు చాలక ద్రౌపదియున్, సుభద్రయును దక్కటి కాంతలు భ్రాత పుత్ర, పౌత్రోవవిలోకనోత్సవము నొందుదు రిచ్చుట కిప్డు వచ్చుటే నీవని యాచరించుటకు

**“నిమ్మనుజేంద్రుడు నీవు గొంతి చిం**

**తాపరితాప నోదన విధంబుఁగోరితిరట్లు చేసెదన్”** అని తెలిపాడు. ఎవరూ బాధపడవలసిన అవసరం లేదని వారిని గంగానది ఒడ్డుకు చేర్చాడు. మరుసటి సూర్యోదయము అయిన పిమ్మట వేదవ్యాసుడు నదిలోకి దిగాడు. ఒడ్డున స్త్రీ, పురుషులు చూస్తుండగా నీటిలోకి దిగి “ఇటురండు” అన్నాడు. వెంటనే నదిలో విచిత్ర ధ్వని. కౌరవముఖ్యులు, కర్ణ, ద్రుపద, విరాట, శకుని, తనూజులు దివ్యాలంకారధారులయి ఒడ్డుకు చేర్చారు (వచ్చారు) ఈ వైభవం చూడడానికి వేదవ్యాసుడు ధృతరాష్ట్రునికి దివ్యదృష్టి ఇచ్చాడు. గాంధారి కంటికి కట్టిన గుడ్డను విప్పి చూడసాగింది. వారందరు దివారాత్రములు కలిసివున్నారు. మరుసటి దినము పారాశర్యుని ఆనమేరకు వారు భౌతికప్రపంచం వీడారు.

ఒక సామాన్య కీటకానికి ఉత్తమగతిని కల్పించినవాడు బాదనారాయణుడు. ఒకసారి ఎడ్లబండి వెళ్ళే మార్గాన ఒక కీటకాన్ని వ్యాసుడు చూచాడు. ఆ కీటకం ఎందుకు ఆపసోపాలు పడుతున్నావన్నాడు. నా భీతినాది. నాది ప్రాణభీతి అని కీటకమన్నది. భయంతో జీవించడం కంటే, దుఃఖశరీరం వదలడం మంచిది కదా అన్నాడు. కీటకం మా జన్మకు తగిన సుఖదుఃఖాదులు మాకుంటాయి అన్నది. ఆ సమయంలో వేదవ్యాసుడు కీటకం పూర్వజన్మ వృత్తాంతం చెప్పాడు. చివరకు పుణ్యమొకటే ఉత్తమ జన్మలకు మెట్లని బోధించాడు. అలాగే కీటకం క్రమంగా మంచి పనులు చేసి నీచ, శూద్ర, వైశ్య, జన్మలెత్తి ఆయా జన్మలలో మంచి పనులు చేయడంవల్ల పుణ్యసంపత్తి కారణంగా చివరకు బ్రాహ్మణ జన్మఎత్తి సద్విజకర్మలు చేసి వేదవ్యాసుని దర్శించి దీవెనలు అందుకొనిందట.

వేదవ్యాసుని బోధనలు, చేతలు అన్ని ఇతరులకు ఉపదేశాత్మకాలు. ఎవరికీ హాని తలపెట్టేవి కావు.

## 35. శాండిలి

ఆంధ్రమహాభారతంలోని ఉద్యోగ, అనుశాసనికపర్వాలలో ఈతని గురించి ప్రస్తావించబడినది. శాండిలి ఒక తపస్విని.

గరుత్మంతుడు గాలవునితో దేవలోకానికి వెళ్ళాలనుకొన్నాడు. మార్గమధ్యంలో ఋషభపర్వతంపై ఉన్న శాండిలిని చూశారు. భక్తితో పూజించారు. శాండిలి వారికి అతిథిమర్యాదలు సమకూర్చింది. ఆపై అక్కడే నేలపైన పరుండి స్పృహలేని విధంగా నిదురపోయారు. నిద్రానంతరం లేచిచూడగా గరుత్మంతునికి రెక్కలు కనబడలేదు. అపుడు గాలవుడు నీవిలా ఎలా అయిపోయావు. మనం ఎలా వెళ్ళగలం? ఎంతకాలం ఉండాలో ఏమో! అయినా గరుడా! ఈ ప్రదేశంలో నీకేమయినా దుష్టసంకల్పం కలిగిందా అని ప్రశ్నించాడు. గరుడుడు ఆలోచించి, గాలవా! శాండిలిని చూశాక ఆమెను కైలాసానికిగాని, వైకుంఠానికి గాని తీసుకొనిపోవాలనే సంకల్పం కలిగింది. ఆపై గరుత్మంతుడు తనకు కలిగిన దుస్సంకల్పానికి క్షమించమని కోరాడు. అపుడా శాండిలి 'నీకు తప్పక రెక్కలు వస్తాయి' అనగానే రెక్కలు వచ్చాయి. ఒకరిని దర్శించినవేళ శుభసంకల్పాలు రావాలి గాని దుష్టసంకల్పాలు రాకూడదని ధార్మిక ప్రబోధ.

## 36. శృంగి

ఆంధ్రమహాభారతంలో ఆదిపర్వంలో ప్రస్తావింపబడిన ముని శృంగి. ఈతనిని ఈశ్వరుని ప్రమథగణాలలో ఒకడుగా గణిస్తారు. ఇతనికి తాను గొప్పతపశ్శాలి అని అహంకారము వుండేదట. ఒకరోజు పరీక్షిత్తు వేటకు వచ్చి అలసి శమీకుని ఆశ్రమం చేరి దాహంకోసం వెడితే మునిలో ఎలాంటి చలనం లేకపోవడంతో పరీక్షిత్తు చచ్చిన పామును మునిమెడలో వేసి చక్కా వెళ్ళాడు. కృశుడు శృంగికి ఈ వార్తను చేరవేసి అతని

తపస్సును హేళన చేశాడట. ఆ కోపంతో వెంటనే ఆశ్రమానికి వెళ్ళి పరీక్షిత్తు చర్యకు కోపపడి "వృద్ధుడయిన నా తండ్రి మెడలో చచ్చిన పామును వేసినవాడు ఈ నాటినుండి ఏడు రోజులలో తక్షక సర్పదష్టుడయి మరణిస్తాడని శపించాడు. ఈతని చేతను చూచి శమీకమహర్షి చాలా బాధపడ్డాడు. ఈ నీచేత నాకు ఆనందాన్ని కలిగించేది కాదు. మనం పరీక్షిత్తు రాజ్యంలో ఉన్నాం. ఋషితుల్యుడయిన రాజుకు నా మౌనవ్రతం తెలియదు. కోపంతో నీతపశ్శక్తిని నాశనం చేసుకోవద్దు అంటూ పరీక్షిత్తునికి తన కుమారుని చేత సరికాదనే వార్త అందేలా చేశాడు.

లోకంలో ధర్మం అనేక రూపాలు. వేదం మాతృదేవోభవ, పితృదేవోభవ అని శాసించింది. లోకంలో ఎవరికయినా తమ తల్లిదండ్రులకు బాధ కలిగిస్తే స్పందించడం సహజం. కనుక శృంగి స్పందించాడు. మరో దృష్టితో ఆలోచిస్తే పరీక్షిత్తు చేత కూడా న్యాయబద్ధం కాదు. రాజయినా క్షణికావేశంలో సామాన్య పౌరునిలా ప్రవర్తించడం తగదని భవిష్యత్ తరాలకు ధర్మబోధనగా సాగినదీ సన్నివేశం.

## 37. సనత్సుజాతుడు

ఆంధ్రమహాభారతంలో ఉద్యోగపర్వంలో, బ్రహ్మమానసపుత్రులలో ఒకడయిన సనత్సుజాతుడు కథ ప్రస్తావితం. సనత్సుజాతుడు ధృతరాష్ట్రునికి చెప్పిన ధార్మికవిషయాలే సనత్సుజాతీయం. సంస్కృతంలో ఇది విస్తారం కాగా తెలుగున సంక్షిప్తం. విదురుడు ప్రార్థించగా ప్రసన్నమైనవాడు సనత్సుజాతుడు.

ధృతరాష్ట్రుడు అడిగిన మొదటి ప్రశ్న గురుసమాశ్రితులగువారు ఎద్దాన సుఖదుఃఖాలు, లాభాలాభాలు, ప్రియ, ద్వేషాదులులాంటి ద్వంద్వాల బారిన పడక బతుకగలుగుతారు. అద్దానిని తెలపండి అని ప్రార్థన.

సనత్సుజాతుడు ఆధ్యాత్మ విషయంబులగు, వివిధ వాక్యాలతో సూక్ష్మాంశాలను విశదీకరిస్తూ ప్రజ్ఞాచక్షుడు ఏది అడిగాడో అద్దానికి సమాధానం విశదీకరిస్తూ పరతత్వాన్ని ప్రసాదించే గూఢోక్తులు అనుగ్రహిస్తూ చెబుతుంటే తెల్లవారింది. సనత్సుజాతుడు అంతర్ధాన మయ్యాడు. సంస్కృతంలో ఏడు అధ్యాయాలలో చెప్పిన అంశాలు, తెలుగు భారతాన ఏకవాక్యంలో సంక్షిప్తంగా చెప్పబడింది. ధార్మికాంశ బోధనలో సనత్సుజాతుడు సమర్థుడు.

## 38. సహస్రపాద

ఇతని వృత్తాంతం భారతం ఆదిపర్వంలో ఉంది. సహస్రపాదుని సహపాఠి ఖగముడు. ఖగముడు అగ్నిగృహంలో ఉండగా సహస్రపాదుడు పరిహాసానికై గడ్డితో చేయబడిన పామును అతనిపై వేశాడు. అతడు భయపడి కోపించి "నీవు శక్తిలేని పామ"వు అగుమని శపించాడు. వేళాకోళానికి నేను చేసిన పనికి శాపమా అంటూ నన్ను మన్నించమని అన్నాడు. కాని ఖగముడు నా శాపానికి తిరుగులేదు. నీవు పాముగా మారి రురుని చేరినవేళ శాపవిముక్తి అన్నాడు.

రురుడు ప్రమతి మునికుమారుడు. రురుడు ప్రమద్వరను వివాహమాడాలని భావించాడు. కాని ప్రమద్వర పాముకాటుకు మరణించింది. రురుడు ఆ బాధను మరువలేక కనబడిన ప్రతిపామును చంపడానికి సిద్ధమయ్యాడు. ఆశ్రమంలో విషంలేని దుందుభాన్ని చంపడానికి సిద్ధమయితే ఆ విషరహిత సర్పం తన కథను చెప్పింది. నిన్ను చూడడంవలన శాపవిముక్తి. నీకు హితమయిన మాట చెప్పెదనని పరమధర్మమయిన అహింసాధర్మం చెప్పాడు. పరిహాసం ఎల్లవేళలా పనికిరాదు. కేవలం క్రీడగా చేసే పరిహాసచర్య కూడా కొన్ని సమయాలలో అనర్థదాయకమని ధర్మప్రబోధం.

## ప్రసిద్ధ ధార్మికసూక్తులు –
## ధర్మానికి సంబంధించిన సంస్కృతసూక్తులు

**ధర్మః కీర్తిః ద్వయమ్ స్థిరమ్**

ధర్మము, కీర్తి ఈ రెండు మాత్రమే స్థిరంగా ఉండేవి.

**ధర్మం చర**

ధర్మాన్ని ఆచరించు.

**ధర్మ ఏకో మనుష్యాణాం సహాయః పారలౌకికః**

మానవులకు పరలోకంలో సహాయపడేది ధర్మమొక్కటే.

**ధర్మ ఏవ హతో హంతి**

ధర్మాన్ని నీవు నశింపచేస్తే అది నిన్ను నశింపచేస్తుంది.

**ధర్మం జిజ్ఞాసూనాం ప్రమాణం పరమం శ్రుతిః**

ధర్మాన్ని తెలుసుకోగలవారికి వేదమే ప్రమాణం.

**ధర్మం తు చింతయత్ ప్రాజ్ఞః**

బుద్ధిమంతుడు ధర్మాన్ని గూర్చి ఆలోచించాలి.

**ధర్మక్షయకరః క్రోధః తస్మాత్ క్రోధం పరిత్యజ్య**

కోపం ధర్మాన్ని నశింపజేస్తుంది. కనుక క్రోధాన్ని వదిలిపెట్టు.

**ధర్మమన్యే వృత్తమన్యే ధనమీహంతి చ అపరే**

లోకంలో కొందరు ధర్మాన్ని, కొందరు చారిత్రాన్ని, కొందరు ధనాన్ని కోరుకుంటారు.

**ధర్మసమో నాస్తి నిధిః**

ధర్మంతో సమానమయిన నిధిలేదు.

**ధర్మసారమిదం జగత్**

ఈ జగత్తంతా ధర్మంయొక్క సారరూపమే.

**ధర్మస్య త్వరితాగతిః**

ధర్మగతి చాలా వేగం కలది. ధర్మాచరణంలో ఆలస్యం కూడదు.

**ధర్మస్య సూక్ష్మాగతిః**

ధర్మగతి సూక్ష్మమైనది.

**ధర్మాచారవిహీనాం ద్రవిణం మలసంచయః**

ధర్మాచరణ లేనివాళ్ళు సంపాదించే ధనం ధనం కాదు. మలం లాంటిది.

**ధర్మాదర్థశ్చ కామశ్చ తం ధర్మం కిం న సేవసే**

ధర్మంవల్ల అర్థమూ, కామము కలుగుతాయి కదా. అలాంటి ధర్మాన్ని ఎందుకు సేవించడం లేదు. (వ్యాసులవారి ప్రశ్న).

**ధర్మాన్న ప్రమదితవ్యమ్**

ధర్మాచరణం నుండి ఏనాడు తప్పుకోరాదు.

**ధర్మాయ ఖేదః గుణవాన్ శ్రమేభ్యః**

ధర్మంకోసం పడిన శ్రమే శ్రమలన్నిటికన్నా శ్రేష్ఠం.

**ధర్మాయ రాజా భవతి న కామకరణాయ చ**

రాజు ధర్మం కోసమే కాని కామాచరణం కోసం కాదు.

**ధర్మార్థకామః సమమేవ సేవ్యాః**

నాల్గురకాలయిన ధర్మార్థ కామ మోక్షాలనే పురుషార్థాలను సమంగా సేవించాలి. కేవలం ఒకదాని యందు ఆసక్తి చూపరాదు.

**ధర్మార్థం క్షీణకోశస్య క్షీణత్వమపి శోభిత**

ధర్మంకోసం ధనమంతా ఖర్చుపెట్టి దారిద్ర్యానికి లోనయిన అది శోభకరమే.

**ధర్మార్థప్రవృత్తే తు నృప ఏవ కారణమ్**

ప్రజలు ధర్మ, అధర్మ మార్గాలలో ప్రవర్తించడానికి రాజే కారణం.

**ధర్మార్థవిరోధేన కామం సేవేత ననిః సుఖం స్యాత్**

ధర్మార్థాలకు విరోధం లేకుండా కామసుఖాన్ని సేవించాలి. అనంత సుఖాలకు దూరంగా ఉండరాదు.

**ధర్మే తిష్ఠంతి భూతాని ధర్మో రాజని తిష్ఠతి.**

సమస్త భూతాలు ధర్మంలో నిలుస్తాయి. అట్టి ధర్మం రాజులో నిలుస్తుంది.

**ధర్మం లభతే సర్వం**

ధర్మం వల్ల సమస్తము పొందవచ్చు.

**ధర్మేణ హీనాః పశుభిః సమానాః**

ధర్మాచరణ లేనివాళ్ళు పశువులతో సమానం.

**ధర్మో మిత్రం మృతస్య చ**

మరణించినవారికి కూడా వాడు చేసుకొన్న ధర్మమే మిత్రుని లాగా సహకరిస్తుంది.

**ధర్మో రక్షతి రక్షితః**

ధర్మాన్ని నీవు రక్షిస్తే ఆ ధర్మం తిరిగి నిన్ను రక్షిస్తుంది.

**ధర్మో హి మహతం ధనమ్**

మహాత్ములకు ధర్మమే ధనము.

* * *